24-03-2024
ఆదివారం
హైదరాబాద్
సంపుటి 26, సంచిక: 276
పేజీలు: 8 | ఖమ్మం : 8+8
కరీంనగర్ : 8+8| మహబూబ్‌నగర్: 8
వెల రూ. 5.00
Published from:
Hyderabad, Khammam,
Karimnagar, Mahabubnagar
www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం



తర తరాల పిల్లల కథలు
రూ॥ 70/-
పేజీలు: 64

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.



## ఎలక్టోరల్ బాండ్స్‌పై స్వతంత్ర సిట్ దర్యాప్తు చేయాలి

### భారతదేశంలోనే అతి పెద్ద కుంభకోణం

### సుప్రీంకోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరగాలి

### ప్రశాంత్ భూషణ్ తదితర సామాజిక కార్యకర్తల డిమాండ్

**న్యూఢిల్లీ :** ఎలక్టోరల్ బాండ్స్‌కు సంబంధించి అన్ని కోణాలలో విచారణ జరిపేందుకు స్వతంత్ర ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేయాలని సామాజిక కార్యకర్తలు డిమాండ్ చేశారు. తక్షణమే ఎలక్టోరల్ బాండ్స్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. పలువురు సామాజిక కార్యకర్తలతో కలిసి ఢిల్లీలోని ప్రెస్‌క్లబ్ ఆఫ్ ఇండియా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రముఖ లాయర్ ప్రశాంత్ భూషణ్ మాట్లాడుతూ స్వతంత్ర భారతదేశంలోనే ఎలక్టోరల్ బాండ్స్ వ్యవహారం అతి పెద్ద కుంభకోణమని పేర్కొన్నారు. టెలికాం 2 జి, బొగ్గు కుంభకోణంలో డబ్బుల బదిలీ లేనప్పటికీ సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణకు అత్యున్నత న్యాయస్థానం ఆదేశించిందని గుర్తు చేశారు. ఎలక్టోరల్ బాండ్స్ వ్యవహారంలో స్పష్టం డబ్బులు బదిలీ తేటతెల్లమైందని, కాబట్టి దీనిపై కూడా సుప్రీంకోర్టు పరిధిలో విచారణ జరగాలని అన్నారు.

**బాండ్స్ ఇచ్చిన 33 కంపెనీలకు రూ.3.7 లక్షల కోట్ల కాంట్రాక్టులు**

ఎలక్టోరల్ బాండ్‌ల రూపంలో రూ,1,751 కోట్లు విరాళంగా ఇచ్చిన 33 కంపెనీలకు రూ. 3.7లక్షల కోట్ల కాంట్రాక్టులు దక్కాయని ప్రశాంత్ భూషణ్ తెలిపారు. అలాగే ఇడి, సిబిఐ, ఐటి దాడులు ఎదుర్కొన్న 41 కంపెనీలు బిజెపికి రూ.2,471 కోట్లు బాండ్‌ల రూపంలో ఇచ్చాయని, వాటిలో రూ.1,698 కోట్లు కేంద్ర సంస్థల దాడులు(రైడ్‌ల) తరువాత వచ్చాయన్నారు. మరో 30 షెల్ కంపెనీలు రూ.143 కోట్లు విరాళంగా ఇచ్చాయని తెలిపారు. ఎలక్టోరల్ బాండ్‌ల వివరాలు పరిశీలిస్తే 49 కేసుల్లో అధికార పార్టీకి రూ.580 కోట్లు బాండ్‌ల రూపంలో విరాళంగా ఇచ్చిన సంస్థలకు రూ. 62వేల కోట్ల కాంట్రాక్టులు దక్కాయని, 192 కేసుల్లో రూ.551 కోట్లు ముందుగా విరాళాలు ఇచ్చిన తరువాతే ఆ సంస్థలకు కాంట్రాక్టులు దక్కాయన్నారు. ఎలక్టోరల్ బాండ్స్ వివరాలు వెల్లడించాలని వేసిన కేసులో ప్రధాన పిటిషనర్ అసోసియేషన్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫామ్స్ (ఎడిఆర్) వ్యవస్థాపక సభ్యులు ప్రొఫెసర్ జగ్‌దీప్ ఛోకర్ మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థలు – రాజకీయ పార్టీకు మధ్య సంబంధాలు ఉన్నాయని అందరికీ తెలిసినా ఆధారాలు లేవని, కాని ఎలక్టోరల్ బాండ్ వివరాలు వెల్లడి ద్వారా ఆ బంధం తరువాయి 2లో

## ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు కేంద్ర ఏజెన్సీల దుర్వినియోగం

### మోడీ ప్రభుత్వంపై వామపక్షాల మండిపాటు

### విపక్షాలను అణిచివేసి ఎన్నికలలో నెగ్గేందుకు కుట్ర

### సిపిఐ జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా




ప్రజాపక్షం / హైదరాబాద్

లోక్‌సభ ఎన్నికల ముంగిట ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు మోడీ ప్రభుత్వం కేంద్ర ఏజెన్సీలను దుర్వినియోగం చేస్తోందని సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా మండిపడ్డారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారని, రెండు నెలల ముందు జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను అరెస్టు చేశారని, ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ బ్యాంకు ఖాతాలను సీజ్ చేశారని విమర్శించారు. ఇవన్నీ కూడా ప్రతిపక్షాలను అణిచివేసి ఎన్నికలలో నెగ్గేందుకు మోడీ ప్రభుత్వం చేస్తున్న కుట్రలు అని అన్నారు. హైదరాబాద్‌లో వామపక్షాల ఆధ్వర్యంలో ఆర్‌టిసిక్రాస్ రోడ్ వద్ద శనివారం నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన సయ్యద్ అజీజ్ పాషా ప్రసంగిస్తూ ఈ ఏడాది తరువాయి 2లో



## మద్యం అవినీతి కేసులో కవిత మేనల్లుడి పాత్ర

### ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఆరోపణ

### శరణ్ ఇంట్లో ఇడి సోదాలు

**న్యూఢిల్లీ :** ఢిల్లీ మద్యం అవినీతిలో తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు మనుమడు, కవిత మేనల్లుడు శరణ్ పాత్ర ఉందని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) ఆరోపించింది. సౌత్ గూరపు నుండి ముడుపులను అక్రమంగా తరలించడంలో కవిత మేనల్లుడు మేకా శ్రీశరణ్ పాత్ర ఉందని, ఆయన విచారణకు సహకరించడంలేదని ఇడి ఆరోపించింది. దీంతో కె.చంద్రశేఖర్ రావు కుటుంబానికి మరో సమస్య వచ్చింది. లెక్కల్లో చూపించని నిధులను అక్రమంగా ఆమ్ ఆద్మీ పార్టీకి తరలించడంలో అతడి పాత్ర ఉందని కోర్టుకు తెలియజేసింది. ఇదిలా ఉండగా, కోర్టుకు హాజరైన కవిత కోర్టు వెలుపల తరువాయి 2లో

## ఏప్రిల్‌లో కాంగ్రెస్ భారీ సభ

### మొదటివారంలో తుక్కుగూడలో ఏర్పాటుకు నిర్ణయం

### హాజరుకానున్న మల్లిఖార్జున ఖర్గే, రాహుల్ గాంధీ

### అదే రోజు తెలుగు మ్యానిఫెస్టో విడుదల

### టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి, ముఖ్య నేతల నిర్ణయం

ప్రజాపక్షం / హైదరాబాద్

రాష్ట్రంలో భారీ స్థాయిలో లోక్‌సభ ఎన్నికల శంఖారావం పూరించేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమవుతోంది. ఏప్రిల్ మొదటి వారంలో హైదరాబాద్ మహానగర శివారులోని తుక్కుగూడలో భారీ బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించింది. ఈ సభకు ఎఐసిసి జాతీయ అధ్యక్షులు మల్లిఖార్జున



ఖర్గే, జాతీయ నేత రాహుల్ గాంధీ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నరు. టిపిసిసి అధ్యక్షులు, ముఖ్యమంత్రి తరువాయి 2లో



## కెఎంఆర్‌బి బృందం నాగార్జునసాగర్ పరిశీలన

ప్రజాపక్షం/నందికొండ

నాగార్జునసాగర్ ప్రాజెక్టును కెఎంఆర్‌బి బృందం పరిశీలించింది. సాగర్ జలాశయంలో ఎంత మేర నీటి నిల్వ ఉన్నది, జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం ఉన్నప్పుడు ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో ఎంత మేరకు విద్యుత్ ఉత్పత్తి అవుతున్నది, ఎంత పరిమాణంలో నీటిని వినియోగిస్తున్నారు, ప్రధాన జల విద్యుత్ కేంద్రంలో రివర్స్ బుల్ టర్బన్ల పనితీరు, రివర్స్ బుల్ టర్బన్లు పనిచేస్తున్నప్పుడు జలాశయంలోకి నీటిని పంపే ప్రక్రియలో ఏమైనా ఇబ్బందులు తలెత్తుతున్నాయా అనే అంశాలను శుక్రవారం పరిశీలించారు. ఆ తర్వాత శనివారం నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలోని ఎడమ కాలువ హెడ్ రెగ్యులేటర్ పనితీరును, దాని పరిధిలోని జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని బృందం పరిశీలించింది అదేవిధంగా ఎడమ కాలువ గేట్ల ద్వారా నీరు విడుదల చేస్తున్న సమయంలో ఏమైనా తరువాయి 2లో



## ఉలిక్కిపడ్డ రష్యా

### ఉగ్రవాదుల భీకర దాడుల్లో 133కు చేరిన మృతులు

**మాస్కో :** ఉగ్రవాదుల భీకర దాడులతో రష్యా ఉలిక్కిపడింది. రాజధాని మాస్కోలోని క్రాకస్ సిటీ కాన్సర్ట్‌హాల్‌లో సాయుధ ముష్కరులు జరిపిన కాల్పుల్లో మృతుల సంఖ్య భారీగా పెరిగింది. ఇప్పటివరకు 133 మంది మృతిచెందారు. ఇప్పటికే కాల్పులు జరిపిన నలుగురు ఉగ్రవాదులను పోలీసులు పట్టుకోగా మరో 11 మంది అనుమానితులను అరెస్టు చేసి విచారిస్తున్నట్లు అధ్యక్షుడు పుతిన్‌కు రష్యా ఫెడరల్ సెక్యూరిటీ సర్వీసెస్ తెలిపింది. ఇస్లామిక్ స్టేట్ ఉగ్ర సంస్థ దాడులకు బాధ్యత వహిస్తూ సామాజిక మాధ్యమ ఖాతాల్లో ప్రకటన చేసింది. రష్యాలో ఉగ్రదాడులు జరిగే అవకాశం ఉందని అగ్రరాజ్యం అమెరికా నిఘావర్గాలు నెల క్రితమే హెచ్చరించాయి. అఫ్గాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఐసిస్ ఉగ్రవాదులు దాడి చేసే అవకాశం ఉన్నట్లు రష్యా నిఘావర్గాలకు చేరవేశాయి. రష్యాలోని అమెరికన్లు కూడా జాగ్రత్తగా తరువాయి 2లో



## రైతుల ఆదాయం రెట్టింపు అయిందా?

### పాలకులు రైతులను పట్టించుకోవడం లేదు

### ఎన్‌సిపి చీఫ్ శరద్ పవార్

**పుణె:** అధికారంలో ఉన్న వారు దేశంలో రైతులను పట్టించుకోవడం లేదని, 2024 నాటికి వారి ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఎన్‌సిపి (ఎస్‌పి) చీఫ్ శరద్ పవార్ విమర్శించారు. మహారాష్ట్ర పుణె జిల్లాలోని ఇందాపూర్‌లో శనివారం నిర్వహించిన ర్యాలీలో మహావికాస్ అఘాడి (ఎంవిఎ) నాయకులు సంజయ్ రౌత్, బాలాసాహెబ్ థోరట్, సుప్రియా సూలేతో కలిసి శరద్ పవార్ మాట్లాడారు. దేశంలో ప్రస్తుతం పరిస్థితులు భిన్నంగా ఉన్నాయన్నారు. ఈ లోక్‌సభ ఎన్నికలు తరువాయి 8లో

## రాష్ట్రపతి చర్యపై సుప్రీంకోర్టులో కేరళ ప్రభుత్వం పిటిషన్

**న్యూఢిల్లీ :** కేరళ అసెంబ్లీ ఆమోదించిన నాలుగు బిల్లులకు ఆమోదం తెలియజేయకుండా తొక్కిపట్టి ఉంచిన రాష్ట్రపతి ద్రౌపదీముర్ము చర్యను వ్యతిరేకిస్తూ కేరళ ప్రభుత్వం శనివారంనాడు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. కేరళలో ఎన్నికైన ప్రజా ప్రతినిధుల సభ అసెంబ్లీ ఆమోదించిన నాలుగు బిల్లులకు తమ సమ్మతిని తెలియజేయకుండా దేశ రాష్ట్రపతి ముర్ము తన వద్దనే ఉంచుకున్నారు. దీంతో తీవ్ర జాప్యం జరుగుతున్నది. కేరళ గవర్నర్ ఈ బిల్లులను రాష్ట్రపతికి పంపించారు. కేరళ ప్రభుత్వం తరపున న్యాయ



వాది సికె.శశి సుప్రీంకోర్టులో ఈ మేరకు ఒక పిటిషన్ దాఖలు చేశారు. కేరళ గవర్నర్ ఏడు బిల్లులను తన వద్ద తరువాయి 2లో

## బలహీనవర్గాల గృహ నిర్మాణాలకు ఉచితంగా ఇసుక

### గ్రామాలలో స్థానికుల గృహ నిర్మాణాలకు కూడా వర్తింపు

### రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

ప్రజాపక్షం / హైదరాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో నిర్మాణ పనులకు ఇసుక కొరత లేకుండా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బలహీనవర్గాల గృహ నిర్మాణాల కోసం, గ్రామాలలో స్థానికుల సొంత గృహ నిర్మాణాల కోసం స్థానికంగా



ఉండే వాగుల నుంచి ఇసుకను ఉచితంగా ఉపయోగించుకునేందుకు అనుమతించాలని ప్రభుత్వం అన్ని జిల్లా కలెక్టర్లను ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర తరువాయి 2లో

## బిఆర్‌ఎస్‌కు వచ్చిన ఎన్నికల బాండ్లు రూ.1,300 కోట్లు

### రియల్ ఎస్టేట్, ఫార్మా, కాంట్రాక్టర్ల నుండి భారీగా బాండ్ల సొమ్ము దండుకున్న బిఆర్‌ఎస్, బిజెపి




**హైదరాబాద్ :** సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు భారత ఎన్నికల సంఘం వెబ్‌సైటులో నమోదు చేసిన ఎన్నికలబాండ్ల కొనుగోలుదారుల వివరాలు ఆశ్చర్యకరంగా ఉన్నాయి. ''నేను నీకు ఇంత లాభం చేకూరుస్తా, నువ్వు నాకు ఇంత లాభం చేకూర్చు'' అనే ఒప్పందం ప్రాతిపదికపైనే భారీ స్థాయిలో పార్టీలకు విరాళాలు ముట్టినట్లు తెలుస్తున్నది. హైదరాబాద్‌లో భూములపై కన్నేసిన రియల్ ఎస్టేట్ కంపెనీలు ఎన్నికల బాండ్లు కొని పార్టీలకు విరాళాలుగా వాటిని సమర్పించాయి. బిజెపి, బిఆర్‌ఎస్ పార్టీలు రియల్ ఎస్టేట్ వ్యాపారుల నుండి ప్రభుత్వ కాంట్రాక్టులు పొందినవారి నుండి, ఫార్మా కంపెనీల నుండి కోట్లాది రూపాయలు బాండ్ల రూపంలో విరాళాలను దండుకున్నాయి. ఈ వివరాలు గమనించినప్పుడు ఈ పార్టీ ఆ పార్టీ అనే తర తమ భేదాలు లేకుండా ఒక పార్టీకి చెందిన బడా వ్యాపారి ఇతర పార్టీలకు కూడా కోట్లాది రూపాయలు విరాళాలుగా సమర్పించుకున్నట్లు ఎన్నికల బాండ్ల ద్వారా తేటతెల్లమవుతున్నది. బిజెపి ఎంపి సిఎం రమేశ్‌కు చెందిన రిత్విక్ ప్రాజెక్ట్స్ కాంగ్రెస్‌పార్టీకి రూ.3 కోట్లు విరాళం ఇచ్చింది. డాక్టర్ రెడ్డీస్, హెటిరో, దివిస్ ల్యాబ్, సన్ ఫార్మా, ఆరబిందో కంపెనీలన్నీ బిజెపి, బిఆర్‌ఎస్‌లకు భారీగా విరాళాలు ఇచ్చాయి. మేఘా, మైహోం, రాజపుష్ప, వాసవి, సంధ్యం, వంశీరామ్ తదితరులంతా బిఆర్‌ఎస్ నాయకకుల సన్నిహితులే. దేశంలో గడచిన ఐదేళ్ళలో భారీస్థాయిలో రూ.6,600 కోట్ల మేరకు ఎన్నికల బాండ్ల ద్వారా పార్టీ విరాళాలు సమకూర్చుకున్న బిజెపి తర్వాత ఈ జాబితాలో జాతీయ స్థాయిలో కె.చంద్రశేఖర్‌రావు నాయకత్వంలోని బిఆర్‌ఎస్‌పార్టీ నాలుగోస్థానంలో ఉంది. రాజకీయాలు, విమర్శలు, ప్రతి విమర్శలు ఈ పార్టీల మధ్యే తప్ప విరాళాల సేకరణ విషయంలో మాత్రం ఆ భేదాలు లేవు. బిఆర్‌ఎస్‌లో పార్టీ నాయకుడు తన కంపెనీ నుండి బిజెపికి, కాంగ్రెస్‌కు విరాళాలు అందజేయగా, బిజెపిలో నాయకుడు తన వ్యాపార కంపెనీల నుండి బిఆర్‌ఎస్‌కు, కాంగ్రెస్‌కు కూడా విరాళాలు సమకూర్చారు. వీటితోపాటు తరువాయి 2లో

## మద్య నియంత్రణ ఎలా?

### విచ్చలవిడిగా బెల్ట్‌షాపులు



ప్రజాపక్షం/ ఖమ్మం

'కుండమూాయ మూకుడు ఉంటుంది కానీ నోరుమూయ ఏముంటుంది' అన్నది పాత సామెత. బారుషాపులు మూయవచ్చు కానీ బెల్ట్ షాపులు మూయడం ఎలా అన్నది ఇప్పుడు అధికారులకు అంతు చిక్కడం లేదు. లైసెన్స్ మద్యం షాపులు, బార్ అండ్ రెస్టారెంట్లకు సంబంధించి సమస్త సమాచారం అధికార యంత్రాంగం వద్ద ఉంటుంది కాబట్టి వాటిని నియంత్రించడం చాలా తేలిక. సమయపాలన, మద్యం నాణ్యత, ధరలు తదితర విషయాలను పరిశీలించవచ్చు. కానీ బెల్ట్‌షాపులకు హద్దు పొద్దు రెండు లేవు. వీటికి సమయపాలన అసలే పట్టదు. 24 గంటలు మద్యం విక్రయాలు జరుగుతూనే ఉంటాయి. ఇక ధరల వ్యవహారం వీరికి అసలు పట్టదు. ఎంఆర్‌పిపై రూ. 25 నుంచి రూ. 50 వరకు అదనంగా విక్రయిస్తుంటారు. ఎన్నికల వేళ అధికారులు మద్యాన్ని నియంత్రించాలని, విచ్చలవిడి విక్రయాల వల్ల శాంతిభద్రతల సమస్యల తలెత్తుందని భావిస్తున్నారు. మద్యం దుకాణదారులకు ఎన్నికల వేళ ప్రత్యేకమైన నిబంధనలు వర్తింపజేయవచ్చు. కానీ మద్యం వ్యాపారులు ఎంఆర్‌పిపై తరువాయి 2లో

## ఎదురు కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతి

**ప్రజాపక్షం/భద్రాచలం :** చర్ల సరిహద్దు ప్రాంతమైన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బిజాపూర్ జిల్లాలో శనివారం చోటు చేసుకున్న ఎదురు కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. వివరాల ప్రకారం. బిజాపూర్ జిల్లాలోని అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలకు మావోయిస్టులు తారసపడ్డారు. దీంతో లొంగిపోవాలంటూ హెచ్చరించినప్పటికీ మావోయిస్టులు కాల్పులకు తెగబడ్డారు.. దీంతో ఆత్మరక్షణ కోసం భద్రతా బలగాలు సైతం ఎదురు కాల్పులకు దిగాయి. ఇరు వర్గాల మధ్య సుమారు రెండు గంటల పాటు హోరా హోరీన కాల్పుల మోత మోగింది. ఈ దాడిలో ముగ్గురు మావోయిస్టులు హతమయ్యారు. అడవుల్లోనికి జారుకున్న వారి కోసం బలగాలు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టాయి.

## ఏకపక్ష ఎన్నికలకు బిజెపి కుట్ర




**ప్రజాపక్షం /హైదరాబాద్ :** దేశంలో ఎన్నికలు ఏకపక్షంగా జరిగేందుకు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి కుట్ర పన్నుతోందని టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షులు జి.నిరంజన్ విమర్శించారు. గాంధీభవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షాలను టార్గెట్ చేస్తూ బిజెపి కేంద్ర ఏజెన్సీలను ఉపయోగించి, ప్రతిపక్ష పార్టీల, ప్రతిపక్ష నాయకుల దృష్టి ఎన్నికలపై కాకుండా ఉక్కిరి బిక్కిర చేసే ప్రయత్నం చేస్తున్నదన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలైన ఇడి, ఐటి, సిబిఐలు ఎన్నికల కమిషన్ కు సమాచారం ఇవ్వకుండా ఎటువంటి దాడులు చేయకూడదని జారీ చేయాలని డిమాండ్ చేశారు. తద్వారా దేశంలో స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరుగడానికి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

## మదర్సా విద్యా బోర్డు రాజ్యంగ విరుద్ధం

### స్పష్టం చేసిన అలహాబాద్ హైకోర్టు
### లౌకిక వాదానికి వ్యతిరేకమని వ్యాఖ్య

**అలహాబాద్:** ముస్లిం విద్యార్థులకు ఉద్దేశించి ప్రత్యేకంగా మదర్సా విద్యా బోర్డు చట్టాన్ని తీసుకురావడం రాజ్యాంగ విరుద్ధమని అలహాబాద్ హైకోర్టు స్పష్టం చేసింది. ఇది లౌకిక వాదానికి వ్యతిరేకమని వ్యాఖ్యానించింది. ఉత్తరప్రదేశ్ మదర్సా విద్యా బోర్డు చట్టం 2004ను వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణను చేపట్టిన జస్టిస్ వివేక్ చౌదరి, జస్టిస్ సుభాష్ విద్యార్థితో కూడిన అలహాబాద్ హైకోర్టు ధర్మాసనం తన తీర్పులో ఈ చట్టం చెల్లదని పేర్కొంది. మతాల ఆధారంగా విద్యా బోర్డులను ఏరాఇ్పటు చేసే అధికారం ప్రభుత్వాలకు లేదని తేల్చిచెప్పింది. ఒక మతానికి సంబంధించిన విశ్వాసాలు, ఇతర సమాచారాన్ని మాత్రమే అందించే విద్యా బోర్డులు భారత దేశం అనుసరిస్తున్న లౌకిక విధానానికి వ్యతిరేకమని ధర్మాసనం వ్యాఖ్యానించింది. మన రాజ్యాంగంలో అత్యంత కీలకమైన అంశాల్లో లౌకిక వాదం ఒకటని పేర్కొంటూ, ఇతర మతాలకు చెందిన విద్యార్థులు అన్ని రకాల పాఠ్యాంశాలను చదువుకునే అవకాశం ఉండగా, ఒక మతానికి చెందిన విద్యార్థులకు ఆ హక్కు దక్కకుండా చేయడం రాజ్యాంగంలోని 21, 21 ఎ అధికరణల కింద తగదని పేర్కొంది. విద్యను అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని, కాబట్టి, ప్రభుత్వాలు మత ప్రాతిపదికగా విద్యా చట్టాలను రూపొందించడాన్ని రాజ్యాంగం అంగీకరించదని ధర్మాసనం తెలిపింది. రాజ్యాంగ సూత్రాలకు, స్ఫూర్తికి విరుద్ధంగా రూపొందిన ఎలాంటి చట్టాలైనా రద్దు కావాల్సిందేనని తెలిపింది. ఇతర మతస్తులు ఆధునిక విద్యను పొందుతుండగా, ముస్లిం విద్యార్థులను మతానికి పరిమితం చేయడం అన్యాయమని పేర్కొంటూ, మదర్సా విద్యా చట్టాన్ని రద్దు చేయాలని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని ఆదేశించింది.

## కేరళ ప్రభుత్వం పిటిషన్

(మొదటి పేజీ తరువాయి)

ఉంచుకున్నారు. వీటిల్లో నాలుగు బిల్లులను రాష్ట్రపతి పరిశీలన నిమిత్తం పంపించారు. ఈ విధంగా బిల్లులకు అనుమతి ఇవ్వకుండా ఆపేయడం రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించాలని సుప్రీంకోర్టును కేరళ ప్రభుత్వం కోరింది. ఐతే ఈ ఏడు బిల్లులలోనూ కేంద్ర రాష్ట్ర సంబంధాలకు విఘాతం కలిగించే అంశాలు అస్సలు లేనే లేవని కూడా కేరళ ప్రభుత్వం తరపున న్యాయవాది శశి సుప్రీంకోర్టుకు తెలియజేశారు. రెండు సంవత్సరాలుగా ఈ బిల్లులు కేరళ గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. ఈ చర్యలవల్ల కేరళ రాష్ట్రంలో ప్రభుత్వ పరిపాల కుప్పకూలిపోతోందని కూడా ఆ పిటిషన్‌లో కోర్టుకు న్యాయవాది తెలియజేశారు. ఈ బిల్లులన్నీ ప్రజల ప్రయోజనాలకు సంబంధించినవేనని ఆ పిటిషన్‌లో కేరళ ప్రభుత్వం తెలియజేసింది. రాజ్యాంగంలోని 200 నిబంధన ప్రకారం వీలైనంత త్వరగా ఈ బిల్లులను క్లియర్ చేయాలని కోర్టుకు కేరళ ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. ఫిబ్రవరి 23,29 తేదీలలో కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వశాఖ ఇచ్చిన సమాచారం ప్రకారం నాలుగు కేరళ బిల్లులను రాష్ట్రపతి సమ్మతిని తెలియజేయకుండా తిరస్కరించారు. వీటిల్లో యూనివర్సిటీ చట్టాల సవరణ బిల్లు–2021, కేరళ సహకార సంఘాల సవరణ బిల్లు–2022, యూనివర్సిటీ చట్టాల సవరణ బిల్లు–2022 బిల్లులు ఉన్నాయి.

## ఉచితంగా ఇసుక

(మొదటి పేజీ తరువాయి)

మైన్స్, జియాలజీ ముఖ్య కార్యదర్శి మహేష్ దత్ ఎక్కా శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. వివిధ గ్రామాల నుంచి ప్రజలు తమ ఇళ్ల నిర్మాణాలు, స్థానిక అవసరాలకు ఇసుక రవాణాకు అనుమతి ఇవ్వాలని గ్రామీణ ప్రజల విజ్ఞప్తుల మేరకు తెలంగాణ రాష్ట్ర ఇసుక తవ్వకాల నియమాలు– 2015 అమలు చేయాలని నిర్ణయించినట్లు ఉత్తర్వుల్లో ప్రభుత్వం తెలియజేసింది. చట్టంలోని రూల్ 3 (1) ప్రకారం I, II, III ఆర్డర్ స్ట్రీమ్‌లలో ఇసుక వెలికితీత, స్థానిక వినియోగం కోసం లభ్యతపై ఎప్పటికప్పుడు జారీచేసే సూచనలు, మార్గదర్శకాలను అధికారులు అమలు చేయాలని ఉత్తర్వులలో ప్రభుత్వం సూచించింది. లోకల్ గా ఇసుక కొరత ఉండొద్దు, గ్రామాల్లో నిర్మాణాలు ఆగిపోవద్దని, స్థానిక అవసరాలకు ఉచిత అనుమతించాలని ప్రభుత్వం జిల్లా కలెక్టర్లకు ఆదేశాలిచ్చింది. స్థానిక అవసరాలకు సరిపడే ఇసుక రవాణాకు అనుమతించాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలిచ్చింది. ఈ నేపథ్యంలో గ్రామాల్లో నిర్మాణాలకు ఆటంకం లేకుండా స్థానిక అవసరాలకు సమీపంలోని వాగుల నుంచి ఇసుకకు ఉచితంగా అనుమతి ఇవ్వాలని ప్రభుత్వం భావించిందని తెలిపింది. అవసరమున్న వారు ట్రాక్టర్లు, ఎడ్ల బండ్ల ద్వారా ఉచితంగా ఇసుక రవాణా చేసుకునేందుకు అనుమతించాలని ప్రభుత్వం అధికారులకు సూచించింది. నిబంధనలను ఉల్లంఘించినట్లయితే సంబంధిత బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఈ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ఈ వియంలో ఎలాంటి ఉల్లంఘనలు జరిగినా నిబంధనల ప్రకారం సంబంధిత అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకోనున్నట్లు ప్రభుత్వం హెచ్చరించింది.

## నాగార్జునసాగర్ పరిశీలన

(మొదటి పేజీ తరువాయి)

ఇబ్బందులు తలెత్తుతున్నాయా అని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కెఎంఆర్‌బి బృంద సభ్యులు ఆర్ ఎన్ శంఖు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు శివశంకరయ్య,రఘునాద్, సాగర్ ప్రాజెక్టు అధికారులు ఎస్ఇ నాగేశ్వరరావు, ఇఇ మల్లికార్జునరావు, డిఇ లు శ్రీనివాసరావు, పాపారావు, ఏఈలు కృష్ణయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.



భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల 93వ వర్ధంతిని పురస్కరించుకొని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్దుం భవన్‌లో భగత్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఎస్. జ్యోతి, గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ నాయక్, లక్ష్మీనారాయణ, రాజకుమార్, తదితరులు

# ఆప్ కార్యాలయాన్ని మూసివేశారు : అతిషి



**న్యూఢిల్లీ :** ఢిల్లీలోని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కార్యాలయాన్ని అన్ని వైపుల నుంచి మూసివేశారని ఆ పార్టీ సీనియర్ నేత అతిషి పేర్కొన్నారు. ఈ విషయమై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. తమ పార్టీ కార్యాలయాన్ని ఎందుకు మూసివేశారని అతిషి 'ఎక్స్' వేదికగా ప్రశ్నించారు. ఈ చర్య రాజ్యాంగంలో వాగ్దానం మేరకు క్షేత్రస్థాయిలో ఎన్నికల్లో పోటీ చేయాలన్న భావనకు వ్యతిరేకంగా ఉందని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో జాతీయ పార్టీ కార్యాలయంలోకి ప్రవేశించకుండా ఎలా ఆపుతారని మండిపడ్డారు. పార్టీ కార్యాలయంలోకి అన్ని రకాల ప్రవేశాలను కేంద్ర ప్రభుత్వం నిలిపివేసిందని మరో ఆప్ సీనియర్ నేత, ఢిల్లీ మంత్రి సౌరభ్ భరద్వాజ్ ఆరోపించారు. తాము ఇసిని ఆశ్రయిస్తామని, ఐటిఒలోని ఆప్ ప్రధాన కార్యాలయంలోకి వెళ్లనీయకుండా కేంద్ర ప్రభుత్వం ద్వారాలు మూసివేసిందన్నారు. విలేకరుల సమావేశంలో భరద్వాజ్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం తటస్థంగా వ్యవహరించాలని, పోలీసు అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. తనతోపాటు అతిషి సహా ఇద్దరు మంత్రులను పార్టీ కార్యాలయానికి వెళ్లకుండా అడ్డుకున్నారని భరద్వాజ్ చెప్పారు. అతిషి ఇంటికి వెళ్తున్న వాహనాన్ని కూడా పోలీసులు అడ్డుకున్నారని పేర్కొన్నారు.

**భారీగా పోలీసుల మోహరింపు**

అరవింద్ కేజ్రీవాల్ అరెస్టుకు వ్యతిరేకంగా నిరసన తెలిపేందుకు షాహీద్ పార్కుకు రావాలని ఆప్ పిలుపునిచ్చిన నేపథ్యంలో శనివారం సెంట్రల్ ఢిల్లీలో భద్రతా సిబ్బంది కవాతు నిర్వహించారు. షహీది పార్క్‌కు వెళ్లే రోడ్లన్నీ మూసివేశారు. ర్యాలీ నిర్వహించినా, నిరసన తెలిపినా చర్యలు ఉంటాయని సీనియర్ అధికారి హెచ్చరించారు. కాగా, భారీగా బారికేట్లు ఏర్పాటు చేయడం, పోలీసులు పెద్ద ఎత్తున మోహరించడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

## ఉలిక్కిపడ్డ రష్యా

(మొదటి పేజీ తరువాయి)





ఉండాలని, కాన్సర్టులు, ప్రజలు గుమిగూడే ప్రదేశాలకు దూరంగా ఉండాలని పేర్కొన్నాయి. రష్యా దీన్ని పెడచెవిన పెట్టింది. ఐదోసారి అధ్యక్షుడిగా ఎన్నికైన పుతిన్ అమెరికా హెచ్చరికలను బహిరంగంగా ఖండించారు. రష్యా సమాజాన్ని అస్థిరపరచేలా, భయపెట్టేలా అమెరికా దాని మిత్రదేశాలు ప్రకటనలు చేస్తున్నాయని ఆరోపించారు. మాస్కోలోని 6వేల మంది సామర్థ్యం కలిగిన క్రాకస్ సిటీ కాన్సర్ట్‌హాల్‌లో ముష్కరులు చొరబడి ఒక్కసారిగా కాల్పులకు ఒడిగట్టారు. గత 2 దశాబ్దాల్లో రష్యాలో ఇదే అతిపెద్ద ఉగ్రదాడి. పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో గురిపెట్టి ముష్కరులు పౌరుల ప్రాణాలు తీశారు. చనిపోయిన వారిలో చిన్నారులు కూడా ఉన్నారు. అనంతరం అక్కడ భారీగా అగ్నిప్రమాదం సంభవించింది. వాటిని అదుపు చేసేందుకు గంటల తరబడి అగ్నిమాపక సిబ్బంది శ్రమించారు. రష్యా వ్యాప్తంగా భద్రతను ప్రభుత్వం కట్టుదిట్టం చేసింది. అన్ని ఈవెంట్లను రద్దు చేశామని, తదుపరి ఆదేశాలు వచ్చేంత వరకూ ఎలాంటి వేడుకలకు అనుమతి లేదని రష్యా నేషనల్ గార్డు ప్రకటించింది.

ఉక్రెయిన్ హస్తముందన్న రష్యా!

ముష్కరులకు ఉక్రెయిన్‌తో పరిచయాలు ఉన్నాయని, దాడుల అనంతరం ఆ దేశం వైపు వెళ్లేందుకు యత్నించారని రష్యా భద్రత సంస్థ (ఎఫ్ఎస్‌బి) ఆరోపించింది. అయితే తమకేమీ సంబంధం లేదని ఉక్రెయిన్ ఖండించింది. రష్యాఉక్రెయిన్ యుద్ధానికి ఈ ఘటనతో సంబంధం ఉన్నట్లు ఇప్పటివరకు ఆధారాలేమీ లేవని అమెరికా వెల్లడించింది. దాడికి పాల్పడింది తామేనంటూ ఇస్లామిక్ స్టేట్ ఇప్పటికే ప్రకటించుకుంది. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ఆదుకునేందుకు రక్తం, ప్లాస్మా దానానికి వందల మంది ప్రజలు బారులు తీరారని అధికారులు తెలిపారు.

తీవ్రంగా ఖండించిన భారత్

మాస్కోలో ఉగ్రదాడిని భారత ప్రధాని మోదీ తీవ్రంగా ఖండించారు. విపత్కర పరిస్థితుల్లో రష్యా ప్రజలకు భారత్ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. బాధిత కుటుంబాలు త్వరగా ఈ బాధ నుంచి బయటపడాలని, క్షతగాత్రులు కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ ఉగ్రదాడి పిరికి పంద చర్యగా ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి అభివర్ణించింది. క్రాకస్ సిటీ హాల్ దాడిపై చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ విచారం వ్యక్తం చేశారు. చైనా అన్ని రూపాల్లోని ఉగ్రవాదాన్ని వ్యతిరేకిస్తుందన్నారు. జాతీయభద్రత, స్థిరత్వాన్ని కాపాడేందుకు రష్యా చేస్తున్న ప్రయత్నాలకు మద్దతునిస్తామని ప్రకటించారు.

## కవిత మేనల్లుడి పాత్ర

(మొదటి పేజీ తరువాయి)

మీడియాతో మాట్లాడారు. ''ఇది వట్టి మోసపూరితమైన కేసు, తప్పుడు కేసు, మేం పోరాడుతున్నాం, ఎన్నికల సమయంలో ఎంతోమంది రాజకీయ నాయకులను బిజెపి ప్రభుత్వం అరెస్టు చేస్తోంది, ఇవన్నీ తప్పుడు నిర్ణయాలు, ఎన్నికల సంఘం ఈ విషయంలో జోక్యం చేసుకోవాలి, దేశంలో ప్రజాస్వామ్యాన్ని రక్షించాలి'' అని కవిత అన్నారు. ''ప్రజలు కూడా బాగా ఆలోచించాలి, ఎందుకని దేశంలో అనేకమంది రాజకీయ నాయకులను ఎన్నికల సమయంలోనే అరెస్టులు చేస్తున్నారో?'' అని కవిత మీడియాతో అన్నారు. సౌత్ గ్రూపు నుండి రూ.100 కోట్లు ముడుపులు కేజ్రీవాల్‌కు లభించడంతో ఆమె ఒక సాక్షి మాత్రమే అని ఇన్నాళ్ళూ దర్యాప్తు అధికారులు అన్నారు, తర్వాత ఆమె పాత్ర ఉందని ఇడి అధికారులు ఆరోపించారు. ఆమ్ ఆద్మీపార్టీకి ముడుపులు అందజేయడంతో కవిత కూడా ఒక కీలక పాత్రధారి అని ప్రత్యేక న్యాయస్థానంలో ఇడి వాదించింది. ''ఆయన (శరణ్) దగ్గర ఉన్న సమాచారం ఈ కేసులో ఎంతో కీలకమైనది, కానీ ఆయన దర్యాప్తు అధికారులకు సహకరించడంలేదు, ఆయన నివాసంలో శనివారంనాడు తనిఖీలు జరుగుతున్నాయి, ఆయన కోర్టులో హాజరుకావడంలో విఫలం అవుతున్నారు, ఈ కేసులో ఆయన వద్ద సమాచారం ఉంది, నోటీసులు ఇచ్చినా స్పందన లేదు'' అని కోర్టుకు ఇడి తెలియజేసింది. గడచిన ఏడు రోజులుగా జరుగుతున్న పరిణామాలలో ఈ పేరు కొత్తగా తెరమీదకు వచ్చింది. అదేవిధంగా ఈ కేసులో సమీర్ మహేంద్రను విచచారణ జరపడానికి అనుమతించాలని కూ డా కోర్టును ఇ డి కోరింది. మార్చి 15న కవిత నివాసంలో ఇడి అధికారులు సోదాలు చేసినప్పుడు కూడా శరణ్ ఆ సమయంలో అక్కడ హాజరయ్యారు.కొద్ది గంటల తేడాలోనే కవితను, కేజ్రీవాల్‌ను ఇడి అధికారులు అరెస్టు చేశారు. ఈ కేసులో ఇప్పటికే ఆప్ నాయకులు మనీశ్ శిసోడియా, సంజయ్ సింగ్ లను ఇడి అరెస్టు చేసింది.

**26 వరకూ కవిత కస్టడీ పొడిగింపు**

మద్యం అవినీతి కేసులో ఇడి అదుపులో ఉన్న తెలంగాణ ఎంఎల్‌సి కె.కవిత కస్టడీని మరో మూడు రోజులు పొడిగించారు. ఈ మేరకు సిబిఐ ప్రత్యేక కోర్టు ఇడికి అనుమతి ఇచ్చింది. శనివారంనాటితో కస్టడీ గడువు ముగిసిపోవడంతో ఇడి అధికారులు కవితను కోర్టులో హాజరుపరిచారు. తమకు మరింత గడువు కావాలని కోరారు. దాంతో ఆమెను ఇడి అధికారులు విచారణ జరిపేందుకు కస్టడీని మరో మూడు రోజులు పొడిగిస్తూ కోర్టు ఆదేశాలు ఇచ్చింది. ఇప్పటివరకూ విచారణలో జరిగిన పురోగతిని కూడా ఇడి అధికారులు సదరు న్యాయమూర్తికి తెలియజేశారు. ఇడి ఇప్పటివరకూ జరిగిన కేసు వివరాలు, కేసు పురోగతిని కూడా న్యాయమూర్తికి వెల్లడించింది. బిఆర్‌ఎస్ నాయకురాలు, శాసన మండలి సభ్యురాలు కూడా అయిన కవితను మార్చి 15వ తేదీన ఇడి అధికారులు అరెస్టు చేశారు.

## సిట్ దర్యాప్తు చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

బట్టబయలైందన్నారు. ఎన్నికల నిధుల విషయంలో పారదర్శకత ఉండాలనే ఉద్దేశ్యంతోనే తాము పోరాటం చేస్తున్నామని, ఎన్నికల్లో ఖర్చు చేసేదంతా ప్రజాధనమేనని ఆయన అన్నారు. ఆర్‌టిఐ కార్యకర్త అంజలి భరద్వాజ్ మాట్లాడుతూ ఎలక్టోరల్ బాండ్‌లలో 95 శాతం బాండ్‌లు అధిక ధర కలిగినవేనని, ఇది బడా కార్పొరేట్ సంస్థల అవినీతిని స్పష్టం చేస్తున్నదన్నారు. ఎలక్టోరల్ బాండ్స్ విక్రయించే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) ఎంత వరకు స్వతంత్రంగా పని చేస్తుందో అనే అంశంపై కూడా ఆమె సందేహం వ్యక్తం చేశారు.

**పైథాన్ కోడ్ ఉంటే ఎస్‌బిఐకి జూన్ వరకూ గడువెందుకు?**

ఎన్నికల బాండ్ల బాగోతంపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో ప్రత్యేక దర్యాప్తు (సిట్) కు ఒక బృందాన్ని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్‌పార్టీ డిమాండ్ చేసింది. వివిధ కంపెనీలపై దాడులు చేయడానికి ముందు, దాడులు చేసిన తర్వాత బిజెపికి సమర్పించుకున్న విరాళాల వ్యవహారాన్ని బయటకు తీసేందుకు ఈ ప్రత్యేక దర్యాప్తు అత్యంత అవసరమని కాంగ్రెస్‌పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ శనివారం ఢిల్లీలో జరిగిన పత్రికాగోష్ఠిలో డిమాండ్ చేశారు.ప్రధానమంత్రి నరేంద్రమోడీపై తీవ్రస్థాయిలో ఆయన ధ్వజమెత్తారు. విరాళాల సేకరణ కోసం బిజెపి ప్రభుత్వం నాలుగు రకాల మోసాలకు పాల్పడిందని ఆయన విమర్శించారు. అరెస్టు చేయకముందు పార్టీకి సొమ్ములు ఇవ్వడం, అరెస్టు చేసిన తర్వాత బాండ్లు కొనుగోలు చేయడం, బెదిరించి డబ్బు వసూలు చేయడం, డొల్ల కంపెనీలు సృష్టించి ధనాన్ని మాయం చేయడం వంటి పద్ధతుల్లో బిజెపి బాహాటంగా అవినీతి చర్యలకు పాల్పడిందనీ, వీటిపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరగాలనీ ఆయన డిమాండ్ చేశారు. దేశంలో 179 మేజర్ కాంట్రాక్టులు, ప్రాజెక్టులు పొందిన 38 కార్పొరేట్ గ్రూపులను ఈ పైథాన్ కోడ్ ఉపయోగించి విశ్లేషణ చేశామని అన్నారు. కేంద్ర ప్రభుత్వంతోపాటు, బిజెపి పాలిత రాష్ట్రాలలో ప్రభుత్వాలకు ఈ కంపెనీలన్నీ విరాళాలు ఇచ్చాయని జైరామ్ రమేశ్ చెప్పారు. దేశవ్యాప్తంగా ఈ కంపెనీలన్నీ రూ.3.80 లక్షలకోట్లు విలువైన కాంట్రాక్టులను సంపాదించుకున్నాయనీ, అందుకు బదులుగా రూ.2,004 కోట్లు బాండ్ల రూపంలో కొనుగోలు చేసి విరాళాలుగా సమర్పించుకున్నాయని చెప్పారు.

దేశం నుండి తరలిపోయిన నల్లధనాన్ని తిరిగి వెనక్కు తీసుకువస్తామని ప్రజలకు వాగ్దానం చేసిన ప్రధానమంత్రి వాగ్దానం నెరవేర్చడానికి బదులుఆ అవినీతిని చట్టబద్ధం చేశారని, ఈ విషయం బయట పడిపోవడంతో నిస్పృహ చెందిన బిజెపి దానిని రహస్యంగా దాచిపెట్టేందుకు నానా తంటాలు పడుతోందని విమర్శించారు. అదేవిధంగా అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో పచ్చి అబద్ధాలు వల్లెవేసిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బండారాన్ని బయటపెడుతూ ఆయన ''పైథాన్ కోడ్''ను కూడా విడుదల చేశారు. ఈ పైథాన్ కోడ్ అనేది కంప్యూటర్‌లలో వెబ్‌సైట్లు, సాఫ్ట్‌వేర్‌లను వివిధ అవసరాలకోసం నిర్మించే సమయంలో ఒక కంప్యూటర్ లాంగ్వేజ్‌గా ఉపయోగిస్తారు. అత్యంత సంక్లిష్టమైన లక్ష్యాలను ఈ ''పైథాన్ కోడ్'' చాలా సులభంగా పరిష్కరిస్తుంది. అంటే గడచిన ఐదేళ్ళుగా ఎన్నికల బాండ్లను కొనుగోలు చేసిన వివిధ కంపెనీలు, వాణిజ్య సంస్థల పేర్లు, పార్టీలకు విరాళాలు ఇచ్చిన దాతలపేర్లు ఎంత చిందర వందరగా ఉన్నాగానీ కేవలం 15 సెకండ్ల వ్యవధిలోనే ఆ సమాచారం అంతా ఒక్క చోటకు చేరిపోతుంది. అంటే ఏ కంపెనీ తరపున ఏ దాత ఏ పార్టీకి ఎంత విరాళం ఇచ్చారు? అనే విషయాలన్నీ సెకన్ల వ్యవధిలోనే ఈ ''పైథాన్ కోడ్'' ద్వారా వెల్లడి అవుతుంది. ఇంత పెద్ద సాఫ్ట్‌వేర్ లాంగ్వేజ్‌ను అందుబాటులో ఉంచుకుని కూడా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మాత్రం సుప్రీంకోర్టులో దాతలపేర్లు వెల్లడించడానికి నాలుగు నెలలు సమయం పడుతుందని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని జైరామ్ రమేశ్ విమర్శించారు. బిజెపి ప్రయోజనాలకోసమే ఎస్‌బిఐ తో ఈ విధంగా కోర్టులో అసత్యాలు చెప్పించారని జైరామ్ రమేశ్ విమర్శించారు.

# నన్ను ఆపే జైళ్లు లేవు

### వీడియో సందేశంలో కేజ్రీవాల్



**న్యూఢిల్లీ :** ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో అరెస్టు అయి ఇడి కస్టడీలో ఉన్న సిఎం అరవింద్ కేజ్రీవాల్ దేశ ప్రజలకు లేఖ రాశారు. ఆయన రాసిన సందేశాన్ని భార్య సునీతా కేజ్రీవాల్ చదవుతూ వీడియో రిలీజ్ చేశారు. కేజ్రీవాల్ అరెస్ట్ తర్వాత ఆయన భార్య మొదటిసారి వీడియో రిలీజ్ చేశారు. తన జీవితమే ఒక పోరాటమని.. శరీరంలో ప్రతి కణం దేశం కోసమే అంకితమని లేఖలో పేర్కొన్నారు. దేశ ప్రజలు తనను ఎంతగానో ప్రేమిస్తున్నారని, గత జన్మలో తాను చేసుకున్న పుణ్య ఫలితంగా ఇప్పుడు భారత్‌లో పుట్టానని, దేశాన్ని మహా శక్తిగా చేయాలన్నారు. ప్రస్తుతం మనల్ని బలహీన పర్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. దేశంలో చాలా మంది దేశ భక్తులు ఉన్నారని, వాళ్లంతా ఈ దేశాన్ని మహాశక్తిగా చేయగలరని లేఖలో తెలిపారు. తాను జైలుకు వెళ్లడంతో ప్రతి నెల వెయ్యి రూపాయాలు వస్తాయా లేదా అని చాలా మంది మహిళలు ఆలోచిస్తున్నారని.. కేజ్రీవాల్‌ని ఆపే సంకెళ్లు, జైళ్లు లేవని తెలిపారు. త్వరలోనే బయటికి వస్తానని, తన వాగ్దానం పూర్తి చేస్తానని.. కేజ్రీవాల్ ప్రామిస్ చేసి నిలుపుకోలేనిది ఏదీ లేదంటూ లేఖ రాశారని సునీత కేజ్రీవాల్ తెలిపారు. ఆప్ కార్యకర్తలకు తన విన్నపం ఒకటేనని.. గుడికి వెళ్లి తన కోసం ప్రార్థించాలన్నారు. మన సేవ ఆగకూడదని, ప్రస్తుత పరిణామాలతో బిజెపి శ్రేణులపై ద్వేషం పెంచుకోవద్దని అరవింద్ కేజ్రీవాల్ రాసిన లేఖలో పేర్కొన్నారు. తాను త్వరలోనే బయటకు వస్తానని కేజ్రీవాల్ తెలిపారు.

## కేంద్ర ఏజెన్సీల దుర్వినియోగం

(మొదటి పేజీ తరువాయి)

జనవరి నుంచి ఇప్పటివరకు తృణముల్ కాంగ్రెస్, ఆర్‌జెడి, ఆప్, తదితర ప్రతిపక్ష పార్టీల పై ఇడి దాడులు చేస్తూ, అనేక మందిని అక్రమంగా అరెస్టు చేశారని అన్నారు. సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య మాట్లాడుతూ మోడీ ప్రభుత్వ నేతృత్వంలో ప్రతిపక్ష పార్టీలను లొంగదీసుకోవడానికి ఇడి, సిబిఐ వంటి కేంద్ర ఏజెన్సీలను వాడుకుంటుందని విమర్శించారు. బిజెపికి లొంగని ప్రతిపక్ష నాయకులను అక్రమ అరెస్టు చేస్తూ భయభ్రాంతులను చేస్తున్నారని విమర్శించారు. అందుకే ఫిర్ ఏక్ బార్ బిజెపి అని ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు.ఈ నిరసన కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్. బాల మల్లేష్, పశ్య పద్మ, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి నరసింహారావు, మల్లు లక్ష్మి , సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కార్యదర్శివర్గ సభ్యులు గోవర్ధన్, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు కోటేశ్వరరావు, ఆర్‌ఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి జానకి రాములు, సిపిఐ ఎంఎల్ లిబరషన్ రాష్ట్ర కార్యదర్శి రాజా రమేష్, మహిళా సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ జ్యోతి, మేడ్చల్ జిల్లా సిపిఐ కార్యదర్శి డి జి సాయిల్ గౌడ్ తదితరులు హాజరయ్యారు. అలాగే సిపిఐ నాయకులు సిహెచ్ దశరథ, గిరిజన సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య నాయక్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, ప్రజా నాట్యమని రాష్ట్ర నాయకులు లక్ష్మినారాయణ, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి సాగర్, కుల వవక్ష పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సైలాబ్, రైతు నాయకులు చంద్రయ్య రవి తదితరులు పాల్గొన్నారు.

## ఏప్రిల్‌లో కాంగ్రెస్ భారీ సభ

(మొదటి పేజీ తరువాయి)

ఎనుముల రేవంత్ రెడ్డి, ఇతర ముఖ్యనేతలు శనివారం నాడు సమావేశమై ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. లోక్ సభ ఎన్నికల షెడ్యూలు ఏర్పాటు తరువాత ఏర్పాటు చేస్తున్న మొదటి సభ తుక్కుగూడలోనే కావడం విశేషం. ఇక్కడ నుండే రాష్ట్ర కాంగ్రెస్ ఆధ్వర్యంలో లోక్‌సభ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించాలని నిర్ణయించారు. ఈ బహిరంగ సభకు రాహుల్‌గాంధీ, ఖర్గేలు ఇప్పటికే సమయం ఇచ్చారు. అదే వేదికపై లోక్‌సభ ఎన్నికల తెలుగు మ్యానిఫెస్టోను ఖర్గే విడుదల చేయనున్నారు. బహిరంగ సభకు పెద్ద ఎత్తున జన సమీకరణ చేయాలని కాంగ్రెస్ నేతలు నిర్ణయించారు. ముఖ్యంగా హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్ నగర్, నల్లగొండ జిల్లా నుండి భారీగా ప్రజలను తీసుకువచ్చేందుకు ప్రణాళికలు రూపొందించారు.

అచ్చొచ్చిన తుక్కుగూడలోనే..

గత శాసనసభ ఎన్నికల ప్రచారాన్ని కూడా తుక్కుగూడలో జరిగిన బహిరంగ సభ ద్వారానే ప్రారంభించారు. ఆ సభలోనే కాంగ్రెస్ ముఖ్య నేత సోనియాగాంధీ ఆరు గ్యారెంటీలను ప్రకటించారు. ఆ సభ కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ ను నింపి, అధికారంలోకి వచ్చేందుకు దోహదపడింది. అదే బాటలో అచ్చొచిన తుక్కుగూడ లోనే భారీ బహిరంగసభ ఏర్పాటు చేసి లోక్ సభ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించాలని కాంగ్రెస్ కీలక నిర్ణయిం తీసుకుంది.

## మద్య నియంత్రణ ఎలా?

(మొదటి పేజీ తరువాయి)

అదనంగా ఐదు నుంచి పది రూపాయలు వసూలు చేస్తూ బెల్టుషాపులకు మద్యం సరఫరా చేస్తున్నారు. మద్యం దుకాణాల్లో దొరకని అనేక బ్రాండ్లు బెల్టుషాపుల్లో లభ్యమవుతున్నాయి. ఎక్సైజ్ శాఖ వైఫల్యమే బెల్టుషాపులు పెరగడానికి, విచ్చలవిడిగా మద్యం విక్రయాలు చేపట్టడానికి కారణమవుతుందన్న ఆరోపణలు వినవస్తున్నాయి. మద్యం యజమానులు తమ వాహనాల్లో బెల్ట్ షాపులకు మద్యాన్ని సరఫరా చేస్తున్నా పట్టించుకోవడం లేదు. అందుకే బెల్టుషాపులు రోజు రోజుకు పెరుగుతున్నాయి. బార్ అండ్ రెస్టారెంట్లను తలపించే రీతిలో కొన్ని బెల్టుషాపుల వద్ద ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇటీవల కొన్ని బెల్టుషాపుల్లో కాపుసారా విక్రయాలు కూడా జరుగుతున్నాయి. కల్లూరులో కొన్ని బెల్టుషాపులను తనిఖీ చేసినప్పుడు కాపుసారా బయటపడిందన్న ప్రచారం జరిగింది. ఎక్సైజ్ అధికారులు దీనిని తోసిపుచ్చినప్పటికీ ఆశాఖ వ్యవహార తీరు పలు అనుమానాలకు తావిచ్చింది. జిల్లా ఉన్నతాధికారులు ముందుగా జిల్లాలో ఎక్సైజ్ శాఖను ప్రక్షాళన చేయాల్సి ఉంది. ఎక్సైజ్ శాఖను ప్రక్షాళన చేయకుండా జిల్లాలో మద్యం నియంత్రణ జరిగే పని కాదన్నది అందరికి తెలిసిందే. ఎన్నికల ముంగిటనైనా ఎక్సైజ్ శాఖ ప్రక్షాళన ద్వారా మద్యాన్ని నియంత్రించి శాంతి భద్రతలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

# ఎన్నికల బాండ్లు రూ.1,300 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

తృణమూల్ కాంగ్రెస్‌పార్టీ, టిడిపిలు కూడా లబ్ధి పొందాయి. ముఖ్యంగా ఈ ఎన్నికల బాండ్ల ద్వారా బిఆర్ఎస్‌పార్టీ, జాతీయస్థాయిలో బిజెపి తెలంగాణ రాష్ట్రంలో ఉన్న వ్యాపారులు, కంపెనీల నుండి భారీగా విరాళాలు సమకూర్చుకున్నాయి. మేఘా ఈ విరాళాలను సమకూర్చిన కంపెనీలలో మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఇఐఎల్), అరబిందో ఫార్మా, ఎంఎస్ఎన్ గ్రూప్, రిత్విక్ ప్రాజెక్ట్స్, నవయుగ, రాజపుష్ప వంటి కంపెనీలు బిజెపి, బిఆర్ఎస్, కాంగ్రెస్, టిడిపి, జెడి(ఎస్) తదితర పార్టీలకు భారీగా విరాళాలు సమకూర్చుకున్నట్లు భారత ఎన్నికల సంఘం వెబ్‌సైట్ ద్వారా సమకూర్చిన సమాచారం వెల్లడించింది. బిఆర్ఎస్ పార్టీ భారీస్థాయిలో ఇప్పటివరకూ రూ.1,214.60 కోట్లు ఎన్నికల బాండ్ల ద్వారా విరాళాలు సమకూర్చుకుంది. ఇందులో మేఘా గ్రూపు నుండి బిఆర్ఎస్‌కు రూ.195 కోట్లు బాండ్ల ద్వారా వచ్చాయి. మేఘా గ్రూపు బిజెపికి అత్యధికంగా రూ.664 కోట్లు విరాళాలు ఇచ్చింది. యశోదా హాస్పిటల్స్ కూడా బిఆర్ఎస్‌కు రూ.94 కోట్లు, కాంగ్రెస్‌కు రూ.2 కోట్లు, వైఎస్ఆర్‌సిపికి రూ.1 కోటి విరాళాలు ఇచ్చింది. హైదరాబాద్‌లో ప్రతిష్టాత్మకమైన చెరువు ప్రాంతాలను అత్యంత సుందర వనాలుగా తీర్చిదిద్దిన రియల్ ఎస్టేట్ కంపెనీలు ఆనాడు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీకి విరాళాలు సమర్పించాయి. అపర్ణా, రహేజా, ఎస్ఎస్ఎల్–సెజ్, రాజపుష్ప, మై హోమ్, ప్రెస్టీజ్, ఇతర గ్రూపులు తమ ప్రయోజనాల కోసం బిఆర్ఎస్‌కు భారీగా విరాళాలు ఇచ్చాయి. ఈ విధంగా కె.రహేజా కార్పొరేషన్ రూ.18 ఎన్నికల బాండ్లు కొనుగోలు చేసి అధికార బిఆర్ఎస్‌కు ఇచ్చింది.దాని అనుబంధ సంస్థ ఇనార్బిట్ మాల్ కూడా రూ.5 కోట్లు సమర్పించింది. అదేవిధంగా ఇనార్బిట్ మాల్ బిజెపి, శివసేనలకు కూడా రెండేసి కోట్లు వంతున ఇచ్చింది. ఈ రియల్ ఎస్టేట్ కంపెనీ హైటెక్ సిటీ సమీపంలో ఉన్న దుర్గం చెరువు ప్రాంతాన్ని అత్యంత సుందరంగా అభివృద్ధి చేసింది. సైక్లింగ్ ట్రాక్ నిర్మించింది. అదే విధంగా అపర్ణా ఫార్మ్స్ అండ్ ఎస్టేట్స ఎల్ఎల్‌పి కూడా బిఆర్ఎస్ పార్టీకి రూ.15 కోట్లు విరాళాలు ఇచ్చింది. తర్వాత అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చాక మరో రూ.15 కోట్లు కాంగ్రెస్‌కు విరాళంగా ఇచ్చింది. నాటి మల్కం చెరువు భూమిని అపర్ణ సంస్థ అభివృద్ధి చేసింది. ఇప్పుడిది అపర్ణ పేరుతోనే చలామణీ అవుతోంది. అదేవిధంగా ఒకప్పుడు కోకాపేటలో ఎకరం భూమిని రికార్డుస్థాయిలో రూ.100 కోట్లు ఇచ్చి కొనుగోలు చేసిన రాజపుష్ప గ్రూపు కూడా బిఆర్ఎస్ పార్టీకి రెండు విడతలుగా రెండు పేర్లతో రూ.25 కోట్లు విరాళాలు సమర్పించుకుంది. రాజపుష్ప ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్, రాజపుష్ప ఎస్సెట్స్ మేనేజ్‌మెంట్ ఎల్ఎల్‌పిల పేరుతో ఈ విరాళాలు ఇచ్చింది. ఇంకా ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే చెన్నై కేంద్రంగా పనిచేసే చెన్నై గ్రీన్ ఉడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.50 కోట్లు బిఆర్ఎస్ కు రూ.15 కోట్లు కాంగ్రెస్ పార్టీకి, రూ.40 కోట్లు తృణమూల్ కాంగ్రెస్‌పార్టీకి బాండ్ల రూపంలో కొని సొమ్ము సమర్పించుకుంది. అదే విధంగా చెన్నై గ్రీన్ ఉడ్స్‌లో డైరెక్టర్‌గా ఉన్న రాజేశ్ తారక దాసరి అదే చిరునామాతో మరో రియల్ ఎస్టేట్ కంపెనీ నిర్వహిస్తున్నారు. రామ్‌కీ కంపెనీ హైదరాబాద్‌లో వ్యర్థ పదార్థాలను ప్రాసెసింగ్ చేస్తుంది.హైదరాబాద్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టు నిర్వహిస్తున్న అత్యంత సంపన్నుడైన అయోధ్య రామిరెడ్డిని ఆంధ్రప్రదేశ్‌లో అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ రాజ్యసభకు ఎంపిగా నామినేట్ చేసింది. వీరంతా ఈ పార్టీలకు డోనర్లే. మరో అతిపెద్ద రాజకీయ విరాళాల దాత మై హోమ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్. ఈ కంపెనీ బిఆర్ఎస్‌కు రూ.15 కోట్లు ఇచ్చింది. బిజెపికి రూ.5 కోట్లు, కాంగ్రెస్‌కు రూ.4.5 కోట్లు సమర్పించుకుంది. మైహోమ్‌లో డైరెక్టర్‌గా ఉన్న జూపల్లి శ్యామ్ రావు ఆక్వా స్పేస్ డవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కూడా బిఆర్ఎస్‌కు రూ.15 కోట్లు ఇచ్చింది. మరో సంస్థ తెల్లాపూర్ టెక్నోసిటీ ప్రైవేట్ లిమిటెడ్‌లో కూడా శ్యామ్ రావు డైరెక్టర్‌గా ఉన్నారు. ఈ సంస్థ కూడా రూ.20 కోట్లు బిఆర్ఎస్‌కు ఇచ్చింది.

బిఆర్ఎస్‌కు భారీగా బాండ్ల రూపంలో సొమ్ములిచ్చిన ప్రధాన కంపెనీలు

| కంపెనీ పేరు | రూ. కోట్లు |
|---|---|
| మేఘా గ్రూపు | 195 |
| యశోదా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ | 94 |
| చెన్నై గ్రీన్ ఉడ్స్ | 50 |
| హెటిరో | 50 |
| డా.రెడ్డీస్ లేబొరేటరీస్ | 32 |
| కిటెక్స్ గ్రూపు | 25 |
| ఐఆర్‌బి ఎంపి ఎక్స్‌ప్రెస్‌వే ప్రైవేట్ లిమిటెడ్ | 25 |
| రాజపుష్ప | 25 |
| ఎల్ 7 హైటెక్ ప్రైవేట్ లిమిటెడ్ | 22 |
| ఎంఎస్ఎన్ ఫార్మ కెమికల్స్ | 20 |
| కోయ అండ్ కంపెనీ కన్‌స్ట్రక్షన్స్ | 20 |
| దివీ లేబోరేటరీస్ | 20 |
| తెల్లాపూర్ టెక్నోసిటీ | 20 |
| నాట్కో ఫార్మా | 20 |
| ఎస్ఎస్ఎల్ సెజ్ (హైదరాబాద్) | 24.50 |
| కె.రహేజా కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ | 18 |
| హిండీస్ ల్యాబ్ ప్రైవేట్ లిమిటెడ్ | 17.50 |
| ధీరా మెడికల్స్ | 15 |
| అరబిందో ఫార్మా | 15 |
| మై హోం ఇన్‌ఫ్రా | 15 |
| ఆక్వా స్పేస్ డెవలపర్స్ | 15 |
| అపర్ణ ఫార్మా–ఎస్టేట్స్ | 15 |
| సంధ్య కన్‌స్ట్రక్షన్స్–ఎస్టేట్స్ | 13 |
| హజెలో ల్యాబ్ ప్రైవేట్ లిమిటెడ్ | 12.50 |
| గ్రీన్ కో గ్రూప్ | 12 |



## ఒయు నోటిఫికేషన్‌కు వ్యతిరేకంగా నిరసనలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఒయులో ఇటీవల పెంచిన పిహెచ్‌డి ఫీజులు రెండవ సంవత్సరం చెల్లించాలని విడుదల చేసిన నోటిఫికేషకు వ్యతిరేకించ డంతో నిర్ణయాన్ని ఉపసంహకరించుకున్నారు. పరిపాలన భవనంలో శని వారం స్థాయీసంఘం సమావేశానికి వెళ్లేందుకు ప్రయత్నించిన విద్యార్థు లను ప్రవేశ ద్వారం వద్దనే ఆపేశారు. ఈ క్రమంలో విద్యార్థుల ఆధ్వ ర్యంలో పరిపాలన భవనం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఒయు పరిశోధక విద్యార్థులు మాట్లాడుతూ ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇటీ వల పిహెచ్‌డి కోర్సు రెండవ సంవత్సరం ఫీజులు చెల్లించాలని నోటిఫికేషన్ జారీ చేశారని తెలిపారు. నోటీఫికేషన్‌కు నిరసనగా పరిపాలన భవనం వద్ద తీవ్ర స్థాయిలో నిరసన వ్యక్తం చేయడం కారణంగా నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారని తెలిపారు. ఈ నోటిఫికేషన్‌తో పాటు ఫీజుల పెంపు మొత్తా న్ని ఎత్తివేసి, గతంలో ఉన్న ఫీజులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. హేతుబద్ధత లేకుండా ఒయులో పెంచిన పిహెచ్‌డి ఫీజులను తగ్గించాలని గత సంవత్సర కాలంగా అనేక పోరాటాలు నిర్వహించామన్నారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం అండదండలతో వర్సిటీ అధికారులు ఫీజులు తగ్గించ లేదన్నారు. ఈ విషయంపై గతంలో ప్రతిపక్ష నేతగా ఉన్న బట్టి విక్రమార్క అసెంబ్లీలో మాట్లాడారని, కావున రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఫీజులు తగ్గించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఈనెల 26న పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## భగత్ సింగ్‌కు 'భారతరత్న' ప్రకటించాలి

ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ డిమాండ్

**ప్రజాపక్షం /హైదరాబాద్ :** షహీద్ భగత్ సింగ్‌కు భారతదేశ అత్యున్నత పురస్కారం భారత రత్నను ప్రకటించాలని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్య దర్శి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మ ణ్ డిమాండ్ చేశారు. భగత్ సింగ్ జీవిత చరిత్రను పాఠ్య పుస్తకాల్లో చేర్చి, జయంతి, వర్ధంతులను కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానం 2020 రద్దు చేయాలని అన్నారు. భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల పోరాట స్ఫూర్తితో నేటి విద్యార్థి, యువత తమ హక్కుల కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల 93వ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్ రామ్ కోఠిలో ఉన్న భగత్ సింగ్ విగ్రహానికి ఎఐఎస్‌ఎఫ్ నేతలు పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మ ణ్ సంయుక్తంగా మాట్లాడుతూ భగత్ సింగ్ స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై విద్యార్థి, యువత పోరాడాలని, నూతన జాతీయ విద్యా విధానానికి వ్యతిరేకంగా పోరాటాలు కొనసాగించాలని పిలుపుని చ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేష్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు చైతన్య యాదవ్ , మేడ్చల్ జిల్లా కార్య దర్శి ఎండీ అన్వర్, రాష్ట్ర నాయకులు హరీష్‌లు పాల్గొన్నారు.

## బిఆర్‌ఎస్ అభ్యర్థులు ఖరారు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ మినహా అన్ని లోక్‌సభ నియోజక వర్గాలకు బిఆర్‌ఎస్ అభ్యర్థులు ఖరారయ్యారు. 17 లోక్‌సభ స్థానాల్లో 16 మంది అభ్యర్థులను ప్రకటించడంతో ఇక ఎన్నికల ప్రచారాన్ని చేపట్టాలని ఆ పార్టీ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అభ్యర్థులను ఆదేశిం చారు. తాజాగా సికింద్రాబాద్ అభ్యర్థిగా సికింద్రాబాద్ ఎంఎల్‌ఎ టి.పదా మరావుగౌడ్, భువనగిరి అభ్యర్థిగా క్యామ మల్లేశ్, నల్లగొండ అభ్యర్థిగా కంచర్ల కృష్ణా రెడ్డి పేర్లను ప్రకటించారు. రాష్ట్రంలో బిఆర్‌ఎస్ అధికారం కోల్పోయిన నేపథ్యంలో కెసిఆర్ ఇక లోక్‌సభకు వెళ్తారని బిఆర్‌ఎస్ వర్గాల్లో విస్తృత ప్రచారం జరిగింది. కెటిఆర్ కూడా లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తారనే చర్చ జరిగింది. కానీ తాజా రాజకీయ పరిణామాల నేప థ్యంలో కెసిఆర్ కుటుంబం లోక్‌సభ ఎ న్నికల్లో పోటీకి దూరంగా ఉన్నది. ఈ సారి లోక్‌సభ అభ్యర్థుల ఎంపిక అంశం బిఆర్‌ఎస్‌కు పెద్ద సమస్యగా మారింది. అధికారంలో ఉన్నప్పుడు ఎవరికి వారు ఎంపిగా పోటీ చేసేం దుకు ఆసక్తి కనబర్చిన నేతలు ప్రతిపక్షంలో వచ్చే సరికే కొందరు నాయ కులు పోటీ నుండి తప్పుకున్నారు. మరి కొందరు ఇతర పార్టీలో చేరారు. జహీరాబాద్, పెద్దపల్లి, చేవేళ్ల, నాగర్‌కర్నూల్, వరంగల్ సిట్టింగ్ ఎంపిలు బిఆర్‌ఎస్‌కు రాజీనామా చేసిన విషయం తెలిసిందే.అయితే సిట్టింగ్‌లకు మరో అవకాశం కల్పించేందుకు బిఆర్‌ఎస్ సిద్ధంగా ఉన్నప్పటికీ ఆ ఎంపి లు మాత్రం బిఆర్‌ఎస్ నుండి పోటీ చేసేందుకు అనాసక్తి చూపి, ఇతర పార్టీలో చేరిన విషయం తెలిసిందే. దీంతో ఆ నియోజకవర్గాల్లో కొత్త అభ్య ర్థులను ఎంపిక చేయడం బిఆర్‌ఎస్‌కు పెద్ద సవాల్‌గా మారింది. ఎట్టకే లకు హైదరాబాద్ మినహా అన్ని లోక్‌సభ నియోజకర్గాలకు బిఆర్‌ఎస్ తమ అభ్యర్థులను ఖరారు చేసింది.

**ఎంపి అభ్యర్థులు వీరే :** ఖమ్మం నామా నాగేశ్వర్ రావు, మహబూబాబాద్ (ఎస్టీ )మాలోత్ కవిత,కరీంనగర్ బోయినిపల్లి వినోద్ కుమార్ ,పెద్దపల్లి( ఎస్.సి) కొప్పుల ఈశ్వర్, మహబూబ్ నగర్ మన్నె శ్రీనివాస్ రెడ్డి,చేవెళ్ల కా సాని జ్ఞానేశ్వర్, వరంగల్ (ఎస్.సి )డాక్టర్ కడియం కావ్య,నిజామాబాద్ బాజి రెడ్డి గోవర్ధన్, జహీరాబాద్ గాలి అనిల్ కుమార్,ఆదిలాబాద్(ఎస్‌టి )ఆత్రం సక్కు మల్కాజ్ గిరి రాగిడి లక్ష్మా రెడి,మెదక్ పి .వెంకట్రామి రెడ్డి, నాగర్ కర్నూల్ (ఎస్‌సి )ఆర్ .ఎస్ .ప్రవీణ్ కుమార్,సికింద్రాబాద్ తీగుళ్ల పద్మారావు గౌడ్,భువనగిరి క్యామ మల్లేశ్, నల్లగొండ కంచర్ల కృష్ణారెడ్డి

## విధేయతకే ప్రాధాన్యం ఇచ్చిన గులాబీ బాస్ కెసిఆర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారత రాష్ట్ర సమితి(బిఆర్‌ఎస్) సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం నుండి ఉద్యమ నేతను బరిలోకి దించాలని నిర్ణయించింది. పార్టీ సంక్షోభంలో ఉన్నప్పుడు ఎలాంటి ఒడిదొడుకులు ఎదురైనప్పుడు ఎక్కడికి కాదలని విధేయునిగా ఉన్న నేతనే ఎంపిక చేసింది. అధికారంలో ఉన్నప్పుడు తామంటే తాము పోటీ చేస్తామని పోటీ పడిన నేతలంతా అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత పోటీకి వెనక్కి తగ్గారు. ఈ క్రమంలో మొదటి నుండి పార్టీకి విధేయుడుగా ఉన్న టి. పద్మారావును పోటీకి దింపా లని బిఆర్‌ఎస్ నిర్ణయించింది. బిఆర్‌ఎస్ సికింద్రాబాద్ లోక్‌సభ నియోజ కవర్గం అభ్యర్థిగా మాజీ మంత్రి, సికింద్రాబాద్ సిట్టింగ్ ఎంఎల్‌ఎ పద్మా రావు గౌడ్‌ను పార్టీ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్ రావు శనివారం అధికారి కంగా ప్రకటించారు. పార్టీ శాసన సభ్యులు, ప్రజాప్రతినిధులు, ఇతర ముఖ్యనేతలతో జరిగిన సమావేశంలో చర్చించి అందరి అభిప్రాయం సేక రించిన తరువాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. పార్టీ సీనియర్ నేతగా ఉద్యమ కాలం నుంచి నేటి వరకు పార్టీకి విధేయుడుగా ఉన్న పద్మా రావు అభ్యర్థిత్వం పట్ల కెసిఆర్ మొగ్గుచూపించారు. పార్టీ నేతలతో నిర్వ హించిన అభిప్రాయ సేకరణలో పద్మారావుకే టికెట్ ఇవ్వడానికి ఒకే చెప్పారు. కాంగ్రెస్ పార్టీ నుంచి పద్మారావు గౌడ్ రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. మొదట్లో మాజీ మంత్రి పి.జనార్ధన్ రెడ్డి అనుచరుడిగా కాంగ్రెస్‌లో గుర్తింపు తెచ్చుకున్నారు. 1986లో అప్పటి మోండా మార్కెట్ డివిజన్ నుంచి మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్(జనతా పార్టీ) అభ్యర్థిపై కార్పొరేటర్‌గా పద్మారావు ఎన్నికయ్యారు. 2001లో టిఆర్‌ఎస్ ఆవిర్భావం నుంచి ఆ పార్టీలో కొనసాగుతున్నారు. 2004లో సికింద్రా బాద్ నియోజకవర్గం నుంచి అప్పటి టిడిపి అభ్యర్థి మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌పై విజయం సాధించారు. 2008 ఉప ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి తలసాని శ్రీనివాస్ యాదవ్ చేతిలో ఓటమిపాలయ్యారు. 2009 శాసనసభ ఎన్నికల్లో సనత్ నగర్ నియోజకవర్గం నుంచి అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి మర్రి శశిధర్ రెడ్డి చేతిలో ఓటమిచెందారు. తెలంగాణ రాష్ట్రం ఏర్ప డిన అనంతరం 2014 ఎన్నికల్లో తిరిగిన ఆయన సికింద్రాబాద్ శాసనసభ నియోజకవర్గం నుండి ఎంఎల్‌ఏగా విజయం సాధించారు. ఎక్సైజ్, క్రిడలు, యువజన వ్యవహారాల మంత్రిగా పనిచేశారు. 2018 ఎన్నికల్లో తిరిగి గెలిచిన పద్మారావు డిప్యూటి స్పీకర్‌గా ఎన్నికయ్యారు. 2023 ఎన్ని కల్లో తిరిగి ఎంఎల్‌ఏగా విజయం సాధించారు. ఆవిర్భావం నుండి పార్టీలో కొనసాగుతుండటంతో పాటు పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు కెసిఆర్‌ను వీడి వెళ్ల లేదు. దీంతో కెసిఆర్ పద్మారావు అభ్యర్థిత్వానికి ఒకే చెప్పారు.

అమరవీరులు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల స్ఫూర్తితో

## నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి




**ప్రజాపక్షం / హైదరాబాద్ :** అమరవీ రులు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దే వ్‌ల స్ఫూర్తితో నరేంద్ర మోడీ ప్రభు త్వాన్ని గద్దె దించేందుకు సిద్ధం కావా లని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్ కెఎం) నాయకులు పిలుపునిచ్చారు. ఎస్‌కెఎం జాతీయ స్థాయి పిలుపులో భాగంగా హైదరాబాద్ లో సుందరయ్య పార్క్ దగ్గర భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల చిత్ర పటాలకు పూలమా లలు వేసి రైతు సంఘాల నేతలు నివా ళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్ కెఎం రాష్ట్ర కన్వీనర్లు పశ్య పద్మ, టి. సాగర్,మండల వెంకన్న,గౌని ఐలయ్య, జక్కుల వెంక టయ్య, నాగిరెడ్డి,బాలమల్లేశ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కేంద్రాలు, మండల కేంద్రాలు, గ్రామా ల్లో కాగడాలు,కొవ్వొత్తుల ప్రదర్శన లు, అమరవీరులకు నివా ళు లు అర్పించడం, సభలు, సమావేశా లు జరగనున్నా యని, కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి రాతపూర్వకంగా ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా వైఫల్యం చెందిందని విమర్శించారు.వ్యవసాయరంగాన్ని బడా కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు పూనుకుంటున్నదని అన్నారు. నరేంద్ర మోడీ నేతృత్వంలోని రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక బిజెపి ప్రభుత్వాన్ని ఓడించేందుకు ప్రతిజ్ఞ పూనాలని విజ్ఞప్తి చేశారు.కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వా మ్యాన్ని ఖూనీచేస్తున్నదని, ప్రతి పక్ష ముఖ్యమంత్రులను అరెస్టు చేస్తున్నారని మండిపడ్డారు.ఇన్ కాంటాక్స్,ఇడి, సిబిఐ లను ఉపయోగించి కేంద్ర ప్రభుత్వానికి లొంగని వారిపై దాడులు చేయిస్తున్నారని అన్నారు. ప్రొఫెసర్ అరి బండి ప్రసాద్ రావు,మహిళా సమాఖ్య నాయకులు ఎన్. జ్యోతి, సుజాత,కెవిపి యస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు, గిరిజన సంఘాల నాయకులు అంజయ్య నాయక్, శ్రీరాం నాయక్, రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్, ఎస్‌కెఎం నాయకులు గోపాల్ లు మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ అప్రజాస్వామిక విధా నాలకు వ్యతిరేకంగా జరిగే ఐక్య పోరాటాల్లో భాగస్వా ములం అవుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో వృత్తి సంఘాల నాయకులు లెల్లెల బాలకృష్ణ,పి ఆశయ్య,ఉడుత రవీందర్, డివైఎఫ్ ఐ రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకటేష్, సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి డిజి సాయిల్ గౌడ్ దశరథ తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగులను మోసంచేసిన ప్రభుత్వాన్ని ఓడిద్దాం

ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ధర్మేంద్ర




**ప్రజాపక్షం / హైదరాబాద్ :** భగత్ సింగ్ పోరాట స్ఫూర్తితో మతోన్మాద శక్తులను ఓడిద్దామని, సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యో గాలు ఇస్తాన ని నిరుద్యోగులను మోసం చేసిన మోడీ ప్రభుత్వాన్ని ఎన్నికల్లో ఓడిద్దామని ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ధర్మేంద్ర పిలుపునిచ్చా రు. భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల 93వ వర్ధంతిని పురస్కరించుకుని ఎఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో హిమాయత్ నగర్ లోని సత్యనారాయణ రెడ్డి భవన్ నుండి రామ్ కోఠిలోని భగత్ సింగ్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వ హించారు. 'మాదకద్రవ్యాలను నిర్మూలించాలి, ఇంక్విలాబ్ జిందాబాద్.... భగత్ సింగ్ అమరేహే అనే చేస్తూ ముందుకు సాగారు.

ఈ సందర్భం గా కె. ధర్మేంద్ర మాట్లాడుతూ ప్రజ లలో మత మౌఢ్యాన్ని పెంచే ధోరణలను షహీద్ భగత్ సింగ్ వ్యతిరేకించారని గుర్తు చేశారు. మతో న్మాత ముక్త భారతం సాధించడానికి భగత్ ఆలోచ నలు, ఆయన చూపిన కార్యాచరణ, మనకు తరగని స్ఫూర్తి గా నిలుస్తాయన్నారు. మతోన్మాద రాజకీయా లను సమూలంగా ఓడించడమే భగత్ సింగ్ కు నేటి తరం అందించగలిగే నిజమైన నివాళి అని అన్నారు.

ఎఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు, కార్య దర్శి ఆర్. బాల కృష్ణ,నెర్లకంటి శ్రీకాంత్‌లు తదిత రలు మాట్లాడుతూ ట్లాడుతూ నాడు దేశ భవిష్యత్తు కోసం, ప్రజల ఐక్యత కోసం నిరంతరం తపించిన భగత్ మతోన్మాద శక్తుల కారణంగా దేశానికి కలిగే ప్రమాదం గురించి వివరిస్తూ చేసిన హెచ్చరిక, వాటి పట్ల తీసుకున్న వైఖరి నేడు మనకు సరైన దారిని చూపిస్తున్నాయన్నారు. ర్యాలీలో ఎ ఐ వై ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీమాన్, ఏ ఐ వై ఎఫ్ హైదరాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్, ఏ ఐ ఎస్ ఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి మెట్టు చైతన్య, గ్యారా నరేష్ నేతలు అనిల్, శరత్,భూపతి, రాహుల్, సాహిత్, భాస్కర్, సహజద్, ప్రవళిక, అన సూయ, మధురిమ, మౌనిక, సంగీత, మృణాళిని తదితరులు పాల్గొనాన్నారు.

## మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలి

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి టియుడబ్ల్యుజె వినతి పత్రం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశవ్యాప్తంగా మీడి యా సంస్థలు, జర్నలిస్టుల సంక్షేమం కోరుతూ పలు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని కేంద్ర మంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్ రెడ్డికి టియుడబ్ల్యుజె వినతిపత్రం సమర్పిం చింది. షహీద్ భగత్ సింగ్ వర్ధంతి రోజైన మార్చ్ 3న, 'జర్నలిస్ట్ డిమాండ్స్ డే' పాటించా లని ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ ఇచ్చిన పిలుపు మేరకు శనివారం నాడు బిజెపి రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డికి తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టియుడబ్ల్యుజె) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విరాహత్ అలీ నేతృ త్వంలో ప్రతినిధి బృందం వినతిపత్రం సమర్పించింది.

ఈ సందర్భంగా విరాహత్ అలీ మాట్లాడు తూ మీడియా సమస్యలను పరిష్కరించడానికి కొత్త మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని కోరారు. ప్రెస్ కమిషన్ చివరి నివేదిక 1982 లో వెలువడిందని, ఆతర్వాత దేశం లో ఎలక్ట్రా నిక్ మీడియా, డిజిటల్ మీడి యా రాకతో మీడియా దృష్టాంతంలో పెనుమార్పు వచ్చిం దని తెలిపారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని పరి రక్షించడానికి జర్నలిస్టులకు స్వేచ్ఛ ముఖ్యమై నందున మీడియా సంస్థల, జర్నలిస్టుల భద్రత, రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం వెంటనే ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. శ్రమకు తగ్గ ఫలితం కోసం వర్కింగ్ జర్నలి స్టులు, నాన్ జర్నలిస్టుల కొరకు వేజ్ బోర్డును ఏర్పాటు చేయాలని కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు.

2007 సంవత్సరంలో జస్టిస్ మజీతియా కమిటీ చేసిన సిఫారసులను వెంటనే అమలు చేయాలని ఆయన అన్నారు. ప్రతినిధి బృందం లో ఐజెయు జాతీయ కార్యవర్గ సభ్యు లు కె.సత్యనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ.రాజేశ్, వి.యాదగిరి, తెలంగాణ చిన్న, మధ్యతరగతి పత్రికల సంఘం అధ్యక్షులు యూసుఫ్ బాబు, హెచ్‌యుజె అధ్యక్ష, కార్యద ర్శులు శిగా శంకర్ గౌడ హమీద్ షౌకత్, నాయ కులు చారీ, మల్లికార్జున్ రెడ్డి, రఫీ, వెంకటాచారి తదితరులు పాల్గొన్నా రు.

**డిమాండ్లు న్యాయమైనవే: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**

మీడియా సంస్థలు, జర్నలిస్టుల క్షేమం కోసం ఐజెయు చేస్తున్న డిమాండ్లు న్యాయపరమేనని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. టియుడ బ్ల్యుజె ప్రతినిధి బృందం సమర్పించిన వినతి పత్రాన్ని తాను కేంద్రానికి పంపించడమే కాకుండా వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## భూదాన్ భూముల లెక్క తేల్చాలి

సర్వోదయ మండలి రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ నాయక్ పిలుపు

**ప్రజాపక్షం/ములుగు జిల్లా ప్రతినిధి:** భూదాన్ భూములు రాష్ట్రంలో మొత్తం ఎన్ని? నిజాయితీగా పంపిణీ చేసింది ఎంత? ప్రభుత్వం ఆధీనంలో ఉన్న భూమి ఎంత? అని లెక్క తేల్చాలని సర్వోదయ మండలి ములుగు జిల్లా మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ శంకర్ నాయక్ డిమాండ్ చేశారు. దేశంలో, రాష్ట్రంలో గాంధీ, వినోబాబావే ఆశయాలకు తిలోదకాలిచ్చి పేదవారికి పంచవలసిన భూదాన్ భూములను రాజకీయ నాయకులు, బడా వ్యాపారవేత్తల చేతుల్లో చిక్కి వేల ఎకరాలు అన్యాక్రాంతం, అక్రమాలకు గురవుతుందని దీనిని పట్టించుకునే ప్రభుత్వాలు లేవన్నారు. గత ప్రభుత్వం భూదాన్ భూముల విష యంలో ఇష్టారాజ్యంగా అక్రమాలకు పాల్పడిందని, అందుకే భూదాన్ బోర్డు రద్దు చేసిందని అన్నారు. గత ప్రభుత్వం చేసిన అక్రమాల లెక్కలు తేల్చి భూబకాసురుల భరతం పట్టాలని డిమాండ్ 1951 నెహ్రూ, వినోబాబావే ఆధ్వర్యంలో దేశంలోనే మొదటిసారిగా ప్రారంభమై భూములను దానంగా పోచంపల్లి గ్రామంలో వేదిరే రామచంద్రరెడ్డి ఇచ్చి, గ్రామానికి భూదాన్ పోచంపల్లిగా పేరు తెచ్చారన్నారు. తెలంగాణ భూదాన్, గ్రామదన్ చట్టం 1965లో ఏర్పడింది. తెలంగాణ ప్రభుత్వం బోర్డును రద్దు చేసిన ఇప్పటికి తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాల ప్రజలను నమ్మించి, మఖ్యపెట్టి పాత తేదీలతో ప్రొసిడింగ్‌లు ఇస్తూ భూములను కేటాయిస్తూ భూదాన్ భూముల అక్రమాల దందా కొనసాగిస్తుందన్నారు. ఈ భూములను కాపాడుటకు భూదాన్ బోర్డును తిరిగి పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో 1,79,000 ఎకరాల భూదాన భూములు ఉన్నాయన్నారు. కొందరు భూమిని భూదానం ఇచ్చినట్లు ఇచ్చి వారే అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అక్ర మణకు గురైన భూములను తిరిగి స్వాధీనం చేసుకోవాలని, ఖాళీగా ఉన్న భూము లను గుర్తించి అర్హులైన పేద రైతులకు, నిర్వాసితులకు పంపిణీ చేయాలన్నారు. ప్రభుత్వం భూదాన భూములను పంపిణీ చేయకుంటే రాష్ట్రవ్యాప్తంగా రైతులను సమీకరించి అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరిం చారు. సభ అనంతరం సర్వోదయ మండలి జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

మృతుల కుటుంబాన్ని పరామర్శించిన ఎంఎల్‌ఎ

**ప్రజాపక్షం/నందికొండ:** నాగార్జునసాగర్ సమీపంలోని నాయినవాని కుంట స్టేజి వ ద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో హిల్ కాలనీకి చెందిన యువకులు మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే.. హిల్ కాలనీకి చెందిన అఖిల్(16), కార్తీక్ (16) ఇద్దరు స్నేహితులు వీరిద్దరు నాగార్జునసాగర్ హిల్ కాలనీ లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ మధ్యనే ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు పూర్తి చేశారు. వీరు శుక్రవారం రాత్రి బైకుపై బయలుదేరి పెద్ద



పూరకు వెళుతుండగా పెద్దవూర నుంచి నాయినివానికుంట వైపు వెళ్తున్న ట్రాక్టర్ నాగార్జునసాగర్ హైదరాబాద్ ప్రధాన రహదారి మార్గంలో ఉన్న నాయినవాని కుంట స్టేజి వైపు వెళ్లడం ఆ ప్రదేశంలో మూలమలుపు ఉండటం అదే సమయంలో పెద్దవూర వైపు వెళ్తు న్న అఖిల్, కార్తీక్ లు ప్రయాణిస్తున్న బైక్ వేగంతో ట్రాక్టర్ ట్రాలీని ఢీ కొట్టడంతో వీరు రోడ్డుపై పడిపోయారు. దీనితో తలకు, చాతికి తీవ్ర గాయాలై అఖిల్ అక్కడికక్కడే మృతిచెందగా, కార్తీక్ కు తీవ్ర గాయాలవడంతో ఆతన్ని నాగార్జునసాగర్ కమలానెహ్రూ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే పరి స్థితి విషమించటంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలిస్తూ ఉండగా మార్గమధ్యలో కార్తీక్ మృతి చెందాడు.

**ఎమ్మెల్యే జై వీర్ రెడ్డి పరామర్శ :** శుక్రవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెంది కమలా నెహ్రూ ఆసుపత్రి మార్చురీలో ఉన్న అఖిల్, కార్తీక్ ల పార్థివ దేహా లను స్థానిక ఎమ్మెల్యే జై వీర్ రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. యువకుల మృతి పట్ల వారి సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సంతాపం తెలియజే శారు.రోడ్డు ప్రమాదం వారి కుటుంబాల్లో చీకటి నింపిందని, కోల్పోయిన వారిని తిరిగి తీసుకు రాలేకపోయినా బాధిత కుటుంబానికి తాము అన్ని విధాలుగా అండగా ఉంటామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.

## కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీకి వెన్నెముక..

నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/ఖానాపూర్:** కాంగ్రెస్ పార్టీకి కార్య కర్తలే వెన్నెముకని, పార్టీలో పాతనీరు పోవడం, కొత్తనీరు రావడం పరిపాటి అని అంతమాత్రా న పార్టీకోసం జెండా మోసి, కష్టపడ్డ కార్యకర్త లను, విస్మరించడం ఉండదని, కడుపులో పెట్టి చూసుకుంటామని, గత ఎన్నికల్లో కష్టించి పని చేసిన ప్రతి కార్యకర్తకు సమన్యా యం చేకూర్చే బాధ్యత తనదని ప్రస్తుతం పార్టీలోకి చేరికలు అవసరమేనని జిల్లా ఇన్చార్జి మంత్రి ధనసరి సీతక్క అన్నారు. శనివారం ఖానాపూర్ మున్సి పాలిటీలో జెకె ఫంక్షన్ హాల్ లో జరిగిన నియో జకవర్గ విస్తృతస్థాయి సమావేశానికి, ఆమె హాజరై మాట్లాడారు. పార్టీని ప్రజలు గుండెల్లో పెట్టుకొని రాష్ట్రంలో అధికారంలోకి తెచ్చారని, అయితే జిల్లాలో కేవలం ఒక్క సీటు మాత్రమే ఎంఎల్‌ఎ గెలవడంతో పార్టీ సంస్థాగత బలోపే తానికి ఇతర పార్టీల నుంచి చేరికలు చేసుకో వడం జరుగుతుందని అన్నారు. కాగా రాష్ట్రంలో బిజెపి, బిఆర్‌ఎస్ ప్రజలను మరో సారి మోసంచేసే ప్రయత్నం చేస్తుందని ఆమె అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 100 రోజులోనే చెప్పిన ఆరు హామీలు ఏ విధం గా అమలు చేస్తుందో ప్రజలు గ్రహించి, కాంగ్రెస్‌కు ఓటు వేసి ఎంపిని గెలిపించాలని ఇక్కడ వేసే ప్రతి ఓటు దేశ భద్రతకు కారణమవుతుందని అన్నా రు.

ఖానాపూర్ ఎంఎల్‌ఎ వెడమా బొజ్జు మాట్లా డుతూ, ఖానాపూర్ నియోజకవర్గంలో తన గెలుపు మెజారిటీ కంటే, ఎంపి గెలుపులో పూర్తి స్థాయి మెజారిటీ ప్రజలు చూపించాలని, పార్టీకోసం ఎవరు పని చేస్తున్నారో? ఇదివరకే పార్టీ అలాంటి వారిని గ్రహించి పక్కన పెట్టిం దని గుర్తు చేశారు. ఎంఎల్‌ఎ ఎన్నికల్లో తనపై ఎందరు ఎన్ని ఆరోపణలు చేసినా, ఇంత అవ మానించిన ప్రతి ఒక్కరి గడపగడపకు వచ్చా నని, ఇప్పుడు కూడా ఉన్న సమయంలో ప్రతి ఒక్క గడప తిరిగి ఓటు అభ్యర్ధించాలని అన్నా రు. పార్టీలో వెన్నుపోటుదారులను తాను ఒక కంట కనిపెడుతున్నానని అలాంటి వారిని ఉపేక్షించేది లేదని అన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు కూచాడి శ్రీహరి రావు, ఎంపి నియోజకవర్గ పర్యవేక్ష కులు సత్తు మల్లేష్, మాజీ జిల్లా కో ఆప్షన్ సభ్యులు యూసుఫ్ ఖాన్, మున్సిపల్ చైర్మన్ రాజు రాసత్యం, వైస్ చైర్మన్ కావలి సంతోష్, కడం ఎంపిపి అలెగ్జాండర్ పలువురు ఉన్నారు.

## ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న మోడీ

కేజ్రీవాల్ అరెస్టుపై వామపక్షాల నిరసన






**ప్రజాపక్షం/ ఖమ్మం:** ప్రజాస్వామ్యాన్ని మోడీ ప్రభుత్వం ఖూనీ చేస్తుందని ప్రశ్నించే వారిని, విపక్ష నేతలను మోడీ లక్ష్యంగా ఎంచుకుని పనిచేస్తున్నారని వామపక్షాల నేతలు ఆరోపించారు. ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ అరెస్టుకు నిర సనగా సిపిఐ, సిపిఎం, సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్, సిపిఐ( ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ఖమ్మం పాత బస్టాం డ్ సెంటర్‌లో శనివారం నిరసన, ప్రదర్శన నిర్వహిం చారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ మాట్లాడుతూ మూడోసారి అధికారంలోకి వచ్చేం దుకే విపక్షాలపై మోడీ దాడిచేస్తున్నారని ఇడి, సిబిఐ ద్వారా అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో అవినీతి లేదా అని ప్రశ్నించారు. కేవలం ఎన్నికల్లో లబ్ది పొందేందుకే అక్రమ కేసులు బనా యిస్తున్నారని ప్రసాద్ తెలిపారు. అన్ని ప్రభుత్వరంగ సంస్థలను రాజకీ య సంస్థలుగా మార్చి బిజెపి అనుకూల చర్య లు తీసుకునేవిధంగా మోడీ ప్రోత్సహిస్తున్నారని ప్రసాద్ తెలిపారు. స్వతంత్ర భారతదేశ చరిత్ర లో మునుపె న్నడు లేనివిధంగా మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. సిపిఎం జిల్లా నాయకు లు యర్రా శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రభుత్వం సిబిఐ, ఇడి ముసుగులో విపక్ష నేతలపై దాడి చేస్తుందన్నారు. ఇది కేవలం రాజకీయ లబ్ది కోసమే ఈ దాడి జరుగుతుంది తప్ప అవినీతి వెలికి తీసేందుకు కాదని శ్రీకాంత్ ఆరోపించారు.

బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఏ ఒక్కరినైనా అరెస్టు చేశారా అని కోటాను కోట్ల డబ్బును గుత్తేదారులు, కార్పొరేట్ సంస్థల నుంచి తీసుకున్న ప్రభుత్వం బిజెపి నేతలను మాత్రం విస్మరిస్తుందన్నారు. ఇప్పుడు నేతలను వదిలి విపక్ష ముఖ్యమంత్రులపై ఈడి, సిబిఐలను వదిలిందని భవిష్యత్తులో ఏవిపక్ష నాయకున్ని బిజెపి ప్రభుత్వం బయట తిరగనివ్వబోదన్నారు. సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నియంతను మించిన మోడీ తన దుశ్చర్యలతో నాల్గవ సారి అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపిం చారు. కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడం ద్వారా విపక్ష నేత లను భయపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కేజ్రీవాల్‌ను తక్షణం విడుదల చేయకపోతే దేశ వ్యాప్తంగా ఆందోళనలను ఉధృతం చేస్తామని వామపక్ష నేతలు హెచ్చ రించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ నాయకులు పోటు కళావతి, సిహెచ్ సీతామహాలక్ష్మి , మేకల శ్రీనివాసరావు, దొండపాటి రమేష్, పగడాల మల్లేష్, తాటి నిర్మల, నాన బాల రామకృష్ణ, ఇటికాల రామకృష్ణ, శ్రావణ్, లక్ష్మ ణ్, సిపిఎం నాయకులు రమేష్, మీరా, ఆవుల వెంకటేశ్వర్లు, రామయ్య, మలీదు నాగేశ్వరరావు, సివై పుల్లయ్య, శిరో మణి, తదితరులు పాల్గొన్నారు.

## కేజ్రీవాల్‌ను అరెస్టు చేస్తే స్పందన ఎందుకు?

జి.కిషన్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కవితను అరెస్టు చేస్తే స్పందించని కెసిఆర్, ఢిల్లీ సిఎం కేజ్రీవాల్‌ను అరెస్టు చేస్తే ఎందుకు స్పందించారో సమాధానం చెప్పాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి ప్రశ్నించారు. దర్యాప్తు సంస్థల ముందు అందరూ ఒక్కటేననే విషయం కెసిఆ ర్‌కు తెలియదా అని ప్రశ్నించారు. హైదరాబాద్ లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కెసిఆర్ పదేళ్ల పాలనలో బంగారు తెలంగాణ పేరుతో మద్యాన్ని ఏరులై పాలించార ని, తద్వారా సంక్షేమ కార్యక్రమాల పేరుతో ప్రజ ల ఓట్లు దండుకునే కార్యక్రమం చేశారని ఆరో పించారు. కెసిఆర్ ప్రభుత్వం పెట్టిన ఓపెన్ బార్లు, బెల్ట్ షాపులను తొలగిస్తామని చెప్పిన కాంగ్రెస్, అధికారంలోనికి రాగానే ఎందుకు తొల గించడం లేదన్నారు. తెలంగాణలో దోచుకున్నట్లే, ఢిల్లీలో కూడా దోచుకోవాలని చూసిన బిఆర్‌ఎస్ కుటుంబసభ్యుల కుట్ర బయటపడిందని విమ ర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో బిజెపి 17 ఎంపి స్థానాల్లో స్వతంత్రంగా పోటీ చేస్తుందని తెలిపారు .

# అంతర్జాతీయం

## గాజాపై వీగిన అమెరికా తీర్మానం



ఇజ్రాయెల్ దాడులతో దద్దరిల్లిపోతున్న గాజాలో తక్షణమే కాల్పుల విరమణను అమలు చేయాలంటూ ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో అమెరికా ప్రవేశపెట్టిన తీర్మానం వీగిపోయింది. రష్యా, చైనా దేశాలు తమ వీటోను వినియోగించుకున్నాయి. ఒకవైపు కాల్పుల విరమణ అని చెప్తూనే, మరోవైపు గాజాలోని పాలస్తీనియన్లను దోషులుగా చూపే ప్రయత్నం జరిగిందని ఈ రెండు దేశాలు ఆరోపిస్తున్నాయి. గాజాపై ఇజ్రాయెల్ దాడులు చేస్తూ, కాల్పులకు తెగబడుతున్నదని అంటున్నారు. హమాస్ ఉగ్రవాదుల ఏరివేత పేరుతో ఇజ్రాయెల్ మారణకాండ సృష్టించడాన్ని ప్రపంచ దేశాలు వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. గాజాలో ఇప్పటికే కనీసం 32,000 మంది పాలస్తీనియన్లు మృతి చెందారని అక్కడి ఆరోగ్య మంత్రిత్వ శాఖ అంటున్నది. కానీ, ఇది కేవలం కట్టుకథ అని ఇజ్రాయెల్ వాదిస్తున్నది. ఇలావుంటే, అమెరికా ప్రవేశపెట్టిన తీర్మానం పూర్తిగా ఇజ్రాయెల్‌ను వెనకేసుకొచ్చేదిగా ఉందన్న కారణంగా ఈ తీర్మానాన్ని రష్యా, అమెరికా దేశాలు తోసిపుచ్చాయి. అయితే, 15 మంది సభ్యులుగల భద్రతా మండలిలో ఈ తీర్మానానికి అనుకూలంగా 11 వచ్చాయి. ఒక సభ్యుడు ఓటు వేయలేదు. మిగతా రెండు దేశాలైన రష్యా, చైనా తమకున్న వీటో హక్కును వినియోగించుకోవడంతో తీర్మానం వీగిపోయింది. భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం ఉన్న ఐదు దేశాలు, రష్యా, చైనా, ఫ్రాన్స్, బ్రిటన్, అమెరికా, వీటో హక్కును కలిగి ఉంటాయి. తీర్మానాలపై వచ్చిన ఓట్లతో సంబంధం లేకుండా, ఈ ఐదు దేశాల్లో ఏ ఒక్క దేశం వీటోను ఉపయోగించినా, సదరు తీర్మానం వీగిపోతుంది. ఇలావుంటే, రంజాన్ పండుగను పురస్కరించుకొని కాల్పుల విరమణ పాటించాలన్న మరో తీర్మానం భద్రతా మండలి ముందు రానుంది. దానిపై మండలి ఏ విధంగా స్పందిస్తుందో చూడాలి.

## ఇజ్రాయెల్ పౌరులకు 'నో ఎంట్రీ'



గాజా స్ట్రిప్, వెస్ట్ బ్యాంక్‌లోని పాలస్తీనియన్లపై యుద్ధానికి తెగబడి, వేలాది మంది మరణానికి కారణమవుతున్న ఇజ్రాయెల్‌పై ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో దేశాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఇస్లామిక్ దేశాల్లో ఇజ్రాయెల్ పట్ల వ్యతిరేకత మరింత పెరుగుతున్నది. మహిళలు, చిన్నారులను కూడా హతమారుస్తున్న అక్రమ దాడులు, దుర్మార్గపు యుద్ధాన్ని నిలిపివేయాలన్న తమ అభ్యర్థనను అంగీకరించకపోవడంతో, ఇజ్రాయెల్‌పై 12 దేశాలు ఆంక్షలు విధించాయి. ఆ దేశ పౌరులు తమ దేశంలోకి రావడానికి వీల్లేదని అల్జీరియా, బంగ్లాదేశ్, బ్రూనై, ఇరాన్, ఇరాక్, లెబనాన్, కువైట్, లిబియా, పాకిస్తాన్, సౌదీ అరేబియా, సిరియా, యెమెన్ ప్రకటించాయి. ఇజ్రాయెల్‌కు ఈ దేశాల 'నో ఎంట్రీ' నిర్ణయం ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమైంది.

## పట్టుసడలని పుతిన్



ప్రజాభిమానాన్ని చూరగొనడంలో తనకు తిరుగులేదని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మరోసారి రుజువు చేసుకున్నారు. ఇటీవల జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో ఆయన రికార్డు స్థాయిలో 87.8 శాతం ఓట్లతో సంచలన విజయం సాధించి, రాజకీయంగా తన పట్టు తగ్గలేదని నిరూపించుకున్నారు. 1999 నుంచి దేశ అధ్యక్ష పదవిలో కొనసాగుతున్న ఆయన మరో ఆరేళ్ల పాటు అదే పదవిలో ఉంటారు. ఈనెల 15 నుంచి 17వ తేదీ వరకు జరిగిన ఎన్నికల్లో గతం కంటే ఎక్కువ శాతం ఓట్లు సొంతం చేసుకోవడం విశేషం. రెండోస్థానంలో నిలిచిన పుతిన్ సమీప ప్రత్యర్థి నికోలయ్ ఖరితోనోవ్ కేవలం 4 శాతం ఓట్లతో సరిపుచ్చుకోగా, మరో ఇద్దరికి అంతకంటే ఎక్కువ శాతం ఓట్లు లభించాయి. ఉక్రేన్‌తో యుద్ధం నేపథ్యంలో పుతిన్ పొలిటికల్ గ్రాఫ్ పడిపోయిందని, ఆయన పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత కనిపిస్తున్నదని అమెరికా ప్రాయోజిత మీడియాలో వచ్చిన వార్తల్లో ఏమాత్రం నిజం లేదని తాజా ఎన్నికలు రుజువు చేశాయి. 1999 డిసెంబర్‌లో అప్పటి అధ్యక్షుడు ఎల్సిన్ అవినీతి ఆరోపణల నేపథ్యంలో రాజీనామా చేయగా, ఆయన స్థానంలో తాత్కాలిక అధ్యక్షుడిగా పుతిన్ బాధ్యతలు స్వీకరించారు. 2000 సంవత్సరంలో మొదటిసారి దేశాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 2004లో రెండోసారి కూడా అధ్యక్షుడిగా గెలిచిన పుతిన్, అప్పట్లో అమల్లో ఉన్న నిబంధనల ప్రకారం తిరిగి అధ్యక్షుడిగా పోటీ చేయలేదు. అయితే, 2008లో దిమిత్రి మెద్వెదెవ్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలోరష్యా ప్రధానిగా పుతిన్ సేవలు అందించారు. 2012లో పుతిన్ మూడోసారి దేశాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అదే సమయంలో అధ్యక్షుడి పదవీకాలం నాలుగు నుంచి ఆరు సంతవ్సరాలకు పొడిగించారు. 63.2 శాతం ఓట్లలో గెలిచిన పుతిన్ 2018లో నాలుగోసారి తన పదవిని నిలబెట్టుకున్నారు. వరుసగా మూడోసారి, మొత్తం మీద ఐదోసారి అధ్యక్ష పదవికి పోటీ చేసి, తిరుగులేని రికార్డు విజయాన్ని మోదు చేశారు. రష్యాను 29 సంవత్సరాలు పాలించిన జోసెఫ్ స్టాలిన్ (1924–1953) రికార్డును పుతిన్ తన పదవీకాలం పూర్తయ్యేలోగా అధిగమిస్తారు.

## హెచ్ఐవికి వ్యాక్సిన్?




అత్యంత భయంకరమైన ఎయిడ్స్ వ్యాధిని సృష్టించే హ్యూమన్ ఇమ్యునోడిఫిషియన్సీ వైరస్ (హెచ్ఐవి)కి వ్యాకిన్‌ను ఆమ్‌స్టర్‌డామ్ యూనివర్శిటీకి చెందిన శాస్త్రవేత్తల బృందం కనిపెట్టింది. హెచ్ఐవిని నయం చేయడానికి చేసిన పరిశోధనల్లో ఈ బృందం సిఆర్ఐఎస్‌పిఆర్ అనే సాంకేతిక పరిజ్ఞానాన్ని కనుగొంది. ఈ టెక్నాలజీనే 'మాలిక్యులర్ కటింగ్' అని కూడా పిలుస్తారు. హెచ్ఐవి వైరస్ సోకిన కణాల డిఎన్ఎను ఈ టెక్నాలజీ ద్వారా తొలగిస్తారు. అయితే, ఇది ప్రయోగ దశలో ఉందని, ఇప్పటికిప్పుడే తక్షణ ఫలితాలను ఇస్తుందని చెప్పలేమని శాస్త్రవేతలు అంటున్నారు. ఈ ప్రయోగాన్ని హెచ్ఐవికి విరుగుడు కనిమెట్టడంలో పడిన తొలి అడుగుగా భావించాలని వ్యాఖ్యానించారు. ఈ సాంకేతికత ద్వారా రోగి ఎంత సురక్షితంగా ఉంటున్నాడు? ఈ చికిత్స ఎంత సమర్థంగా, ప్రభావవంతంగా పని చేస్తున్నది? అని తెలుసుకోవడానికి మరింత లోతుగా పరిశోధనలు జరుగుతున్నాయి. ఏదిఏమైనా ప్రాణాంతకమైన హెచ్ఐవిని నయం చేసే వ్యాక్సిన్ త్వరలో వస్తుందన్న నమ్మకం ఇప్పుడు శాస్త్రవేత్తల్లో పెరిగింది.

# ఇసి జోక్యం అత్యవసరం

కేంద్ర దర్యాప్తు సంస్థలు ప్రతిపక్ష పార్టీల నాయకులను కేసుల్లో ఇరికించటం, కటకటాల వెనక్కు పంపటమే పనిగా వ్యవహరిస్తున్నాయి. ఏలినవారి ఆదేశాలు లేకుండా అవి స్వతంత్రంగా ఈ ఎన్నికల తరుణంలో సైతం తమ నిర్దేశిత ధర్మాన్ని నిజాయితీగా నెరవేరుస్తున్నాయని అనుకోలేము. అవినీతిని అంతమొందించాలనటం నిరాక్షేపణీయం. అయితే ప్రతిపక్ష పార్టీల నాయకుల్లోనే అది విచ్చలవిడిగా ఉన్నట్లు, వారిని బదనాం చేయటం ద్వారా రాజకీయ లబ్ధి పొందజూస్తున్నది భారతీయ జనతాపార్టీ, మోడీ ప్రభుత్వం. తమ పార్టీలో అవినీతిపరు లే లేరన్న భ్రమలు సృష్టిస్తున్నది. మధ్యప్రదేశ్ లో వ్యాపం కుంభకోణం, కర్నాటకలో యడియూరప్ప భూ భాగోతం లోకవిదితమే. తమకు కొరకరాని కొయ్యగా ఉన్న ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు మోడీ ప్రభుత్వ రాజకీయ వేధింపులు, కక్ష సాధింపునకు తాజా ఉదాహరణ. ఢిల్లీ ప్రభుత్వం మద్యం విధాన రూపకల్పనలో అవినీతి కుంభకోణంగా చెబుతున్న ఈ కేసు దర్యాప్తు రెండేళ్లకు పైగా జరుగుతోంది. ఉప ముఖ్యమంత్రి సిసోడియా తదితరులను అరెస్టు చేసి నిర్బంధంలో ఉంచి చాలాకాలమైంది. ఇంతవరకు ఛార్జిషీటు లేదు, బెయిలు లేదు. బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను తొలుత ఈ కుంభకోణంలో భాగస్వామికాదు సాక్షి అన్నారు. ఇప్పుడేమో నిందితురాలని ఇడి అరెస్టు చేసింది. ఇదంతా రాజకీయ క్రీడగా కనిపిస్తోంది.

భారత ఎన్నికల కమిషన్ సార్వత్రిక ఎన్నికల షెడ్యూలు ప్రకటించాక ఎన్నికల్లో పోటీ చేసే రాజకీయ పక్షాలన్నిటికీ సమానస్థాయి అవకాశం కల్పించటం దాని విద్యుక్త ధర్మం. కాని దర్యాప్తు సంస్థలు తమ స్వతంత్రతను గుర్తు చేసుకుని ఇప్పుడు దాడులు, అరెస్టులు చేయటం సమాన క్షేత్రాన్ని భగ్నం చేయటమే కదా? బెంగాల్‌లో నిన్నొక మంత్రి ఇంట్లో సోదాలు నిర్వహించారు. 2జి స్పెక్ట్రం కేసులో నిందితులను నిర్దోషులుగా ప్రకటించిన ట్రయిల్ కోర్టు తీర్పుపై అప్పీలుకు సిబిఐ కోరిన అనుమతిని ఆరేళ్ల తర్వాత ఇప్పుడు – ఈ ఎన్నికల సమయంలో ఢిల్లీ హైకోర్టు మంజూరు చేయటం సందేహాలకు తావివ్వటం లేదా? ప్రతిపక్ష నాయకులపై 20ఏళ్లనాటి కేసులను సైతం బయటకు తీస్తున్నారని ప్రతిపక్ష ఇండియా కూటమి ఎన్నికల కమిషన్ దృష్టికి తెచ్చింది. మరోవైపున ఆదాయపు పన్ను పేరుతో కాంగ్రెస్ పార్టీపై ఆర్థిక దిగ్బంధం కొనసాగుతోంది. కొద్దినెలల క్రితం జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను అరెస్టు చేసింది ఇడి. ఇటువంటి పరిస్థితుల్లో ఎన్నికల్లో అన్ని పక్షాలకూ సమాన పరిస్థితులెక్కడ? ముఖ్యమంత్రి పదవిలో ఉండగా అరెస్టు చేయబడిన తొలి ముఖ్యమంత్రి కేజ్రీవాల్. కేంద్రప్రభుత్వ అణచివేత వైఖరులపట్ల ఆగ్రహించిన ఇండియా కూటమి పార్టీలు శుక్రవారం నాడు ఎన్నికల కమిషన్‌ను కలుసుకుని, కేంద్రప్రభుత్వం ప్రతిపక్షపార్టీలను లక్ష్యం చేసుకుని కేంద్ర ఏజన్సీలను బరితెగించి, చట్ట విరుద్ధంగా ప్రయోగిస్తున్న తీరుపట్ల నిరసన తెలియజేశారు. జనవరి నుంచీ కేంద్ర ఏజన్సీలు ప్రతిపక్షనాయకులపై పాల్పడిన 10 ఘటనలను ఉదహరిస్తూ వారు మెమోరాండం సమర్పించారు. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, సిపిఐ (ఎం), సమాజ్‌వాదిపార్టీ తదితర నాయకులు ఈ బృందంలో ఉన్నారు. ఇండియా కూటమికి వ్యతిరేకంగా పాలకపార్టీ ఎన్నినిందలు ప్రచారం చేస్తున్నా తాము కలసి కట్టుగానే ఉన్నామని ఈ బృందం చాటి చెప్పింది. వారి విజ్ఞప్తి ఒక్కటే. సమాన అవకాశాలతో, స్వేచ్ఛగా, సజావుగా ఎన్నికలు నిర్వహించాల్సిన బాధ్యతను రాజ్యాంగం ఇసిపై పెట్టిందని, దానిని సక్రమగా నెరవేర్చాల్సిన కర్తవ్యం ఇసిపై ఉందని గుర్తు చేశారు. 'ఇసికి బాధ్యత ఇవ్వబడింది. సమాన స్థాయి అవకాశాలను కాపాడాల్సిన బాధ్యత పోలీసులది. అందువల్ల ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకుని' ప్రతిపక్షాల రాజ్యాంగ హక్కుల్ని పరిరక్షించాలని వారు కోరారు. స్వేచ్ఛాయుతమైన ఎన్నికలకు హృదయం, ఆత్మ సమాన అవకాశాలతో కూడిన కార్యక్షేత్రం. అదే ప్రజాస్వామ్యానికి ప్రాణం. ఇసి తన బాధ్యతను నెరవేర్చుతుందని ఆశించుదాం.

ప్రజాపక్షం
24-03-2024, ఆదివారం

# కార్మికోద్యమనేత కామ్రేడ్ పొట్లూరును స్మరించుకుందాం

నాలుగు దశాబ్దాలపాటు కార్మికుల హక్కుల కొరకు నిరంతరం ఉద్యమించిన నేత కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వరరావు.. వారు మన నుండి దూరమై 15 సంవత్సరాలు పూర్తవుతుంది. భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర నాయకత్వం పిలుపుతో హైకోర్టులో అడ్వకేట్ ప్రాక్టీస్‌కు స్వస్తి పలికి 1970లో పూర్తిస్థాయి ట్రేడ్ యూనియనిస్టుగా బాధ్యతలను తీసుకొని నాటినుండి తన చివరి శ్వాస 2009, మార్చి 25 వరకు ఆనాటి కార్మికోద్యమనేతలైన డా. రాజబహదూర్ గౌర్, కె ఎల్ మహేంద్ర గార్ల సాన్నిహిత్యంతో పనిచేసిన కార్మిక నేత.

**కుటుంబ నేపథ్యం :** వారి తల్లిదండ్రులు పొట్లూరి హనుమంతరావు రత్న మాణిక్యం దంపతులకు 1936, డిసెంబర్ 2న జన్మించారు. వీరిది చిన్న వ్యవసాయ కుటుంబం. వీరి కి ఒక తమ్ముడు, ఒక చెల్లెలు. కృష్ణా జిల్లా, గుడివాడ తాలూకా, చిన్న పాలమర్రు గ్రామం. తల్లి, మేనమామలు తమ్మారెడ్డి సత్యనారాయణ, కృష్ణమూర్తిలు కమ్యూనిస్టులు. తండ్రి ఉద్యోగరీత్యా మూడు, నాలుగు గ్రామాల్లో పనిచేస్తుండటం, ప్రాథమిక విద్యాభ్యాసం తాడంకి, ఆకునూరు, పుల్లలపల్లిలో జరిగింది. 1951లో ఎస్.ఎస్.ఎల్.సి పాస్ అయి, భీమవరంలో ఇంటర్మీడియట్ చేసి, విజయవాడ ఎస్ఆర్ఆర్ సివిఆర్ కాలేజీలో బిఎ చదువుతూనే, షార్ట్ హాండ్, టైపు రైటింగ్ నేర్చుకొని, వివాహం కావటంతో కుటుంబం పోషణ కోసం ఉద్యోగాన్వేషణతో 1958లో హైదరాబాద్ చేరుకొని హైకోర్టు జడ్జి వద్ద స్టెనోగ్రాఫర్‌గా ఉద్యోగంలో చేరారు. ఉద్యోగం చేస్తూనే ఉస్మానియా ఈవినింగ్ లా కాలేజీలో 1964లో ఎల్ ఎల్ బి పూర్తి చేసి, వెంటనే హైకోర్టులో అడ్వకేట్‌గా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.

**అడ్వకేట్ గా ప్రాక్టీస్:**
హైకోర్టు జడ్జి వద్ద 8 సం.రాలుగా పనిచేసి ఉన్న అనుభవంతో స్వతంత్రంగా ప్రాక్టీస్‌కు శ్రీకారం చుట్టారు. హైకోర్టు జడ్జివద్ద పని చేస్తున్న సందర్భంలో ఏర్పడిన సంబంధాలు, వారి మేనమామ తమ్మారెడ్డి సత్యనారాయణ సిపిఐ రాష్ట్ర కార్యదర్శిగా ఉండటంతో పార్టీతో సంబంధాలు పెట్టుకొని, పార్టీలో చేరి పార్టీ, ప్రజా సంఘాల కార్యక్రమాలలో విస్తృతంగా పాల్గొనడంతో ప్రాక్టీస్ కూడా బాగా నడుస్తూ వచ్చింది..

**కార్మిక సంఘాల నిర్మాణానికి పునాది:**
నాగేశ్వరరావు తండ్రి హనుమంతరావు హిందీ పండిట్ గా ఉపాధ్యాయ వృత్తిలో పనిచేస్తున్నారు. హిందీ ప్రచార సభలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఇంక్రిమెంట్లు, స్కేల్స్ ఇవ్వటం లేదు. వారి తండ్రి నాగేశ్వరరావు ని సంప్రదించటంతో వ్యక్తులుగా కాకుండా హిందీ టీచర్స్‌ను ఐక్యంచేసి కేసు చేయాలని నిర్ణయించుకొని, వారి తండ్రి సహకారంతో 15 మంది టీచర్స్‌ను సంఘం పెట్టి, దానికి అధ్యక్షులుగా నాగేశ్వరరావు ఉండాలని తండ్రి ప్రతిపాదనను స్వీకరించి వారి డిమాండ్లపై హైకోర్టుతో పాటు ట్రిబ్యునల్ కూడా కేసువేసి వారికందరికీ ఇంక్రిమెంట్లు, పే స్కేల్స్ వచ్చే విధంగా కృషి చేశారు. దీంతో నాగేశ్వరరావుకు మంచి గుర్తింపు వచ్చింది. 3,4 సంవత్సరాలలోనే మంచి కార్మిక నాయకునిగా గుర్తుకొచ్చింది. ఆ విధంగా కార్మిక సంఘాల కేసులను హైకోర్టులో పాటు, ట్రిబ్యునల్ లో కూడా చూస్తుండేవారు. ఆనాడు ట్రేడ్ యూనియన్లలో పనిచేస్తున్న టి అంజయ్య, పి జనార్దన్ రెడ్డి (ఐఎన్‌టియుసి), నాయిని నరసింహారెడ్డి( హెచ్‌ఎంఎస్ ) నాయకులు పొట్లూరితో లీగల్ సమస్యలను చర్చించుచుండేవారు.

**అడ్వకేట్ గా కార్మిక సంఘాల నిర్మాణం వైపు:** హైదరాబాద్ నగరంలో 1962 నుండి అనేక పరిశ్రమలు ప్రభుత్వరంగంతో పాటు ప్రైవేట్ రంగంలో అభివృద్ధి చెందుతూ నగరం నలువైపులా విస్తరించటం మొదలైంది.. సనత్‌నగర్, బాలానగర్ ప్రాంతంలో అనేక పరిశ్రమలలో డాక్టర్ రాజ్ బహదూర్ గౌర్, కెఎల్ మహేంద్రలు ఎఐటియుసి ట్రేడ్ యూనియన్ లీడర్లుగా పనిచేస్తున్న నేపథ్యంలో కామ్రేడ్ నాగేశ్వరరావు అడ్వకేట్‌గా, ట్రేడ్ యూనియన్ కేసులో చూడడంతో సనతనగర్, బాల నగర్ ప్రాంత కార్మిక సంఘాలు చూసే బాధ్యతను పుట్లూరి నాగేశ్వరరావు చూడాలని రాష్ట్ర పార్టీ 1970లో అప్పగించడం, అడ్వకేట్ ప్రాక్టీస్‌ను వదులుకొని పూర్తిస్థాయిలో ట్రేడ్ యూనియన్ ఫ్రంట్‌లో పనిచేయాలని రాష్ట్ర పార్టీ ఆదేశించింది.1971లో ఎఐటియుసి నగర కార్యదర్శిగా బాధ్యతలను ఇవ్వడం జరిగింది. వారు పూర్తిస్థాయిగా సనత్ నగర్, బాలనగర్, అమీర్‌పేట, ఎర్రగడ్డ ప్రాంతాలలో 30 నుండి 40కి పైగా కార్మిక సంఘాలకు అధ్యక్షులుగా బాధ్యతలలో ఉన్నారు.



1973 హైదరాబాద్‌లో జరిగిన ఎఐటియుసి రాష్ట్ర 5 వ మహాసభలో రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నుకోబడి 1989 వరకు కొనసాగారు.

**ప్రధాన కార్యదర్శి బాధ్యతలు:**
1989లో తిరుపతిలో జరిగిన ఎఐటియుసి రాష్ట్ర 9 వ మహాసభలో ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోబడి 2004వరకు ఆ బాధ్యతలో కొనసాగారు.1994లో పాట్నాలో జరిగిన ఎఐటియుసి జాతీయ మహాసభలో ఉపాధ్యక్షులుగా, 2001లో హైదరాబాదులో జరిగిన జాతీయ మహాసభలో జాతీయ కార్యదర్శిగా ఎన్నికైనారు.

**నిర్వహించిన కార్మిక ఉద్యమాలు :**
1974 లో దేశవ్యాప్తంగా జరిగిన రైల్వే కార్మిక సమ్మెలో పాల్గొని అరెస్ట్ కాబడినారు, 1978 లో ఐడిపిఎల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, బిహెచ్ఇఎల్ ఎంప్లాయిస్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నికై 78 రోజులుగా జరిగిన ప్రభుత్వ రంగ సంస్థల సమ్మెకు జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ గా డాక్టర్ రాజ్ బహదూర్ గౌర్, చైర్మన్ గా నాయిని నరసింహారెడ్డి ఉన్నప్పటికీ పొట్లూరి నాగేశ్వరరావు పూర్తి బాధ్యతలతో నడిపించారు. సమ్మె జయప్రదం కావడంతో పొట్లూరుకు మంచి గుర్తింపు వచ్చింది. రాష్ట్ర కార్యదర్శిగా, ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలో ఉంటూ ఎపి బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షులుగా, ఎపి కోఆపరేటివ్ బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులుగా, ఎపి రిగ్స్ టెక్నికల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షునిగా, ఎపి ప్రభుత్వం ముద్రణ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులుగా, అసంఘటిత రంగంలో పనిచేస్తున్న అనేక రంగాలైన ఆటో వర్కర్స్ యూనియన్, సినిమా వర్కర్స్ యూనియన్, హోటల్ వర్కర్స్ యూనియన్, కార్పెంటర్స్, ఇండస్ట్రియల్ వర్కర్స్, హమాలి వర్కర్స్ తదితరంగాల కార్మికులను ఏకతాటిపై తీసుకువచ్చి రాష్ట్రస్థాయి సంఘాలు ఏర్పాటుకు ప్రధాన పాత్ర పోషించారు. కనీస వేతన బోర్డు సభ్యులుగా 1991 నుండి 1999 వరకు కొనసాగుతు వివిధ రంగాలలో పనిచేస్తున్న షెడ్యూల్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ కార్మికులకు వేతనాలు ఇప్పించడంలో కృషి చేశారు. రాష్ట్ర బాధ్యులుగా అన్ని జిల్లా స్థాయిలలో ఎఐటియుసి కమిటీలు వేయటంతో పాటు, రాష్ట్రస్థాయిలోనూ, జిల్లా స్థాయిలోనూ టియు రంగంలో పనిచేయు నాయకులకు రాజకీయ శిక్షణా శిబిరాలను నిర్వహించారు. నూతన క్యాడర్‌ను ప్రమోట్ చేశారు.

**రాష్ట్ర కార్యాలయ నిర్మాణానికి కృషి:** 2001లో ఎఐటియుసి జాతీయ మహాసభలు హైదరాబాదులో నిర్వహించుటకు బాధ్యత తీసుకొని ప్రస్తుతమున్న ఓల్డ్ భవనం ఉన్న స్థలంలో నూతన భవనాన్ని నిర్మించుటకు వారు చేసిన కృషి ఫలితంగా రు.25 లక్షలు నిధుల సమీకరణచేసి ఆనాడు రాష్ట్ర బాధ్యతలో అధ్యక్షులుగా ఉన్న వివి రామారావు, ప్రధాన కార్యదర్శి పొట్లూరి నాగేశ్వరరావు కృషి అభినందనీయం. 2004లో కొత్త భవన నిర్మాణానికి కృషిచేసి పూర్తి చేశారు.

**అరెస్టులు—జైలు :**
అనేక ఉద్యమాల్లో పాల్గొంటూ 25 సార్లు పైగా అరెస్టు అయ్యారు. ఎమర్జెన్సీ రోజుల్లో బోనస్ ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా హైదరాబాదులో చార్మినార్ చౌరస్తా వద్ద ధర్నా, ప్రదర్శన నిర్వహిస్తుంటే నాగేశ్వరరావుతో పాటు ఇతర నాయకులను అరెస్ట్ చేసి వారంరోజుల పాటు ముషీరాబాద్ జైల్లో శిక్ష అనుభవించారు. అనేకసార్లు లాఠీ దెబ్బలు కూడా తిన్నారు. కార్మిక సంఘాల ప్రతినిధిగా రెండు సార్లు సోవియట్ యూనియన్, బల్గేరియా, ఫ్రాన్స్, హెథెన్స్, బంగ్లాదేశ్ లలో పర్యటించారు. 1973 లో తూర్పు జర్మనీ లో ఒక సంవత్సరం పాటు ట్రేడ్ యూనియన్, పార్టీ శిక్షణ తరగతులకు హాజరయ్యారు. ఢిల్లీలోనూ జరిగిన ప్రపంచ కార్మిక సమాఖ్య (డబ్లుఎఫ్ టి యు ) మహాసభకు ప్రతినిధిగా పాల్గొన్నారు. కామ్రేడ్ నాగేశ్వరరావు 1973 నుండి సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులుగా, కార్యవర్గ సభ్యులుగా, కార్యదర్శివర్గ సభ్యులుగా, జాతీయ సమితి సభ్యులుగా వివిధ హోదాలో పార్టీ బాధ్యతలో 2006 వరకు కొనసాగినారు. నాగేశ్వరావు గారు 2006, డిసెంబర్ 18 యాక్సిడెంట్ గురై తుంటి ఎముక స్థానభ్రంశం చెందింది. దాదాపు రెండు సంవత్సరాల పాటు ఇంటి వద్దనే పరిమితమై 2009, మార్చి 25వ తేదీన తుదిశ్వాస విడిచారు.. వారికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. నవచేతన విజ్ఞాన సమితి జనరల్ మేనేజర్ గా ఉన్న కామ్రేడ్ మధుకర్ వారి చిన్నల్లుడు.. పొట్లూరు నాగేశ్వరరావు నిస్వార్థంగా ప్రజాసేవలో తన జీవితాంతం కార్మిక శ్రేయస్సు కొరకు, హక్కుల కొరకు ఉద్యమించిన మహానేత ఆశ, లక్ష్యాలను ఆదర్శంగా తీసుకొని మున్ముందుకు సాగుదాం.

ఉజ్జిని రత్నాకర్‌రావు
9490952646

# ఛాందసవాది ఇంట అభ్యుదయవాది... శ్రీధర్ తిలక్


డాక్టర్ దేవరాజు మహారాజు

25 మే 1928 న పూనా – బొంబాయి ఎక్స్‌ప్రెస్ ట్రైన్ కింద పడి శ్రీధర్ పంత్ తిలక్ ఆత్మహత్య చేసుకున్నారు. చేసుకోవడానికి ముందు ఆయన ముగ్గురికి సూసైడ్ నోట్స్ పంపారు. ఒకటి పూనె కలెక్టర్‌కి, రెండోది వార్తాపత్రికకు, మూడోది డా.బి.ఆర్. అంబేద్కర్‌కు. ఆయన మరణం తర్వాత ఆ ఉత్తరాన్ని 'సమతా' అనే పత్రిక 29 జూన్, 1928న ప్రచురించింది. అంబేద్కర్‌కు రాసిన ఉత్తరంలోని సారాంశం ఇలా ఉంది...

'ఈ ఉత్తరం మీకు చేరేసరికి నా మరణవార్త వింటారు. మీరు ఆశిస్తున్న సమతా – సమాజ్ – సంఘ్ ఇంకా ముందుకు సాగాలంటే విద్యావంతులను, సమాజంలో మార్పు ఆశించే యువకులను ఉద్యమంవైపు ఆకర్షించాలి. లక్ష్య సాధన కోసం మీరు నిరంతరం పడుతున్న శ్రమ, పట్టుదల నాకెంతో ఆనందాన్ని కలిగించింది. మీకు విజయం కలుగుతుందని నాకు పూర్తి నమ్మకముంది. మహారాష్ట్రలో ఉన్న యువత అంటరానితనాన్ని నిర్మూలించడానికి పూనుకుంటే, సమస్య కేవలం ఐదు సంవత్సరాల్లో పరిష్కారమౌతుంది – అందరికీ నా అభినందనలు!''

ఇంతకీ శ్రీధర్ పంత్ తిలక్ ఎవరో ఈతరం యువతీయువకులకు తెలిసి ఉండకపోవచ్చు. చాలామంది లోకమాన్య బాలగంగాధరతిలక్ పేరు వినేఉంటారు కదా? ఆయన మూడవ కుమారుడే శ్రీధర్ బల్వంత్ తిలక్. శ్రీధర్ పంత్ తిలక్(1896–25 మే 1928)గా ప్రసిద్ధులు. తండ్రి ఆలోచనా ధోరణికి పూర్తి భిన్నమైన ఆలోచనా ధోరణి గలవారు. పైగా డా.బి.ఆర్. అంబేద్కర్‌కు చాలా సన్నిహితమిత్రులు. తండ్రి బాల గంగాధర తిలక్ కులవ్యవస్థ, అంటరానితనం ఉండాలన్నారు...కానీ, కొడుకు శ్రీధర్ తిలక్ వాటిని బద్దలు కొట్టాలన్నారు. హిందువులను ఏకం చేయడానికి ఇళ్ళలో ఉన్న గణపతిని వీధుల్లోకి తెచ్చిన ఘనుడు బాల గంగాధర తిలక్. దాని వికృత రూపాలు మనం ఈనాటికీ అనుభవిస్తున్నాం. తండ్రి బాలగంగాధర్ తిలక్ ప్రభావంలో పడకుండా అంటరానితనాన్ని నిర్మూలించడానికి, సమాజంలో సమానత్వం సాధించడానికి శ్రీధర్ పంత్ తిలక్ సమాజ్ సమతా సంఘ్‌ను స్థాపించారు. అంబేద్కర్‌కు సన్నిహితుడు కావడానికి ఇదొక ప్రబల కారణం. అంబేద్కర్ నిర్వహించే అన్ని కార్యక్రమాలలో శ్రీధర్ తిలక్ చాలా చురుకుగా, ఉత్సాహంగా పాల్గొనేవారు. 2 అక్టోబర్ 1927 రోజున పూనాలో ఒక పెద్ద సమావేశం జరిగింది. అది అణగారిన వర్గాల విద్యార్థుల సమావేశం. దానికి అంబేద్కర్ అధ్యక్షత వహించారు. శ్రీధర్ పంత్ తిలక్ అందులో ఒక ముఖ్య వక్తగా పాల్గొన్నారు.

అలాగే, అంటరాని బాలురను శ్రీధర్ తిలక్ ప్రత్యేకంగా తన ఇంటికి భోజనానికి ఆహ్వానించి, తరచూ సహభోజన కార్యక్రమాలు నిర్వహించేవారు. ఆ రకంగా బ్రాహ్మణ ధర్మకర్తలను ధిక్కరించి, వారి ఆగ్రహానికి గురయ్యేవారు. లోకమాన్య బాలగంగాధర తిలక్ ఉన్నప్పుడు ఆయన నివాసాన్ని లోకమాన్య నివాస్‌గా అందరూ గుర్తించేవారు. ఆయన మరణం తర్వాత కొడుకు శ్రీధర్ తిలక్ కూడా అదే ఇంట్లో నివాసముండే వారు. అయితే ఈయన అదే లోకమాన్య నివాస్ ఇంటి ముందు 'చతుర్వర్ణ విధ్వంసక సమితి' అనే బోర్డు తగిలించారు. ఫలితంగా తన తండ్రి ప్రారంభించిన 'కేసరి' పత్రికలోనే తనను విమర్శిస్తూ, ఒక్కోసారి అవమానిస్తూ వ్యాసాలు ప్రకటింపబడుతూ ఉండేవి.

బ్రాహ్మణాధిక్యతను నిలుపాలని తాపత్రయపడే ఆయన తండ్రి అనుయాయులు, అభిమానులు అవి రాసి ప్రచురించేవారు. శ్రీధర్ పంత్ తిలక్ పై బంధువుల, తండ్రి స్నేహితుల ఒత్తిడి విపరీతంగా ఉండేది. అభ్యుదయవాది అయినందుకు ఆయనను ఘోరంగా అవమానిస్తూ తండ్రి ప్రారంభించినపత్రికలోనే వ్యాసాలు రావడం బాధాకరంగా ఉండేది. ఇంటాబయటా ఇన్ని రకాల ఒత్తిళ్ళు భరించలేకనే శ్రీధర్ పంత్ తిలక్ ఆత్మహత్య చేసుకోవలసి వచ్చిందని అతి సన్నిహితంగా ఉండి పరిశీలించిన అంబేద్కర్ ధృవీకరించారు. ఆ మరునాడు 26 మే 1928న జరిగిన సంతాపసభలో శ్రీధర్ తిలక్ సేవలను కొనియాడుతూ తీర్మానం చేశారు. సమతా పత్రిక ఎడిటోరియల్లో – ''శ్రీధర్ పంత్ తిలక్ నుండి నేనెంతో ఆశించాను. కానీ, ఆయన ఇప్పుడు మన మధ్య లేకపోవడం గొప్ప విషాదం'' – అంటూ డా.బి.ఆర్. అంబేద్కర్ శ్రద్ధాంజలి ఘటించారు.

బ్రాహ్మణ సమాజంలోని పిడివాదులు, సనాతనవాదులు, కేసరి మరాఠా ట్రస్ట్ సభ్యులు మూకుమ్మడిగా పెట్టిన మానసిక హింసవల్ల, కోర్టు కేసుల వల్ల, ఏడేళ్ళు కోర్టుల చుట్టూ తిరిగి వేసారిపోవడం వల్ల శ్రీధర్ తిలక్ ఆత్మహత్యకు పూనుకుని ఉంటారు. ఒక ఛాందసుడిగా తన తండ్రి దారిలో నడిచి ఉంటే ఆయనకు ఆ పరిస్థితి వచ్చేది కాదు. ప్రవాహానికి ఎదురీదడం ఎప్పుడైనా కష్టమైన పనే. ధైర్యమైన పనే. తన ప్రత్యర్థులతో వీలైనంత వరకు పోరాడారు కానీ, ఏదో ఒక బలహీన క్షణాన ఆత్మహత్య చేసుకుందామన్న నిర్ణయానికి వచ్చారు. అలా జరగకుండా ఉండాల్సింది. సమాజం అందించిన అన్ని అర్హతలూ ఉండి, అగ్రవర్ణం వాడై ఉండి నిమ్న జాతుల గురించి, అంటరానితనం గురించి అభ్యుదయ కాంక్షతో పనిచేయడమే ఆయన ప్రాణంమీది కొచ్చింది.

బాలగంగాధర తిలక్ అంటరానివాడిగా పుట్టి ఉంటే – ''అంట రానితనం నిర్మూలనే నా జన్మ హక్కు'' అని ఉండేవారేమోనని అన్నారు అంబేద్కర్. ''స్వరాజ్యం నా జన్మ హక్కు'' అన్న బాలగంగాధర తిలక్ 1918లో మహారాష్ట్రలోని బెలగావ్ దగ్గర 'అథేవ్' అనే ఊళ్ళో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ నిమ్నకులాల వారిని ఎలా ఎగతాళి చేశారో చూడండి – ''నూనె తీసేవారు, కల్లుగీసేవారు, కుండలు చేసేవారు చట్టసభల్లోకి వచ్చి నూనె తీస్తారా? కల్లు గీస్తారా? కుండలు చేస్తారా?'' అని శ్రామిక కులాలను అవమానపరిచారు. బ్రాహ్మణులు చట్టసభల్లోకి వచ్చి ఏం చేస్తారూ? పూజా కార్యక్రమాలు, శ్రార్ధ కర్మలు నిర్వహిస్తారా? అని ప్రశ్నించే వాతావరణం ఆనాడు లేదు. అందుకని ఆయనను ఎవరూ ప్రశ్నించలేకపోయారు. ఒకవైపు స్వాతంత్ర్య సమరంలో పాల్గొంటూ, మరొకవైపు స్వదేశీయులను సోదరభావంతో చూడలేని కుత్సిత బుద్ధి గల సంప్రదాయ ఛాందసవాది లోకమాన్య బాల గంగాధర తిలక్ అనే విషయం అందరూ గ్రహించాల్సి ఉంది. స్వాతంత్ర్య పోరాటంలో ఆయన పాత్ర ఏ పాటిదైనా, స్వదేశీయుల్ని విభజించి చూసే మనువాద భావజాలాన్ని ఆధునిక అభ్యుదయ వాదులందరూ ఖండిస్తారు. స్వయంగా ఆయన కుమారుడైన శ్రీధర్ పంత్ తిలకే సహించలేక పోయారు. వెనక్కి నడిపించే తన తండ్రి ఆలోచనా విధానాన్ని త్యజించి.. భావితరాలను ముందుకు నడిపించే మార్గాన్ని ఎన్నుకున్నారు.

మతం, దేవుడు వంటి వ్యక్తిగత విషయాల్ని రాజకీయాల్లోకి తెచ్చి ఈ రోజు గణపతి విగ్రహాల్ని చెత్తకుండీల పక్కన పెట్టించి, ఐటమ్ సాంగ్స్‌కు డాన్సులు చేయిస్తున్న లోకమాన్యుడు ఈ తరానికి మాన్యుడేమీ కాదు. ఆయన కుమారుడు శ్రీధర్ తిలకే మాన్యుడు! కాలంపెట్టిన పరీక్షలో తండ్రి బాల గంగాధర తిలక్ అపజయుడయితే, కొడుకు శ్రీధర్ తిలకే విజయుడయ్యారు. ''లోకమాన్య'' అనే బిరుదుకు అర్హులైన వారు ఎవరైనా ఉన్నారంటే – అది శ్రీధర్ పంత్ (బల్వంత్)తిలకే–'' అని అన్నారు. డా. బి. ఆర్. అంబేద్కర్. నిజమే! ప్రజావ్యతిరేక విధానాలున్న వారికి ఇచ్చే బిరుదులు అనర్థదాయకం.

శ్రీధర్ తిలక్ బ్రాహ్మణ వ్యతిరేకోద్యమాన్ని నడుపుతూ, బాల్య వివాహాల్ని ఆపడంలో, వైధవ్యంలో మగ్గుతున్న మహిళల సంక్షేమం చూడడంలో విశేషంగా కృషి చేశారు. ఈ విషయాల్లో ప్రభోదాంకర్ థాకరే, కేశవరావు జే ధే ఆయనకు సహకరించారు. మరాఠీ పత్రికలకు శ్రీధర్ తిలక్ సామాజిక అంశాలమీద చాలా వ్యాసాలు రాశారు. అవి 'మాజా వ్యాసంగ్' శీర్షికతో పుస్తకంగా వచ్చింది. శ్రీధర్ పంత్ (బల్వంత్) తిలక్‌కు శ్రీకాంత్ శ్రీధర్ తిలక్; జయంత్ శ్రీధర్ తిలక్ అని ఇద్దరు కొడుకులు. వారిలో జయంత్ (1921–2001) రాజకీయాల్లోకి వచ్చారు. రాజ్యసభ మెంబర్‌గా, ఎం.ఎల్.సిగా కూడా ఉన్నారు. మహారాష్ట్ర లెజిస్లేటివ్ కౌన్సిల్ చైర్మన్ గా పదహారేళ్ళ పాటు పనిచేశారు.

సంఘ సంస్కరణకు పూనుకున్నప్పుడు సమాజం తన రాతి గుండెతో స్పందిస్తుంది. దానీ ఫలితాలు ఎంత తీవ్రంగా ఉంటాయంటే–మళ్ళీ ఎవరూ సంస్కరణ గురించి నోరెత్తడానికి కూడా వీల్లేనంతగా భయపెడతాయి. మనిషిని రాచి, రంపాన పెట్టి, హింసించే విషయంలో ప్రభుత్వానికంటే సంఘానికే ఎక్కువ అవకాశాలు, ఎక్కువ మార్గాలూ ఉన్నాయి. అలాంటి మార్గాలు ఉపయోగించే ఈ సమాజం శ్రీధర్ తిలక్ ను బలితీసుకుంది– అని అన్నారు అంబేద్కర్.

తరతరాలుగా సమాజం మీద ఆధిపత్యం గల కులాలు తమతోటి మానవులమీద చేస్తున్న దౌర్జన్యాలను ఒక సామాజిక వైకల్యంగా చూడకుండా ఒక గొప్ప సంప్రదాయంగా పరిగణిస్తూ దాన్నే తమ వారసులకు అందిస్తున్నారని – ఒక నిగూఢమైన, సున్నితమైన అంశాన్ని కూడా అంబేద్కర్ తన సంతాపంలో పొందుపరిచారు.

ఈ అంశం నేటి సమకాలీన పరిస్థితులకు కూడా అన్వయించుకోవచ్చు. సనాతన ధర్మం – సంప్రదాయం – దేశభక్తి – హిందుత్వ అంటూ దేశప్రజల్ని విభజిస్తున్న నేటి కేంద్రప్రభుత్వ చర్యల్ని వివేకవంతులు నిరసించాల్సి ఉంది. పనికొచ్చే మాట ఎవరు ఎప్పుడు ఏ సందర్భంలో చెప్పినా, దాన్ని స్వీకరించి ఆచరణలో పెట్టాల్సిన అవసరం ఉంటుంది. శ్రీధర్ పంత్ తిలక్‌ను ఆదర్శంగా తీసుకుని, ఆధిపత్య కులాలలో ఉన్న విద్యావంతులు, మేధావులు మనుషులందరూ సమానమే అన్న విషయం గ్రహించాలి! అదే విషయం ప్రచారం చేయాలి!! అంతేగానీ, అనవసరంగా మనోభావాలు దెబ్బతీసుకోకూడదు .

**సుప్రసిద్ధ సాహితీ వేత్త, విశ్రాంత బయాలజీ ప్రొఫెసర్ మెల్బోర్న్ నుంచి**

# పంట నష్టం వివరాలు సేకరించండి

## దెబ్బతిన్న పంటలను పరిశీలించిన కలెక్టర్ పమేలా సత్పతి



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : ఇటీవల కురిసిన వర్షానికి దెబ్బతిన్న పంటల వివరాలను రైతుల వారీగా సమగ్రంగా సేకరించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి వ్యవసాయ అధికారులను ఆదేశించారు. శనివారం గన్నేరు వరం మండలం పారువెల్ల, ఖాసింపేట గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షానికి దెబ్బతిన్న పొద్దుతిరుగుడు, మొక్కజొన్న పంటలను కలెక్టర్ పరిశీలించారు. దెబ్బతిన్న పొద్దుతిరుగుడు గింజలు, మొక్కజొన్న కంకులను పరిశీలించారు. ఈ సంధర్భంగా ఆయా గ్రామాల్లో బాధిత రైతులు యాళ్ల చంద్రశేఖర్ రెడ్డి, గుజ్జహరీష్‌తో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. పంట నష్టంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్ని ఎకరాల్లో పంటలు సాగు చేశారు? పెట్టుబడికి ఎంత ఖర్చు చేశారు? ఎంత పంట నష్టం జరిగింది? పెట్టుబడి ఎంత వచ్చేది? అన్ని వివరాలను కలెక్టర్ రైతులను అడిగి తెలుసుకున్నారు. మొక్కజొన్న, పొద్దుతిరుగుడు, వేరుశనగ, ఆయిల్‌ఫామ్ పంటలతో పాటు కూరగాయలను పండిస్తున్నామని రైతులు వివరించారు. ఒకే రకమైన పంట కాకుండా వివిధ రకాల పంటలను పండిస్తున్నామని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సంధర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దెబ్బతిన్న పంటల వివరాలను రైతు వారీగా త్వరగా సేకరించి నివేదిక అందించాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. ఏ ఒక్క రైతు తప్పిపోకుండా చూడాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. దిగుబడి వచ్చే సమయంలో వర్షం కురియడం వల్ల పంటలు దెబ్బతినడంతో నష్టం జరిగిందని చెప్పారు. రైతుల పరిస్థితిని అర్ధం చేసుకుని అధికారులు వారికి అండగా నిలవాలని పేర్కొన్నారు. వ్యవసాయ అధికారులు గ్రామాల వారీగా పంట నష్టాన్ని అంచనా వేయాలని సూచించారు

**కానుగ మొక్కల పెంపకం చేపట్టండి**

రాబోయే వర్షాకాలంలో కానుగ మొక్కల పెంపకంపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. ఖాసింపేటలో మొక్కజొన్న పంటను పరిశీలించిన అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడారు. గ్రామాల్లో రహదారుల వెంట కానుగ చెట్లను పెంచాలని తద్వారా ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంటుందని పేర్కొన్నారు. రహదారుల వెంట చాలా చక్కగా కానుగ చెట్లు పెరిగాయని కలెక్టర్ చెప్పారు. నర్సరీల్లో కానుగ మొక్కల పెంపకంపై దృష్టి సారించాలని తెలిపారు. మొక్కల సంరక్షణకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, తహసీల్దార్ బిక్షపతి, ఎంపిడివో శంకర్, మండల వ్యవసాయాధికారి కిరణ్మయి, ఎంపివో పివి నరసింహారెడ్డి, ఏఈఓ అనూష, మోహన్ రెడ్డి, పలువురు అధికారులు, తదితరులున్నారు.

# జర్నలిస్ట్ యూనియన్ పేరిట వసూళ్లు

## కేసు నమోదు చేయాలని డిఎస్‌పికి వినతి



ప్రజాపక్షం/నల్లగొండ : మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డికి సన్మానం పేరిట అక్రమ వసూళ్లు చేస్తున్న వారిపై కేసు నమోదు చేయాలని టియుడబ్ల్యుజె (ఐజెయు) జిల్లా అధ్యక్షులు గార్లపాటి కృష్ణా రెడ్డి డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లాలో జర్నలిస్ట్ యూనియన్ పేరిట వసూసులకు పాల్పడుతున్న జర్నలిస్టులపై టియుడబ్ల్యుజె (ఐజెయు) ఆధ్వర్యంలో డిఎస్ పి శివరాండ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో తెలంగాణ రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన సందర్బంగా కొంతమంది జర్నలిస్టు జిల్లా కేంద్రంలో యూనియన్ కు సంబంధం లేకున్నా చైర్మన్‌కు సన్మానం చేస్తామని నకిలీ కరపత్రం తయారు చేసి ఇటుక బట్టీలతోపాటు, లాడ్జిలు ఇతర సంస్థల నుంచి వసూళ్లకు పాల్పడుతూ ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. నకిలీ జర్నలిస్టులుగా చెలామణి అవుతూ డబ్బులు వసూళ్లకు పాల్పడినవారిపై స్వయంగా డబ్బులు ఇచ్చిన వారే యూనియన్‌కు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. జిల్లాలో గత కొంతకాలంగా ఏనాడు సంఘంతో పరిచయం లేని సభ్యత్వం లేని నకిలీ జర్నలిస్టుల ఆగడాలు,యూనియన్ గౌరవాన్ని దెబ్బతీస్తున్న జర్నలిస్టులు నకిలీ జర్నలిస్టులపై పోలీసుల కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా నల్లగొండ జిల్లా అధ్యక్షులు దోటి శ్రీనివాస్, ప్రెస్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు పులిమామిడి మహేందర్ రెడ్డి, దోసపాటి సత్యనారాయణ, రెడ్డి పల్లి యాదగిరి, నల్లగొండ నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు జిల్లా యాదయ్య,కత్తుల యాదగిరి, చిన్న పత్రికల సంఘం జిల్లా అధ్యక్షులు పిట్టల రామకృష, యాదగిరి, రవి, ఫోటోగ్రాఫర్స్ శ్రీనివాస్, విజయ్, కనకయ్య, అశోక్, చింత యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



# తాగునీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

ప్రజాపక్షం/సూర్యాపేటకలెక్టరేట్ : తాగునీటి శుద్ధికేంద్రాన్ని శనివారం ఇమాంపేటలో జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు పరిశీలించారు. తాగునీటి సరఫరాల జరుగుతున్న తీరును ఎఇ జనార్ధన్‌ను అడిగి కలెక్టర్ తెలుసుకున్నారు. సూర్యాపేట జిల్లాలోని చందుపట్ల, చిల్పకుంట్ల, ఇమాంపేట ద్వారా సరఫరా అవుతున్న త్రాగునీటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్లాంట్ నందు గ్రిడ్ డిఈ రాజేందర్ అందుబాటులో లేకపోవడం వలన కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తాగునీటి సమస్యల నివారణ కొరకు కమిటీలు ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. త్రాగునీటి సమస్యల నివారణ కొరకు ప్రతి మండలం, మున్సిపాలిటికి ఒక్కటి చొప్పున జిల్లా అధికారులతో కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కమిటీ ఆయా గ్రామాలలో పర్యటించి తాగునీటి తీవ్రతను గుర్తించి ఎప్పటికప్పుడు నివేదికలు అందిస్తారని కలెక్టర్ తెలిపారు. సంబంధిత కమిటీ సభ్యులతో ఆర్డీవోలు వారంలో రెండు సార్లు సమీక్ష సమావేశం నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి గురువారం జిల్లా స్థాయిలో సమావేశం ఉంటుందని తెలిపారు. పాలేరు నుండి చందుపట్ల, చిల్పకుంట్ల ద్వారా తాగునీటి సరఫరా మున్సిపాలిటీలకు, మండలాలు సరఫరా సజావుగా జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్యామ్‌సుందర్‌రెడ్డి, ఏఈ జనార్ధన్‌రెడ్డి, అధికారుల,సిబ్బంది పాల్గొన్నారు.

# మంత్రి పొన్నం 'ఆవేశం స్టార్'

## ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆవేశం స్టార్ అని పేరు పెడదామనుకుంటున్నామని హుజురాబాద్ బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఎద్దేవా చేశారు. అధికారులను బలిచేస్తున్న పొన్నం ప్రభాకర్‌ను మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. శనివారం కరీంనగర్‌లో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ తరపున దానం నాగేందర్‌ను సికింద్రాబాద్ స్థానానికి ప్రకటించారని, ఈ క్రమంలో ఆయన ఎమ్మెల్యే ఎన్నికను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ విలువలను కాపాడాల్సిన స్పీకర్ వెంటనే దానంపై వేటు వేయాలన్నారు. సమస్యలపై ప్రజలు ఫోన్ చేస్తే మంత్రి పొన్నం ప్రభాకర్ ఇష్టానుసారంగా మాట్లాడుతున్నాడని, ఆరు గ్యారంటీలకు తోడుగా ఆయన బూతులను ఏడో గ్యారంటీగా ఇస్తున్నాడని కౌశిక్ రెడ్డి మండిపడ్డారు. కళ్యాణలక్ష్మి చెక్కులు తనతో పంపిణీ చేయవద్దని పొన్నం ఆర్డీవో, ఎమ్మార్వోలతో మాట్లాడిన ఆడియోలు బయటకు వచ్చాయని, అలాంటి మాటలు సిగ్గుచేటని విమర్శించారు. ఆర్డీవో పై చర్యలు తీసుకుంటే మంత్రి పొన్నంపై సైతం చర్యలు తీసుకుని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలు తమను ఓట్లు వేసి గెలిపించారని, అధికార కార్యక్రమంలో భాగస్వామ్యం చేయొద్దని ఎలా అంటారని ప్రశ్నించారు. ఆఫీసర్లు ప్రోటోకాల్ పాటించకపోతే ఇబ్బందులు తప్పవన్నారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో బిఆర్‌ఎస్ పార్టీ లక్ష మెజార్టీతో బిఆర్‌ఎస్ అభ్యర్థి వినోద్ కుమార్ గెలవబోతున్నారన్నారు. సమావేశంలో మాజీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# మోడీకి జేబు సంస్థగా ఇడి, ఎటిఎం కార్డుగా కార్పొరేట్ కంపెనీలు

## సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి




ప్రజాపక్షం/సూర్యాపేట ప్రతినిధి: దేశ ప్రధాని నరేంద్రమోడీకి జేబు సంస్థలుగా ఇడి, ఎటిఎం కార్డుగా కార్పొరేట్ కంపెనీలు మారాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎంఎల్‌ఎ జూలకంటి రంగారెడ్డి అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మల్లు వెంకట నర్సింహారెడ్డి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న లోక్ సభ ఎన్నికల్లో ఓటమి భయంతోనే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వెంటాడి తమ చేతుల్లో ఉన్న నిఘా సంస్థలను ఉసిగొలిపి దాడులు, తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నదని అన్నారు. ముఖ్య మంత్రి అనేది కూడా చూడకుండా కేసులు పెట్టి జైలుకు పంపుతున్నారని అన్నారు. బిజెపికి వ్యతిరేకంగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలపై కక్షగట్టి గవర్నర్ల ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలు సాగకుండా అడ్డుపడుతూ ఆటంక పరుస్తున్నారని అన్నారు. బిజెపి, బిఆర్‌ఎస్ చేస్తున్న మతోన్మాద చర్యలను వ్యతిరేకించిన రచయితలపై, ప్రజాస్వామిక వాదులపై దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, అక్రమ కేసులు పెట్టి హింసిస్తున్నారని విమర్శించారు. ఇండియా కూటమిని పూర్తిగా బలహీన పర్చాలని ఉద్దేశ్యంతో రకరకాల ఎత్తులు, జిత్తులు చేస్తున్నారని, ప్రజలకు అవసరం లేని విధానాలను తీసుకవచ్చి బలవంతంగా రుద్దుతున్నాడని అన్నారు. సిఎఎ తీసుకవచ్చి ప్రజల మధ్య ఐక్యత లేకుండా మత విద్వేషాలు రెచ్చగొడుతుందన్నారు. గత పది సంవత్సరాలుగా ముఖ్యంగా రైతు, కార్మిక వ్యతిరేక చట్టాలు, హద్దు పద్దు లేకుండా అధిక ధరలు పెంచుతూ దేశాన్ని అప్పుల పాలు చేస్తుందన్నారు. ప్రజల ఆస్తులను అమ్మటం, ప్రజల సంపద మొత్తం ధ్వంసం చేస్తూ కొంత మంది కార్పొరేట్ శక్తులకు దోచి పెడుతుందన్నారు. రాజ్యాంగాన్ని మారుస్తానని ప్రకటించిన బిజెపి రానున్న ఎన్నికల్లో ఓడించాలన్నారు. భువనగిరి పార్లమెంట్ నుండి సిపిఎం పోటీ చేస్తుందన్నారు. మిగతా స్థానాల విషయంలో ఆలోచించి తగు నిర్ణయం ప్రకటిస్తామన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా తీవ్ర కరువు పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం వెంటనే కరువు సహాయక చర్యలు చేపట్టి ఎండిపోయిన వరి పంటకు ఎకరాకు 25వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. తక్షణమే కరువు మండలాలు ప్రకటించి కరువు సహాయం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మట్టపల్లి సైదులు, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, కోట గోపి పాల్గొన్నారు.



# మున్సిపాలిటీ అభివృద్ధి పనులు పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రజాపక్షం/నందికొండ : నందికొండ మున్సిపాలిటీ పరిధిలో టియుఎఫ్ఐ, ఎస్‌డిఎఫ్ 25 కోట్ల నిధులతో స్థానిక హిల్ కాలనీలో చేపడుతున్న మున్సిపాలిటీ అభివృద్ధి పనులలో భాగంగా నిర్మిస్తున్న వెజ్ నాన్ వెజ్ మార్కెట్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను స్థానిక ఎమ్మెల్యే కుందూరు జై వీర్ రెడ్డి శనివారం పరిశీలించారు. మార్కెట్ నిర్మాణ పనుల పురోగతి, నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం, ఆభివృద్ధి విషయంలో ఎక్కడ రాజీ పడటంలేదన్నారు. సాధ్యమైనంత త్వరగా ఈ మార్కెట్ కాంప్లెక్స్ ను పూర్తి చేసి ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు మున్సిపల్ వైస్ చైర్మన్ ఆదాసు నాగరాణి విక్రమ్, కౌన్సిలర్ ఈర్ల రామకృష్ణ , పగడాల నాగరాజు , ఉంగరాల శ్రీను, వినయ్ ,ఖాసిం,తేజ,శివ తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల డిగ్రీ ప్రవేశాలకు అర్హత పరీక్ష



ప్రజాపక్షం/నందికొండ : తెలంగాణ గురుకుల డిగ్రీ కళాశాలలో ప్రవేశ అర్హత పరీక్ష దరఖాస్తుకు ఏప్రిల్ 12. చివరి తేదీ అని కళాశాల ప్రిన్సిపాల్ కె రవీంద్ర చారి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిగ్రీ ప్రవేశ అర్హత పరీక్షకు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన వారితోపాటు ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు వ్రాసినవారు అర్హులని ఆయన అన్నారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ, గిరిజన,మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలోని టీ జి ఆర్ డి సి సెట్ 202425 విద్యా సంవత్సరానికి డిగ్రీ ప్రథమ సంవత్సరం ఆంగ్లమాధ్యమంలో ప్రవేశ పరీక్ష కొరకు ఆన్ లైన్ లో ధరఖాస్తులు చేసికోవాలన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 28వ తేదీన నిర్వహించబడుతుందని ఈ అవకాశాన్ని ఇంటర్మీడియట్ విద్యార్థులందరూ వినియోగించు కోవాలని తెలిపారు.



# మనసున్న మారాజు తిరుమల్‌రెడ్డి

ప్రజాపక్షం/అయిజ : జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండలం ఉత్తనూరు గ్రామంలో మాజీ జెడ్పిటిసి, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఉత్తనూర్ తిరుమల్‌రెడ్డి రెండవ వర్థంతిని మాజీ సింగిల్ విండో ప్రెసిడెంట్, బిఆర్ఎస్ నాయకులు సంకాపురం రాముడు ఆధ్వర్యంలో, బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జోగులాంబ జిల్లాలో గద్వాల, అలంపూర్ ఎమ్మెల్యేలను ఒంటి చేత్తో గెలిపించిన లెజెండ్, మనసున్న మారాజు అని కొనియాడారు.ఆయన లేని లోటు ఎవరు తీర్చలేదని ఆయన జ్ఞాపకాలతో ఆయన అడుగు జాడల్లో నడచి మా గురువు తిరుమల్ రెడ్డి ఆశయాలను నిలబెడతామని అన్నారు.

# మహిళలు బలహీనులు కాదు

## జడ్‌పి చైర్‌పర్సన్ సరితా తిరుపతయ్య



ప్రజాపక్షం/మానవపాడు : అలంపూర్ నియోజక వర్గం ఉండవెల్లి మండలం మహిళ సాధికారతను అనుసరించి ప్రయాగ్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ యాజమన్యం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జడ్పి చైర్ పర్సన్ సరితా తిరుపతయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు దేనిలోను తక్కువ కాదని, బలహీనులు కాదని ఇప్పుడు అన్నీ రంగాల్లో మిస్సైల్స్ లాగా దూసుకుపోతున్నారని అన్నారు. కార్యక్రమంలో పుల్లూరు నారాయణమ్మ, ఉండవెల్లి సర్పంచ రేఖ వెంకటేశ్వర్లు, కరస్పాండెంట్ చంద్రారెడ్డి, ప్రిన్సిపల్ ఫరాయతుల్లా, శ్రీదర్‌రెడ్డి, జైపాల్ రెడ్డి, నాగేంద్రయాదవ్, రాముడు, ఆనంద్, షమీ, షాశా, మద్దిలేటి పాల్గొన్నారు.

# తాటిచెట్టు పైనుంచి పడి గీతకార్మికుడు మృతి

ప్రజాపక్షం/చండూరు : నల్లగొండ జిల్లా చండూరు మండలం పుల్లెంల గ్రామంలో తాటిచెట్టు పై నుండి క్రింద పడి గీత కార్మికుడు చనిపోయిన దుర్ఘటన జరిగింది. కుటంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పుల్లెంల గ్రామానికి చెందిన పాలకూరి మారయ్య తండ్రి పాపయ్య (వయస్సు 65) రోజు మాదిరిగానే గురువారం తాటిచెట్లు ఎక్కెందుకు వెళ్ళిన మారయ్య తాటిచెట్టు పైకి ఎక్కి కల్లు గీస్తుండగా అకస్మాతుగా పైనుండి జారి కింద పడి తీవ్ర గాయాలతో ప్రాణాపాయ స్థితిలో ఉండగా కుటంబ సభ్యులు హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తుండగా శనివారం మారయ్య మృతి చెందాడు. మారయ్యకు భర్యతో పాటు ఇద్దరు కొడుకులు, ఒక కూతరు కలదు. శనివారం మారయ్య కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

# ప్రాణం తీసిన బండ పంచాయితీ



ప్రజాపక్షం/చింతపల్లి : కుటుంబ సభ్యుల మధ్య ఓ బండ కోసం జరిగిన పంచాయతీ చిలికి చిలికి గాలివానలా మారి ఓ నిండు ప్రాణాన్ని బలిగొన్న సంఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. సిఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని తీదేడు గ్రామంలో సంపంగి ఎల్లయ్య తన కుమార్తె దేవిని ఆలకుంట్ల రాజు(38)కు ఇచ్చి వివాహం జరిపించాడు. అదే విధంగా ఎల్లయ్యకు కుమారుడు సంపంగి కోటేష్ కూడా ఉన్నాడు. ఎల్లయ్య కుమారుడు, కుమార్తె, అల్లుడితో కలసి ఒకే కుటుంబంగా ఉండి తీదేడులో బండలు కొట్టి జీవనం సాగిస్తున్నారు. రోజూ మాదిరిగానే శుక్రవారం షేర్ బండ వద్దకు రాళ్ళు కొట్టేందుకు ఎల్లయ్య, కేటేష్, రాజు వెళ్ళగా వీరి మధ్య మాట మాట పెరిగి ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. ఇదే విషయమై రాత్రి గ్రామంలో పశువుల ఆసుపత్రి వద్ద ఎల్లయ్య తన కుమారుడు కోటేష్‌తో కలసి రాజుపై కర్రతో దాడి చేశారు. రాజు కిందపడడంతో పక్కనే ఉన్న బండ రాయిని రాజుపై వేయడంతో తీవ్ర రక్త స్రావమయి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ యాదయ్య తన సిబ్బందితో కలసి ఘటన స్థలానికి చేరుకొని హత్యకు గల వివరాలను తెలుసుకున్నారు. సంఘటన స్థలాన్ని శనివారం దేవరకొండ డిఎస్‌పి గిరిబాబు పరిశీలించారు. మృతుడి భార్య దేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ నవీన్‌కుమార్ తెలిపారు. మృతుడికి ఒక కుమార్తె ఇద్దరు కుమారులున్నారు. మృత దేహానికి పోస్టుమర్టం నిర్వహించేదుకు దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సిఐ తెలిపారు.



# ప్రమాణాలు పాటించని వైద్యశాలలపై చట్టపరమైన చర్యలు

## జిల్లా వైద్యాధికారి కోటాచలం

ప్రజాపక్షం/కోదాడ : ప్రమాణాలు పాటించని వైద్యశాలలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సూర్యాపేట జిల్లా వైద్యాధికారి కోటచలం అన్నారు.శనివారం పట్టణంలోని పలు ప్రైవేట్ వైద్యశాలలను,ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్లను ఆయన ఆకస్మీకంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్లలో లింగనిర్ధారణ పరీక్షలు, అబార్షన్‌లు చేస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. స్కానింగ్ సెంటర్‌లలో గర్భిణీల పరీక్ష నివేదికలను పరిశీలించారు. నర్సింగ్ హోమ్‌లలో కాన్పులు అయినా మహిళల వివరాలను పరిశీలించామన్నారు. జిల్లా వైద్యశాఖ కార్యాలయానికి కాన్పుల, పరీక్షల వివరాలను వసూలు చేస్తున్న బిల్లులను పరిశీలించామన్నారు. ఫిజియోథెరపి కేంద్రం పక్కన ల్యాబ్‌ను సీజ్ చేశామని, ధ్రువీకరణ పత్రాలు సమర్పిస్తే తిరిగి అనుమతులు ఇస్తామని తెలిపారు.రాష్ట్రవైద్యశాఖ డైరక్టర్ ఆదేశాల మేరకు ఈ తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు.



# జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాపక్షం/నల్లగొండ : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొన్నటువంటి సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టియుడబ్లుజె ఐజెయు జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం రాష్ట్ర పిలుపు మేరకు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం జాయింట్ కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్నటువంటి ఇండు, ఇండ్ల స్థలాలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, గత పాలనలో జర్నలిస్టులు అనేక ఇబ్బందులు పడ్డ పరిస్థితి గమనించిన నూతన ప్రభుత్వం వారికి హెల్త్ కార్డులు, ఇండ్ల స్థలాలు, ఇండ్లు త్వరగా నిర్మాణం చేసి వారి సమస్యలను పరిష్కరించాలని అన్నారు. ఎలక్ట్రానిక్ ప్రింట్ మీడియా జర్నలిస్టులు సమస్యలపై వెజ్ బోర్డ్ ను ఏర్పాటు చేయాలన్నారు. మీడియా కమిషన్ రాజ్యాంగ భద్రత కల్పించాలని భారత ప్రజాస్వామ్యానికి నాలుగవ స్తంభంగా పరిగణిస్తున్న జర్నలిస్టులకు స్వేచ్ఛను కల్పించి జర్నలిస్టుల భద్రత రక్షణ మీడియా స్వేచ్ఛ కోసం కేంద్ర ప్రభుత్వం వెంటనే చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. వర్కింగ్ జర్నలిస్టులు నాన్ వర్కింగ్ జర్నలిస్టుల కోసం తక్షణమే ప్రభుత్వం వెస్ట్ బోర్డ్ ఏర్పాటు చేయాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా నల్లగొండ జిల్లా అధ్యక్షులు దోటి శ్రీనివాస్, ప్రెస్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు పులిమామిడి మహేందర్ రెడ్డి, దోసపాటి సత్యనారాయణ, రెడ్డిపల్లి యాదగిరి, నల్లగొండ నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు జిల్లా యాదయ్య, కత్తుల యాదగిరి, చిన్న పత్రికల సంఘం జిల్లా అధ్యక్షులు పిట్టల రామకృష్ణ, యాదగిరి, రవి, ఫోటోగ్రాఫర్స్ శ్రీనివాస్,విజయ్, కనకయ్య, అశోక్ , చింత యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



# జర్నలిస్టులకు స్వేచ్ఛ కల్పించాలి

ప్రజాపక్షం/కొండమల్లేపల్లి : జర్నలిస్టులకు స్వేచ్ఛను కల్పించాలని టియుడబ్ల్యుజె (ఐజెయు) దేవరకొండ డివిజన్ అధ్యక్షుడు గాదె గిరిధర్‌రావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జర్నలిస్టు డే సందర్భంగా శనివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మండల జర్నలిస్టులతో కలిసి ఆయన నల్ల బ్యాడ్జిలు ధరించి కేంద్ర ప్రభుత్వం మీడియాపై వ్యవహరిస్తున్న వైఖరికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మీడియా కమిషన్‌కు రాజ్యాంగ భద్రత కల్పించాలని అన్నారు. జర్నలిస్టులందరికి అక్రిడిటేషన్ కార్డులను ఇచ్చి, రైల్వే పాసులను పునరుద్ధరణ చేసి, హెల్త్ కార్డులు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యుజె (ఐజెయు) దేవరకొండ నియోజకవర్గ కోశాధికారి బూడిద శ్రీనివాస్‌యాదవ్, చిలువేరు శ్రీధర్, మెయినోద్దిన్, బొమ్ము వెంకటరమణ, వెంకట్, సయ్యద్ పాషా, పెద్దిశెట్టి మహేందర్, చేపూరి కార్తీక్, కొర్ర నాగరాజు, భూతరాజు అంజి, అడెపు సతీష్, పొదిల శేఖర్, తోటపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# ఉపాధిహామీ జిల్లా అదనపు అధికారి ఆకస్మిక తనిఖీ

ప్రజాపక్షం/గుండాల : యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలంతో పాటు రామారం గ్రామంలో ఉపాధి హామీ పనులను ఉపాధి హామీ జిల్లా అదనపు అధికారి సురేష్‌కుమార్ శనివారం అకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్ళి వారు చేస్తున్న పనులను పరిశీలించి పనులు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ఉపాధి హామీ కూలీలకు మంచి నీరు, టెంట్ సదుపాయాలను ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం నర్సరీలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపివో ఇమ్మాన్యూయేల్, టీఏలు సోమయ్య, పల్లవి, ఎఫ్‌ఏలు పరశురాములు, నవనీత, పంచాయతీ కార్యదర్శులు రమేష్, సరిత, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గ్రూపు రాజకీయాలను సహించను

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



**ప్రజాపక్షం/గీసుకొండ :** రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో ప్రతీ బూత్‌లో కాంగ్రెస్ మెజార్టీ లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు ఐక్యతతో పనిచేయాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి కోరారు. గ్రూపు రాజకీయాలను సహించనని కష్టపడ్డ ప్రతీ కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటానన్నారు. గీసుకొండ మండలంలోని మరియపురంలో గల ఎస్ఎస్ గార్డెన్‌లో సంగెం, గ్రేటర్ వరంగల్ పరిధిలోని 17వ డివిజన్ కాంగ్రెస్ గ్రామ, బూత్ స్థాయి నాయకులతో శనివారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై బూత్‌ల వారీగా సమీక్షించారు. అనంతరం ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ.. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం అసెంబ్లీ ఎన్నికల్లో తన గెలుపు కోసం పట్టుదలతో పనిచేశారని అదే మాదిరి రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. పార్లమెంటు ఎన్నికల తరువాత ప్రజలు బీఆర్ఎస్‌ను బొంద పెడతారని, బీజేపీని తరిమికొడతారని ప్రజల ఆశీస్సులతో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే రాబోతుందన్నారు.

## అక్రమ మద్యం స్వాధీనం

కారు సీజ్, ఇద్దరి పై కేసు నమోదు



**ప్రజాపక్షం/ఏటూరు నాగారం :** ములుగు జిల్లా ఏటూరునాగారం ఏజెన్సీ ప్రాంతంలో ఎన్నికల నిబంధనలను ఉల్లంగించి కారులో అక్రమంగా తరలిస్తున్న సుమారు 68 వేల 700 రూపాయల మద్యాన్ని సీజ్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ రామకృష్ణ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి స్థానిక చెక్ పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా తాడువాయి నుండి టాటా ఇండికా కారులో మద్యం సీసాలు, క్వార్టర్స్ కనిపించడంతో అక్కడ ఉన్న సిబ్బంది కారును అపి తనిఖీ చేయగా కారులో 20 కాటన్ బీర్లు, 3 మద్యం కాటన్ లు కనిపించడం జరిగింది. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా పెద్దపెల్లి జిల్లా మంథని ప్రాంతానికి చెందిన కొండ మహేందర్, ఏటూరు నాగారం మండలం మల్యాల గ్రామానికి చెందిన ముక్కెర రవళిల పై కేసు నమోదు చేసి, స్థానిక తహాసిల్దార్ జగదీశ్వర్ ఎదుట బైండ్ ఓవర్ చేశారు. కార్ ఏపీ 15బిహెచ్ 5244 ను సీజ్ చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికిని మద్యం రవాణా చేస్తూ ముందస్తుగా అక్రమ నిల్వలు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ సందీప్, సిబ్బంది తిరుపతి, నవీన్, నాగరాజు, వీరన్న, శ్రీనివాస్, ప్రణవ్ తదితరులు పాల్గొన్నారు.

## పంటనష్టం పరిశీలన

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** గతవారం కురిసినటువంటి వడగండ్ల ప్రభావం వల్ల ప్రభావితమైనటువంటి వరి మొక్కజొన్న పంటల క్షేత్రాలను జిల్లా వ్యవసాయ అధికారి శ్రీ గోవింద్ శనివారం రోజున పరిశీలించడం జరిగింది. ఈరోజు నిజాంపేట కాశీంపూర్ తాండ జద్చర్ తండా గ్రామాలలో వ్యవసాయ విస్తీర్ణాధికారులు పంట నష్ట వివరాలను సేకరిస్తున్నటువంటి విధానాన్ని పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ సేకరించినటువంటి పంట నష్ట వివరాలను ఉన్నతధికారులకు పంపించడం జరుగుతుందని తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ మండల వ్యవసాయ అధికారి రాజ్ నారాయణతో పాటుగా వ్యవసాయ విస్తీర్ణాధికారులు కావేరి శ్రీలత ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## పేదలకు వరం 'పోషణ్ పక్వాడా'

**ప్రజాపక్షం/అక్కన్నపేట :** ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ఐసీడీఎస్ పథకం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చేపట్టిన పోషన్ పక్వాడా కార్యక్రమంతో ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు కృషి చేయాలని సీడీపీవో జయమ్మ పిలుపునిచ్చారు. అంగన్‌వాడీ ప్రతినిధులకు హుస్నాబాద్ ఐసిడిఎస్ సీడీపీవో పరిధిలోని అక్కన్నపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం పోషణ్ పక్వాడా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు బి.రేణుక,ఎమ్.సుజాత,ఐసిపిఎస్ రాజు,పోషన్ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ కిరణ్,హెల్త్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి ,ఏఎన్ఎమ్ భాగ్యపాల్గొన్నారు.

## రూ.50 లక్షలు పట్టివేత

**ప్రజాపక్షం/గజ్వేల్:** గజ్వేల్ అంబేద్కర్ చౌరస్తాలో శుక్రవారం రాత్రి పోలీసులు జరిపిన తనిఖీల్లో రూ. 50 లక్షలు లభించాయి. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు వాహన తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. కాగా 22వ తేదీ శుక్రవారం రాత్రి 9 గంటల సమయంలో సిఐ సైదా, అడిషనల్ సీఐ ముత్యం రాజు నేతృత్వంలో స్థానిక పోలీసులు, సిఐఎస్ఎఫ్ సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తుండగా, రాయపోల్ కు చెందిన బచ్చు రత్నాకర్ తన కారులో రూ.50 లక్షలు ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకొని వెల్తుండగా, తనిఖీల్లో పట్టుబడ్డట్లు చెప్పారు. ఆయితే కలెక్టర్ కార్యాలయంలోని గ్రీవెన్స్ కమిటీకి ద్వారా వారికి ఇవ్వనుండగా, సదరు బాధితులు డబ్బులకు సంబంధించిన పత్రాలు చూపించి రిలీజ్ చేసుకోవాలని వివరించారు.

## మైనర్ బాలికపై లైంగిక దాడికి యత్నించిన ఇన్స్‌పెక్టర్ సస్పెన్షన్



**ప్రజాపక్షం/హనుమకొండ:** మైనర్ బాలిక లైంగిక దాడికి యత్నించి ఫోక్సో కేసులో అరెస్టైయిన భూపాలపల్లి జిల్లా సైబర్ క్రైం ఇన్స్‌పెక్టర్ బండారి సంపత్ కుమార్‌ను సస్పెండ్ చేస్తూ మల్టీజోన్ 1 ఐజి ఎవి రంగనాథ్ ఉత్తర్వులు జారీచేసారు. భూపాలపల్లి జిల్లాలోని సైబర్ క్రైం ఇన్స్‌పెక్టర్‌గా పనిచేస్తున్న బండారి సంపత్ కుమార్ గతంలో వరంగల్ పోలీస్ కమీషనరేట్ పరిధిలోని కెయుసి పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా విధులు నిర్వహించాడు. అక్కడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ కాలనీలో ఉంటున్న మహిళతో పరిచయం ఏర్పడింది. ఇన్స్‌పెక్టర్ పరిచయంతో మహిళ కాపురంలో గొడవలు రావడంతో భర్తతో దూరమై సంపత్‌తో సహజీవనం చేయసాగాడు. దీనితో సదరు మహిళ భర్త గతంలో వరంగల్ పోలీస్ కమీషనర్ రంగనాథ్‌కు పిర్యాదు చేయగా విఆర్‌కు అటాచ్ చేసారు. కొద్ది రోజుల తర్వాత సంపత్ కుమార్‌కు ఇన్స్‌పెక్టర్గా పదోన్నతిపై భూపాలపల్లి జిల్లా సైబర్ క్రైం ఇన్స్‌పెక్టర్‌గా నియమించబడ్డాడు. ఇన్స్‌పెక్టర్ సంపత్ సదరు మహిళ వద్దకు వస్తూ పోతున్న క్రమంలో అతని దృష్టి మహిళ కుమార్తెపై పడింది. ఇటీవల కాలంలో ఇన్స్‌పెక్టర్ సంపత్ ఆ బాలికపై అత్యాచారానికి యత్నించాడు. ఈ సంఘటనతో సదరు మహిళ కెయుసి పోలీసులకు పిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ అనంతరం సంపత్‌పై ఫోక్సో కేసు కింద అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. భద్రత కల్పించాల్సిన పోలీస్ అధికారి బాలికపై అత్యాచారానికి యత్నించినందుకు ఇన్స్‌పెక్టర్ సంపత్‌పై శాఖపరమైన తీసుకునే చర్యల్లో భాగంగా భూపాల్‌పల్లి సైబర్ క్రైమ్ ఇన్స్‌పెక్టర్ సంపత్ కుమార్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు మల్టీజోన్ 1ఐజీ ఎవి రంగనాథ్ వెల్లడించారు.

# భగత్‌సింగ్ స్ఫూర్తితో ఉద్యమిద్దాం







**ప్రజాపక్షం/కురవి :** భగత్ సింగ్ స్ఫూర్తితో మతోన్మాదం,అవినీతి,అక్రమాలపై యువత ఉద్యమించాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు.శనివారం మండల కేంద్రంలోని సిపిఐ నియోజకవర్గ కార్యాలయంలో భగత్ సింగ్ 93వ వర్ధంతిని పురస్కరించుకుని చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాలులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వేచ్ఛా,స్వాతంత్ర్యం కోసం విరోచిత పోరాటం చేశారన్నారు.దోపిడి రహిత నవ సమాజ నిర్మాణ ఆశయ సాధన కోసం భగత్ సింగ్ నిస్వార్ధ త్యాగ నీరతి నేటి యువతకు ప్రేరణ కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కరణం రాజన్న,తురక రమేష్,దూదికట్ల సారయ్య,నిలుగోండ నాగేశ్వరరావు,బోల్లం అనీల్,విజయ్,వీరన్న తదితరులు పాల్గోన్నారు.

**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** నేటి యువత భగత్ సింగ్ ఆశయాల సాధన కోసం కృషి చేయాలని ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు బట్టు కరుణాకర్ అన్నారు. శనివారం ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో భగత్ సింగ్ వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక సంఘమిత్ర డిగ్రీ కళాశాలలో భగత్ సింగ్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు బట్టు కర్ణాకర్ మాట్లాడుతూ, స్వాతంత్ర ఉద్యమంలో భగత్ సింగ్ పాత్ర చిరస్మరణీయం అని కొనియాడారు. వారి యొక్క సిద్ధాంతాల కోసం ఆశయాల కోసం నిరంతరం యువకులు వారి పోరాట స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మట్టేవాడ సురేశ్, అఖిల్, తిలక్ చారి, అజయ్, రాజు, ప్రేమ్, విజేం





**ప్రజాపక్షం/తొర్రూరు రూరల్ :** దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన భగత్ సింగ్ స్ఫూర్తితో ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న పాలకులపై ఉద్యమిద్దామని పివైఎల్, పిడిఎస్‌యు మహబాదు జిల్లా కార్యదర్శులు ఇరుగు అనిల్, భూక్యా సంతోష్ పిలుపునిచ్చారు. శనివారం మహబాదు జిల్లా తొర్రూరు డివిజన్ కేంద్రంలో భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్‌ల 93వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో నాయకులు సెగ్గెం యాకయ్య, వీరన్న, వెంకట్, ప్రశాంత్, రాము, హరీష్, సత్యం, బాలు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/దామెర :** హన్మకొండ జిల్లా దామెర మండలం ఒగులాపూర్ గ్రామంలోని భూపోరాట కమిటీ ఆద్వర్యంలో భగత్ సింగ్ 93వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్ సింగ్ చిత్రపటానికి సీపీఐ జిల్లా సమితి సభ్యులు కొట్టెపాక రవి తదితరులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కొట్టెపాక రవితో పాటు సీపీఐ మండల కార్యదర్శి అంబి సాంబయ్య, జిల్లా సమితి సభ్యులు కండె నర్సయ్య, సహాయ కార్యదర్శి దండు భాస్కర్, కోశాధికారి గొలుసుల దేవేందర్, మండల నాయకులు నాగవెల్లి ఐలయ్య, గందం గట్టయ్య, అమ్మ సాంబయ్య, గంధం శోభక్క, దేవక్క, డి.సుమన్, ఈరన్న,సుకన్న, మమత, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** స్వతంత్ర పోరాట యోధుడు భగత్ సింగ్ ఆశయాలు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మోట పలుకుల రమేష్ అన్నారు. శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని స్థానిక ఏఐటీయూసీ కొమురయ్య భవన్లో భగత్ సింగ్ వర్ధంతి వేడుకలు సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా భగత్ సింగ్ వర్ధంతి నీ పురస్కరించుకుని భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నాయకులు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి సోత్కు ప్రవీణ్ కుమార్, జిల్లా నాయకులు క్యాతరాజు సతీష్, వేముల శ్రీకాంత్, నేరెళ్ల జోసెఫ్, ఏఐటీయూసీ వైస్ ప్రెసిడెంట్ మాతంగి రామచందర్, సహాయ కార్యదర్శి విజేందర్, జి శ్రీనివాస్, బ్రాంచ్ నాయకులు పాషా, పోశం, ఫిట్ సెక్రటరీ మాటేటి శ్రీనివాస్, దొర్నాల తిరుపతి, జీ తిరుపతి, ఎల్ శంకర్, రమేష్, నారాయణ మూర్తి పాల్గొన్నారు.



## మీడియా సెంటర్‌ను ప్రారంభించిన కలెక్టర్

**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** లోకసభ ఎన్నికలు 2024 మీడియా సెంటర్‌ను సమీకృత కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనుచౌదరి శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా శాసనసభ ఎన్నికల సందర్భంగా మీడియా సెంటర్ ద్వారా నిర్వహించిన విధుల సమాచారాన్ని డిపిఆర్ఓ రవికుమార్, డిఈపిఆర్ తిరుపతి నాయక్‌లు కలెక్టర్‌కు వివరించారు. ఆనంతరం జిల్లా కలెక్టర్ నేషనల్ గ్రీవెన్స్ సర్వీస్ పోర్టల్ , సి విజిల్, 1950 డిస్ట్రిక్ట్ కాంట్రాక్టు సెంటర్‌ను పరిశీలించి, ఎన్నికల సంబంధించిన వివరాలను మీడియా సెంటర్ ద్వారా లోకసభ ఎన్నికల వివరాలను మీడియాకు అందించాలన్నారు. ప్రింట్, ఎలక్రానిక్ మీడియాలో వచ్చే పెయిడ్ న్యూస్‌ను మానిటరింగ్ చేయాలన్నారు.1950 డిస్ట్రిక్ట్ కాంట్రాక్టు సెంటర్ ద్వారా ఎన్నికల సంబంధం ఫిర్యాదులను స్వీకరించాలన్నారు. సివిజిల్ ద్వారా వచ్చే ఫిర్యాదులను 100 నిమిషాల్లో పరిశీలించి ముగించేలా సంబంధిత ఎన్నికల అధికారులకు సమాచారం అందించాలన్నారు. సోషల్ మీడియాలో వచ్చే రాజకీయ సంబంధం అంశాలను ప్రత్యేకంగా పరిశీలించాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ ఎఓ రహమాన్, ఎలక్షన్ సూపరింటెండెంట్ మధుసూదన్, సమాచార శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



**ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలి**

ఓటరు అవగాహన కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 5కె రన్‌ను జిల్లా కలెక్టర్ మనుచౌదరి ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అనేది చాల కీలకమైందన్నారు. లోక సభలో ఎన్నికలో ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ఓటు 18 ఏండ్లు నిండిన వారు ఓటు హక్కు నమోదు చేసుకోవటంతో పాటు ఓటు హక్కును విధిగా వినియోగించుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో స్వీప్‌నోడల్ అధికారి జగదేవ్, ఆర్డీఓ సదానందం తదితరులు పాల్గొన్నారు.

## నూతన మెళకువలతో ఆర్థిక అభివృద్ధి



**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి :** నూతన మెళకువలతో వ్యాపార రంగంలో ఆర్థిక అభివృద్ధి చేకూరుతుందని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు రమేష్ అన్నారు. శనివారం మెదక్ చర్చి కాంపౌండ్ ఆవరణలో తెలంగాణ వాణిజ్య , పరిశ్రమల సమాఖ్య భారత ప్రభుత్వ వాణిజ్య పరిశ్రమ మంత్రిత్వ శాఖ ద్వారా ఎగుమతులు, దిగుమతుల నిర్వహణ అనే అంశంపై చిన్న తరహా మరియు మధ్య తరహా వ్యాపార పరిశ్రమల దారులకు ఆరు రోజులపాటు శిక్షణ కార్యక్రమం మెదక్ పట్టణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మెదక్ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రమేష్ హాజరై మాట్లాడుతూ ఎగుమతులు ప్రోత్సహించే విధంగా చిన్న వ్యాపారులకు ఎగుమతి దిగుమతులకు సంబంధించి వివిధ ప్రక్రియలు, లైసెన్సింగ్ విధానం, భారత ప్రభుత్వ విధానాలు, ఆర్థిక సహాయాలు, డిజిఎఫ్‌టి, ఎఫ్ఈఎంఏ పాత్ర, తెలంగాణ ప్రభుత్వ మద్దతు విధానాలు గురించిన విషయాల పై అవగాహన కల్పించడం దీని ముఖ్య ఉద్దేశం అన్నారు. స్థానిక పరిశ్రమల విభాగం జనరల్ మేనేజర్ కృష్ణమూర్తి, యువ వ్యవహారాల సమన్వయకర్త పాల్గొని ఇది చాలా ఉపయోగకరమైన కార్యక్రమమని దీన్ని అందరూ తమ ఎదుగుదలకు ఉపయోగించుకోవాలని బోధించారు. ఎగుమతి దిగుమతుల నిర్వహణలో అనుభవజ్ఞులైన శిక్షకులు వివిధ వృత్తులకు సంబంధించిన దాదాపు వందమంది కి గల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలోయువజన క్రీడల నిర్వహణ అధికారి నాగరాజు, మత్స్య శాఖ అధికారి నరసింహ రావు పాల్గొన్నారు.

## పిల్లలకు పౌష్టికాహారం అందించాలి



**ప్రజాపక్షం/ములుగు జిల్లా ప్రతినిధి :** అంగన్‌వాడీ కేంద్రాలలోని పిల్లలకు గర్భిణీ స్త్రీలకు ఆరోగ్యవంతమైన పౌష్టికాహారాన్ని అందించాలని ములుగు జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్ జి అన్నారు. శనివారం ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్‌లో పోషణ పక్వాడ ముగింపు ఉత్సవాలను ఐసిడిఎస్ అధికారి స్వర్ణలత లెనిన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) సిహెచ్ మహేందర్ జి హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు గర్భిణీ స్త్రీలకు బాలింతలకు రుచికరమైన పౌష్టికాహారాన్ని అందించాలని అన్నారు. ఈ సంవత్సరం పోషణ అభియాన్‌లో భాగంగా పోషణ పక్వాడ కార్యక్రమం మార్చి 9వ తేదీ నుండి 23వ తేదీ వరకు నిర్వహించడం జరిగిందని దీనిలో భాగంగా చిరుధాన్యాలు, గుడ్లు, ఆకుకూరల వలన కలిగే లాభాలను స్థానిక అంగన్‌వాడీ టీచర్స్ ద్వారా అందరికి వివరించామని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలలోని చిన్నారులకు, బాలింతలకు, గర్బిణీ స్త్రీలకు పోషణ ఆహారం లోపం ఉండకుండా చూడడం కోసం పోషణ పక్వాడ కార్యక్రమం ద్వారా ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేసి పౌష్టికాహారంపై జిల్లా సంక్షేమాధికారి స్వర్ణలత లెనిన మాట్లాడుతూ ములుగు జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి 640 అంగన్‌వాడీ కేంద్రాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని పౌష్టికాహారంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలామృతంతో పాటు పౌష్టికాహారాన్ని అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ శ్రీనివాస్‌కుమార్, జిల్లా వైద్యాధికారి ఆలెం అప్పయ్య, ఎస్‌సి డెవలప్‌మెంట్ అధికారి తుల రవి, జిల్లా మైనారిటీ అధికారి ప్రేమలత, ఐసిడిఎస్ సిడిపిఓలు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.



## మౌలిక వసతులు తప్పనిసరి

పదవ తరగతి పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ ప్రావీణ్య

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్ :** పదవ తరగతి పరీక్షల నిర్వహణలో భాగంగా మౌలిక వసతులు సరిగా ఉండాలని కలెక్టర్ పి ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. శనివారం వరంగల్ నగరంలోని కాశిబుగ్గ నరేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఎల్‌బినగర్‌లోని లేర్నర్స్ ల్యాండ్ కేంద్రాలలో జరుగుతున్న పదవ తరగతి పరీక్షల నిర్వహణను ఆకస్మికంగా సందర్శించి పరీక్ష రాయు విధానం సరళిని పరిశీలించారు. పరీక్షకు హాజరైన విద్యార్థుల వివరాలను జిల్లా కలెక్టర్ చీఫ్ సూపరింటిండెంట్‌లను అడిగి తెలుసుకున్నారు. మాస్ కాపీలు జరగకుండా బాధ్యతగా పర్యవేక్షించాలని ఇన్విజిలేటర్స్‌ను ఆదేశించారు. పరీక్ష కేంద్రంలో ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు సెల్‌ఫోన్లు అనుమతించరాదని, పరీక్ష కేంద్రం సమీపంలో జిరాక్స్ సెంటర్లు ఉండరాదని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ పటిష్టంగా అమలు పరచాలని సంబంధిత పోలీసు అధికారులను కలెక్టర్ సూచించారు. ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే పరీక్షా కేంద్రా ల్లోకి అనుమతించాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కల్పించిన త్రాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇతర సౌకర్యాలు, మెడికల్ క్యాంపులను పరిశీలించి, నిరంతరం విద్యుత్ ఉండేలా అన్ని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. కలెక్టర్ వెంట స్థానిక తహసీల్దారు మహ్మద్ ఇక్బాల్, చీఫ్ ఎగ్జామినర్ శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

## జర్నలిస్టుల డిమాండ్‌లు కేంద్రం పరిష్కరించాలి



**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి :** జర్నలిస్టుల డిమాండ్ లు కేంద్రం పరిష్కరించాలని టియూడబ్ల్యూజె జిల్లా అధ్యక్షులు శంకర్ దయాళ్ చారి డిమాండ్ చేశారు. ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజెయు) పిలువు మేరకు షాహిద్ భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా శనివారం మెదక్ పోస్ట్ ఆఫీస్ వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రధాన అంశాలపై దృష్టి పెట్టాలని జర్నలిస్ట్ డిమాండ్ డేగా పాటించాలని నిర్ణయించిందన్నారు. ప్రెస్ కమిషన్ చివరి నివేదిక 1982లో వెలువడింది. గత నాలుగు దశాబ్దాలుగా దేశంలో ఎలక్ట్రానిక్ మీడియా, డిజిటల్ మీడియా రాకతో మీడియా దృష్టాంతంలో పెను మార్పు వచ్చింది. మీడియా సమస్యలను పరిష్కరించడానికి కొత్త మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలి. జర్నలిస్టులు, మీడియా సంస్థల భద్రత కోసం, ఆ ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టడానికి జర్నలిస్టులకు స్వేచ్ఛ చాలా ముఖ్యమైనదన్నారు. ఆ స్వేచ్ఛ అంతకంతకూ దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల భద్రత, రక్షణ, మీడియా స్వేచ్ఛ కోసం కేంద్ర ప్రభుత్వం వెంటనే ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. వర్కింగ్ జర్నలిస్టులు, నాన్ జర్నలిస్టుల కోసం వేజ్ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. 2007 సంవత్సరంలో మజితియా వేజ్ బోర్డ్ ఏర్పాటు చేయబడింది. ప్రభుత్వ, ప్రైవేట్ రంగ ఉద్యోగులకు వేతనాలు రెండుసార్లు సవరించబడ్డాయి. అయితే వార్తాపత్రిక పరిశ్రమ ఉద్యోగులు ఎక్కువగా పొడిగా మిగిలిపోయారు. ఈ సమస్యలు చాలా ముఖ్యమైనవన్నారు.

**వినతిపత్రాలు అందజేత :** అన్ని రాజకీయ పార్టీలు, ఎంపీలతో పాటు వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు కూడా మా డిమాండ్‌లకు మద్దతివ్వాలని కోరుతూ బిజెపి అధ్యక్షులు నాయని ప్రసాద్, కాంగ్రెస్ అధ్యక్షులు గూడూరి ఆంజనేయులు గౌడ్ లకు వినతిపత్రాలు అందజేశారు. రాబోయే ఎన్నికలలో మీ అజెండాలో వాటిని చేర్చవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు నాగరాజు, రాష్ట్ర దాడుల వ్యతిరేక కమిటీ సభ్యులు మిన్పూర్ శ్రీనివాస్, ఐజెయూ మాజీ సభ్యులు కంది శ్రీనివాస్ రెడ్డి, ఫారూక్ హుస్సేన్, జిల్లా నాయకులు సుమన్, ఫసియుద్దీన్, మురళీధర్, రమేష్, సిద్దేశం, రామన్న, గిరి, సుధాకర్, శ్రీనివాస్, గోవర్ధన్ రెడ్డి, శ్రీకాంత్, చంద్రశేఖర్, వసీం పాల్గొన్నారు.

## వేగవంతంగా ప్రజాపాలన పెండింగ్ దరఖాస్తుల ప్రక్రియ

**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి :** ప్రజాపాలన పెండింగ్ దరఖాస్తుల ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అధికారులను ఆదేశించారు. శనివారం లింగాలఘనపురం మండల తహాశీల్దార్ కార్యాలయాన్ని అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దస్త్రాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. రికార్డు రూంలను పరిశీలించారు. అనంతరం ఎంపిడిఓ కార్యాలయాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఫారం 6 గురించి వివరించారు. రెండు ఓట్లు, మరణించిన వారి ఓట్ల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ప్రజాపాలన దరఖాస్తులు, సవరణ ఆధార్‌లో అనుసందానం సంబందిత వివరాలు అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సమస్యను పక్కా ప్రణాళికలో పరిష్కరించాలన్నారు. వేసవి కాలం దృష్ట్యా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిరంతరం తాగునీరు అందించే విధంగా చూడాలని ఆదేశించారు. చేతిపంపులు, బోర్లు మరమ్మత్తు చేయాలని, వాటర్ సప్లయ్ పనులు ఆగిపోకుండా చూడాలన్నారు. గ్రామ పంచాయితీ పరిధిలో తాగునీటి సమస్యల లేకుండా చూడాలన్నారు. ఈజిఎస్, శానిటేషన్ పనులపై యాక్షన్ ప్లాన్‌ను త్వరగా రూపొందించాలని ఆదేశించారు. ఈ తనిఖీలో తహశీల్దార్ వినయలత, ఎంపిడిఓ జి జలేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



## మెదక్ జిల్లా ఉద్యమకారులకు అన్యాయం

మెదక్ బిజెపి పార్లమెంట్ అభ్యర్థి , మాజీ ఎంఎల్‌ఎ రఘునందన్‌రావు

**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** తెలంగాణ ఉద్యమానికి పురిటి గడ్డయైన మెదక్ జిల్లాలో ఎంపి టికెట్ విషయంలో మరోసారి అన్యాయం జరిగిందని.. ఎంపి సీటును సైతం పొరుగు జిల్లాకు చెందిన వెంకట్రామ్‌రెడ్డికి కేటాయిచటం ఉద్యమకారులకు మోసం చేయడమేనని బిజెపి పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావు ఆరోపించారు. జిల్లాలో బిఆర్ఎస్ పార్టీకి అభ్యర్థులు కరువైనట్లు డబ్బులకు ఆశపడి వందల కోట్లకు మెదక్ ఎంపీ టికెట్ అమ్ముకున్నారని ఆరోపించారు. శనివారం స్థానిక శివానుభవ మండపంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో గత 20 ఏండ్లుగా పక్క జిల్లాకు చెందిన తన్నీరు హరీష్‌రావు మెదక్ జిల్లా ప్రజల భరిస్తున్నారన్నారు. హరీష్‌రావు ముందు చూపుతోనే జిల్లాల పునర్విభజనలో తన సొంత గ్రామాన్ని తోటపల్లిని సిద్దిపేట జిల్లాలో కలుపుకున్నట్లు తెలిపారు. తెలంగాణ ఉద్యమమే స్థానికులకు, స్థానికేతరుల మధ్య జరిగిందన్నారు. ఇప్పుడు మరోసారి జిల్లా ఉద్యమ కారులకు, పార్టీని నమ్ముకున్న కార్యకర్తలు, నాయకులకు అధిష్టానం అన్యాయం చేసిందన్నారు. సిద్దిపేట జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన వెంకట్రామ్‌రెడ్డి ప్రాజెక్టుల నిర్మాణం పేరిట 50 వేల ఎకరాల భూములను పోలీసు బలగాలతో బలవంతంగా తీసుకొని నిర్వాసితులకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. భూ నిర్వాసితులను హరగోస పెట్టిన బిఆర్ఎస్ ఎంపి అభ్యర్థి వెంకట్రామ్‌రెడ్డి భాగోతాన్ని బట్టబయలు చేస్తామని హెచ్చరించారు. ఈసమావేశంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు వంగరాంచంద్రారెడ్డి జిల్లా నాయకులు తోకల ఉమారాణి, ఉపేందర్ రెడ్డి, దినేష్, నరేష్, విభీషన్‌రెడ్డి, జ్యోతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మతోన్మాదులకు వ్యతిరేకంగా పోరాడిన ధీరుడు భగత్‌సింగ్

ఎఐవైఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు తాళ్లపల్లి సురేందర్




**ప్రజా పక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** మతోన్మాదులకు వ్యతిరేకంగా పోరాడిన ధీరుడు భగత్‌సింగ్‌కు ఘనమైన నివాళి అని ఏఐవైఎఫ్ మాజీ నాయకులు తాళ్లపల్లి రమేష్ తాళ్లపల్లి సురేందర్ అన్నారు. షాహిద్ సర్దార్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల 93వ వర్ధంతి సందర్భంగా ఓదెల మండలం కనగర్తి గ్రామంలో కొవ్వొత్తులతో వారికి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఆనాటి ముగ్గురు అమరులు చేసిన త్యాగం ఈ దేశ ప్రజలు మరువలేని దిది అలాంటి పోరాటమే దేశంలో ఉన్న పాలక మతోన్మాద బిజేపి ప్రభు త్వం పైన పోరాడాల్సిన అవసరం ఉందని తెలిపారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదుల కంటే భయంకరమైనటువంటి మతోన్మాదాన్ని ఈ దేశంలో ప్రేరేపిస్తూ దేశంలో మత చిచ్చు రేపుతున్న మతోన్మాదులను వారి ఆలోచన విధానాలను వారి వల్ల ఈ దేశానికి జరిగేటువంటి నష్టాన్ని ప్రజలందరూ గమనించాలి అని చెప్పేసి కోరుతున్నాం. ఈ కార్యక్రమంలో యూత్ నాయకులు తాళ్లపల్లి ఓదెలు, ఎర్ర పోచయ్య, కొమురయ్య, అభి తాళ్లపెల్లి మహేష్, ఎఐవైఎఫ్ కనగర్తి శాఖ నాయకులు కొలిపాక శ్రీనివాస్ ,సారయ్య ,తాళ్లపల్లి శ్రీనివాస్ ,లెనిన్ భరత్ కిరణ్ పాల్గొన్నారు.

**భగత్‌సింగ్ వర్ధంతిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలే అధికారికంగా జరపాలి**

**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి :** జగిత్యాల పట్టణంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ 93వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ పట్టణ అధ్యక్షులు శివసాయిరెడ్డి మాట్లాడుతూ దేశ స్వతంత్రం కోసం 23 ఏళ్లకే తన ప్రాణాల్ని నవ్వుతూ వదిలేసిన భగత్‌సింగ్ వర్ధంతిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలే అధికారికంగా నిర్వహించాలని నిరుద్యోగ యువత కోసం భగత్‌సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ యాక్ట్ ఏర్పాటు చేయాలని , భగత్‌సింగ్ జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని దేశం కోసం ప్రాణాలర్పించిన వారిని సరైన గౌరవాన్ని దక్కించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అక్రమ్ మాలిక్, జిల్లా సంయుక్త కార్యదర్శి రాహుల్, నాగరాజ్, అర్చన, కల్యాణి, సుతుక్రుని స్రవంతి, కీర్తన, సంజయ్, వేణు, అక్షయ్‌కుమార్, మనోజ్, అబూ, వరుణ్ సాయితేజ పాల్గొన్నారు




**ప్రజాపక్షం/రామకృష్ణపూర్ :** పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో భగత్ సింగ్ 93వ వర్ధంతిని శనివారం నాడు పట్టణ సిపిఐ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ కార్యదర్శి మిట్టపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ మతోన్మాదులకు వ్యతిరేకంగా పోరాడటమే భగత్ సింగ్‌కు ఘనమైన నివాళి అని అన్నారు. షాహిద్ సర్దార్, భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల 93వ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించడం జరిగిందని, బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ముగ్గురు అమరులు చేసిన త్యాగం ఈ దేశ ప్రజలు మరువలేనిదని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు మిట్టపెల్లి పౌల్, నక్క వెంకటస్వామి, వనం సత్యనారాయణ, సాంబయ్య, ఈరవేని రవి, శంకర్, సత్యనారయణ, కిష్టయ్య, గోవిందుల రమేష్, కొమురయ్య, మరపెళ్ళి రవి, లక్ష్మణ్ రావు, రాజన్న తదితరులు పాల్గొన్నారు.




**ప్రజాపక్షం/బోథ్ :** భగత్ సింగ్ 93వ వర్ధంతి సందర్భంగా బోథ్ పట్టణంలోని భగత్ సింగ్ చౌక్ లో శనివారం ఆయన విగ్రహానికి పలువురు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. దేశంలో జరుగుతున్న మత విద్వేష రాజకీయాలకు దూరంగా ఉండి సర్వమత సామరస్యం కోసం నేటి యువత కృషి చేయాలని బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాగభూషణం స్కూల్ కరస్పాండెంట్ కిశోర్, కాంగ్రెస్ అధికార ప్రతినిధి పసుపుల చంటి, బోథ్ మాజీ సర్పంచ్ సురేందర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గట్ల గంగాధర్ పాల్గొన్నారు.



## క్షయ వ్యాధిని నిర్మూలించాలి

అదనపు కలెక్టర్ జే అరుణశ్రీ



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** క్షయ వ్యాధిని నిర్మూలించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె అరుణ శ్రీ అన్నారు.ప్రపంచ క్షయ నిర్మూలన దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్యాధికారి కార్యక్రమంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ క్షయ వ్యాదిని 24 మార్చి, 2025 వరకు నిర్మూలించుటకు క్షేత్ర స్థాయిలో పనిచేసే ఎఎన్ఎం, ఆశ లదే ముఖ్య భూమిక అని,క్షయ వ్యాధి లక్షణాల గురించి,ప్రభుత్వం అందించుచున్న సేవల గురించి ప్రజలలో అవగాహన కల్పించాలన్నారు. అదే విధంగా అంగన్ వాడీ కార్యకర్తల, స్వయం సహాయక బృందాల సహాయంతో అవగాహన కార్యక్రమాలను ముందుకు తీసుకుపోవాలని సూచించారు. ఈ సందర్భంగా క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రభుత్వం అందించుచున్న సేవలను జిల్లా ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా డా. కె. ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ క్షయ వ్యాధి మందులకు తగ్గే వ్యాధి సక్రమంగా మందులు వాడితే పూర్తిగా నయమవుతుంది. ఈ కార్యక్రమములో డోర కమ్మ, యస్. వెంకటేశ్వర్లు, ప్రతాపరెడ్డి, ఎ. మధుసూధన్, ప్రభాకర్ రాజేందర్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## 26న జంబుగలోని పండ్ల తోటల వేలం

**ప్రజాపక్షం /కాగజ్ నగర్ రూరల్ :** ఐటిడిఎ ఉట్నూర్ పరిధిలోని కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ మండలంలోని జంబుగా ఉద్యాన నర్సరీ (హెచ్ఎన్‌టిసి) లోని పండ్ల తోటల ఫల సాయాన్ని ఈనెల 26 న వేలం వేయనున్నట్లు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారిణి ఖుష్బూ గుప్తా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జంబుగా ఐటిడిఎ ఉద్యాన నర్సరీ లో ఉన్న సపోటా, మామిడి, నిమ్మ తోటల ఫల సాయాన్ని మార్చి 26 మంగళవారం ఉదయం 11 గంటలకు జంబుగా తోటలో వేలం పాట ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల వ్యాపారస్తులు, సంస్థలు వేలంపాట (ఓపెన్ ఆక్షన్)లో పాల్గొనాలని కోరారు. పూర్తి వివరాల కోసం ఉట్నూర్ ఐటిడిఎ లోని ప్రాజెక్ట్ హార్టికల్చర్ ఆఫీసర్ (పిహెచ్ఒ), ఉద్యాన అధికారి సుధీర్ కుమార్ (9032313933), జంబు నర్సరీ సాంకేతిక అధికారి సాయి రాజ్ (8897478825) లను సంప్రదించాలని కోరారు.

## వేసవిలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలి

**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** శ్రీరాంపూర్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న కార్మికులు వేసవిలో ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరిస్తూ, మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని ఐఎన్‌టియుసి శ్రీరాంపూర్ ఏరియా కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఫిట్ కార్యదర్శి బి. రమేష్ అన్నారు. శనివారం ఐఎన్‌టియుసి జనరల్ సెక్రెటరీ, మినిమం వేజెస్ కార్పొరేషన్ చైర్మన్ బి. జనక్ ప్రసాద్, శ్రీరాంపూర్ బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ జెట్టి శంకర్ రావుల ఆదేశాల మేరకు వర్క్ షాప్ డిజిఎంకు మెమొరాండం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణిలో ఉపరితలాల్లో పనిచేసే కార్మికులకు వేసవికాలం ఎండ బారి నుండి రక్షించడానికి ఒఆర్ఎస్ ప్యాకెట్లు, చల్లని తాగునీరు, మజ్జిగ, నిమ్మరసం సదుపాయాలు కల్పించాలని అన్నారు. అన్ని రూములలో వాటర్ కూలర్స్, రోడ్లలో ట్యాంకర్లతో వాటర్ స్ప్రే చేయించాలని పేర్కొన్నారు. ఎప్పటికప్పుడు వాహనాల మెయింటెనెన్స్ చేయించాలని అన్నారు. ప్రాథమిక మౌలిక సదుపాయాలను వెంటనే కల్పించాలని యాజమాన్యాన్ని కోరారు. వర్క్ షాప్ లో మూడు షిఫ్ట్ లలో మ్యాన్ పవర్ చాలా తక్కువగా ఉందని అన్నారు. ఉన్న కార్మికులకు అదనపు బాధ్యతలు అప్పజెప్పుతు కార్మికులపై పని ఒత్తిడి పెంచుతున్నారని ఆరోపించారు. వెంటనే ఐఇడి తో స్టడీ చేయించి మ్యాన్ పవర్‌ని పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టియుసి నాయకులు బ్రహ్మాచారి, రామస్వామి,మహేష్ రాజు, రవి,రాజేశ్వర్ గౌడ్, సతీష్, దుర్గయ్య, సుధాకర్, రాజనారాయణ, రాయలింగు, ఆనందం, ఎ. శ్రీనివాస్, డి. శ్రీనివాస్, గోపి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## లక్ష్మి వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

**ప్రజాపక్షం / ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని వేములకుర్తి గ్రామంలోని అతిపురాతన శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభం అయ్యాయి. శనివారం ఆలయంలోని యజ్ఞ అర్చకులు చక్రపాణి నర్సింహమూర్తి చార్యులు స్వామివారి మూలవిరాట్, ఉత్సవ మూర్తులకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. ఆలయంలోని యజ్ఞ మండపంలో స్వామివారిని అవహనం చేసి శాంతి యజ్ఞం ప్రారంభించారు. అనంతరం స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు మంత్రరాజం శ్రీనివాస్ చార్యులు, మంత్రరాజం జానకి రామకృష్ణచార్యులు, మంత్రరాజం అరవింద్ కృష్ణాచార్యులు, ఆలయ కమిటీ చైర్మన్ ఆరె నరేందర్, కుమ్మరి పెల్లి మల్లేష్, దొనికెన మహేందర్, కనపర్తి సురేష్, కట్కం నారాయణ, తులి శ్రీధర్, రాధారపు ప్రవీణ్, బాస మల్లేష్, బర్మ రాజు, గుడ్ల అశోక్, భూక్య బాపులాల్, శంకర్, జితేందర్, గంగారాం, చిన్న రాజం, రెడ్డి, లస్మన్న, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

**ప్రజాపక్షం / ధర్మపురి :** జగిత్యాల జిల్లా ధర్మపురి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. జాతరలో 4వ రోజైన శనివారం భక్తులు అధిక సంఖ్యలో ఉత్సవాలకు హాజరయ్యారు. ఏటా జరిగే ఈ ఉత్సవాలలో నిజామాబాద్, నిర్మల్, మహారాష్ట్రలోని నాందేడ్ ప్రాంత భక్తులు అధిక సంఖ్యలో హాజరై పవిత్ర గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ లక్ష్మి నృసింహుడిని దర్శించుకుంటారు. క్షేత్రంలో రెండు మూడు రోజులు సేదతీరి స్వామివారి సన్నిధిలో గడుపుతారు. ఈ సారి బ్రహ్మోత్సవాలలో చేసిన ఏర్పాట్ల పట్ల భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జాతర నిర్వహణలో తీసుకోవాల్సిన చర్యలపై రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జిల్లా కలెక్టర్ యాస్మిన్ బాషా అధికారులతో పలు ధఫాలుగా ఏర్పాట్లపై సమీక్షించారు. ముఖ్యంగా ఎండలు మండుతుండడంతో గోదావరి నదీతీరంలో చలువ పందిళ్లు, స్నానాలకై షవర్ల ఏర్పాటు, చల్లటి మినరల్ నీటిని అందిస్తూ 20చలివేంద్రాల ఏర్పాటు, జా తర జరుగుతున్న 13 రోజుల పాటు ఉచిత అన్నదానం కార్యక్రమాలపై భ క్తులు సంతోషం వెలుబుచ్చుతున్నారు. దేవస్థానం ఉత్సవ కమిటీ అధ్యక్షు లు జక్కు రవీందర్, కమిటీ సభ్యులు, ఆలయ ఈవో సంకటాల శ్రీనివా స్, మున్సిపల్ కమిషనర్ ఎం. శ్రీనివాస్ రెడ్డి, సిఐ రాం నర్సింహరెడ్డి, ఎస్సై ఉదయ్ కుమార్‌లు జాతర ఏర్పాట్లను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.

**నేడు తెప్పోత్సవం.. డోలోత్సవం..**

బ్రహ్మోత్సవాలలో ముఖ్య వేడుకలైన స్వామివారల తెప్పోత్సవం, డోలోత్సవంలో మొదటిదైన శ్రీ యోగా నృసింహస్వామి వారి తెప్పోత్సవం, డోలోత్సవం ఆదివారం వైభవంగా జరగనుంది. మధ్యాహ్నం మూడు గంటలకు స్వామివారలను సేవా పల్లకిలో కోనేరుకు తీసుకువచ్చి అంగరంగ వైభవంగా కార్యక్రమం నిర్వహించనున్నారు. వేడుకను తిలకించేందుకు సుదూర ప్రాంతాల నుండి భక్తులు తరలిరానున్నారు. దీని కోసం ఆలయ పక్షాన ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు.



## స్టోర్స్, టింబర్‌యార్డ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

స్టోర్స్ డిజిఎంకు గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) నాయకులు వినతిపత్రం



**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** శ్రీరాంపూర్ ప్రాంతంలోని స్టోర్స్, టింబర్ యార్డ్ లోని కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలని గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) నాయకులు స్టోర్స్ డిజిఎం కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన డిప్యూటీ ప్రధాన కార్యదర్శిలు కె. వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కె బాజీ సైదాలు మాట్లాడుతూ సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగి మూడు నెలలు కావస్తున్న యాజమాన్యం గుర్తింపు పత్రం ఇవ్వకపోవడం వలనే, సేఫ్టీ మైన్స్ కమిటీ, ఏరియా స్ట్రక్చర్ సమావేశాలు నిర్వహించకపోవడం వల్లనే ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు. వెంటనే యాజమాన్యం గుర్తింపు పత్రం అందజేసి సమావేశాలు నిర్వహించాలని, ఏరియా స్టోర్స్‌లో మహిళ ఉద్యోగినిలకు అన్ని సౌకర్యాలతో కూడిన రెస్ట్ హాళ్లను నిర్మించాలని, మహిళా ఉద్యోగినిలకు, మినిస్ట్రియల్ స్టాఫ్‌కు వేరు వేరుగా ప్రత్యేక వాష్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో మాదిరిగా గనులకు, డిపార్ట్మెంట్‌లకు కేటాయించిన స్టోర్స్ డే రోజున మాత్రమే మెటీరియల్ ఇచ్చే ఏర్పాటు చేయాలని, గతంలో శ్రీరాంపూర్ స్టోర్స్‌లో ఉన్నట్లుగా డ్యూటీ సమయంను 8గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు మార్పు చేయాలని కోరారు. నిబంధనల మేరకు రక్షణను దృష్టిలో ఉంచుకొని లోడింగ్, అన్‌లోడింగ్ పనుల నిమిత్తమై టెండల్ సూపర్‌వైజర్‌ను పూర్తి స్థాయిలో నియమించాలని, మినిస్ట్రియల్ స్టాఫ్‌కు కాలం చెల్లిన కంప్యూటర్ స్థానంలో కొత్త కంప్యూటర్లు, కంప్యూటర్, కుర్చీలు ప్రతి సెక్షన్‌లో ప్రింటర్స్‌ను ఏర్పాటు చేయాలని అన్నారు. దాదాపు 5 సంవత్సరాల నుండి సాయల్ యాక్టింగ్ చేస్తున్న వారికి సాయల్ ప్రమోషన్స్ ఇవ్వాలని, టింబర్ వర్క్ మెన్స్ అందరూ దాదాపు 15 సంవత్సరాల నుండి కేటగిరి 1 క్రింద పనిచేస్తున్నారని, వారందరికీ జనరల్ మజ్దూర్ ప్రమోషన్ కల్పించి కేటగిరి 5 లేదా4 ఇవ్వాలని తెలిపారు. ఏరియా స్టోర్స్, టింబర్ యార్డ్ కలిపి మొత్తంగా వంద మందికి పైగా ఉన్నారని, అంతే కాకుండా కాంట్రాక్టు కార్మికులు కూడా వందల మంది పని చేస్తున్నారని వివరించారు. గనుల నుండి వచ్చే ఉద్యోగుల వెహికల్స్ పార్కింగ్ చేయడానికి ప్రస్తుతం ఉన్న పార్కింగ్ షెడ్ ఏమాత్రం సరిపోవడం లేదని, కావున పార్కింగ్ స్థలాన్ని విస్తరింపచేస్తూ, తదితర సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫిట్ కార్యదర్శులు వంగ కుమారస్వామి, ఎద్ల సమ్మయ్య, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, ఫిట్ సహాయ కార్యదర్శి అశోక్, నాయకులు మల్లయ్య, శంకర్, సదయ్య, దాని, స్పందన, శివ జ్యోతి, శైలజ పాల్గొన్నారు.

## ఎల్లంపల్లిలో నీళ్లున్నా పంటలు ఎండబెడుతున్నారు : పుట్ట



**ప్రజా పక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** ఎల్లంపల్లి, ఎస్సారెస్పీ ప్రాజెక్టుల్లో నీళ్లున్నా ఈ ప్రాంత రైతులకు సాగునీరు అందించకుండా పంటలు ఎండబెడుతున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక పాలకులకే దక్కుతుందని మాజీ ఎమ్మెల్యే, పెద్దపల్లి జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధుకర్ అన్నారు. శనివారం మంథని మండలం సూరయ్యపల్లి శివారులో ఎండిపోయిన పంటలను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టుల నీళ్ల తరలించుకుపోతున్నారని, స్థానిక రైతులకు చుక్క నీళ్లు ఇవ్వడం లేదని అప్పటి ప్రభుత్వాన్ని బదనం చేసిన కాంగ్రెస్ నాయకులు, పాలకులు ఈనాడు వాళ్ల ప్రభుత్వంలో నీళ్ల వాటాను ఎందికిస్తలేరని ఆయన ప్రశ్నించారు. వర్షాకాలంలో పంటలు సాగు చేసిన రైతులకు యాసంగి పంటకు అవసరమైన సాగునీరు అందిస్తామని ప్రకటనలు చేశారని, స్థానిక నాయకులు తమ నాయకుడు అధికారులతో మాట్లాడాడని, ఇక నీళ్లు వస్తాయని ప్రచారం చేయడంతో రైతులు గంపెడంత ఆశతో పంటలు సాగుచేసుకున్నారని అన్నారు. తీరా సమయానికి ఒక్క చుక్క నీళ్ల అందించడం లేదని, నీళ్లు లేక పంటలు ఎండిపోతుంటే రైతులు ఆగమవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఈ ప్రాంత పాలకులు, ప్రభుత్వం రైతుల గురించి ఆలోచన చేయాలని, ఎండిన పంటలకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

## తాగునీరు అందించే దిశగా చర్యలు



**ప్రజాపక్షం/ సుల్తానాబాద్ :** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వేసవి కాలంలో మంచినీటి సమస్యలు ఏర్పడకుండా మున్సిపల్ పరిధిలోని ప్రజలందరికీ సకాలంలో తాగునీరు అందించే దిశగా ఎప్పటికప్పుడు ట్యాంకుల పరిశీలన చేపడుతున్నామని సుల్తానాబాద్ మున్సిపల్ కమిషనర్ కట్ల వేణుమాధవ్ అన్నారు. శనివారం మున్సిపల్ పరిధిలో ని బాలికల ఉన్నత పాఠశాల , జూనియర్ కళాశాల, ఆర్ అండ్ బి లో గల మంచినీటి ట్యాంకులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ట్యాంకులు ఎంత నీటి సామర్థ్యం కలిగి ఉన్నాయని ఒక్కో ట్యాంకు ద్వారా ఎన్ని కాలనీలకు నీరు సరఫరా జరుగుతుందని, ట్యాంకు లో ఎంత సామర్థ్యం వరకు నీరు నిల్వ ఉంటుందని అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు ట్యాంకులను బ్లీచింగ్ పౌడర్ ద్వారా శుభ్రపరుస్తూ స్వచ్ఛమైన త్రాగునీరును అందించే దిశగా చర్యలు చేపడుతున్నామని అన్నారు. నిత్యం మంచినీరును ప్రజలకు అందించుచున్నామన్నారు. ఎక్కడ లీకేజీలు లేకుండా చర్యలు చేపడుతున్నామని, వేసవికాలంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం గట్టెపల్లి మానేరువాగు అశోక్ నగర్ ఓ హెచ్ ఎస్ ఆర్ బావిని సందర్శించి మంచినీటి సరఫరాను పరిశీలించారు. ఈ కార్యక్రమం లో పి హెచ్ ఓ ఎస్సీ(వరంగల్ )శ్రీనివాస్ రావు, ఈ ఈ పిహెచ్ (కరీంనగర్ )సంపత్ రావు, మిషన్ భగీరథ ఏ ఈ సంపత్, మున్సిపల్ ఏ ఈ సతీష్ , పలువురు పాల్గొన్నారు.

## జర్నలిస్టులపై కేంద్రం నిర్లక్ష్య ధోరణి

జర్నలిస్ట్ డిమాండ్స్ డే లో వక్తలు

జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా.. కలెక్టర్‌కు వినతి



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** జర్నలిస్టులపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తుందని టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి అరిగెల నాగేశ్వర్ రావు , ఆసిఫాబాద్ ఎంపిపి మల్లికార్జున్, సింగల్ విండో చైర్మన్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు అలీ బీన్ అహ్మద్, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్, బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్ , టియుడబ్ల్యుజె (ఐజేయు) జిల్లా అధ్యక్షులు అబ్దుల్ రహమాన్‌లు మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమాన్ని, మీడియా రంగాన్ని విస్మరిస్తున్న వైఖరికి నిరసనగా ఇండియన్ జర్నలిస్టు యూనియన్ షహీద్ భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా జర్నలిస్ట్ డిమాండ్స్ డే పిలుపుమేరకు శనివారం జిల్లా కలెక్టరేట్ ఎదుట టియుడబ్ల్యుజె ఆధ్వర్యంలో జర్నలిస్టులు ధర్నా చేపట్టారు. జర్నలిస్టుల ధర్నాకు వివిధ రాజకీయ పార్టీలు ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. అంతకముందు షహీద్ భగత్ సింగ్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించి ధర్నా కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ మీడియా రంగంలో డిజిటల్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా వచ్చిన నేపథ్యంలో కొత్తగా మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఫోర్త్ ఎస్టేట్ గా ఉన్న మీడియాలో పని చేస్తున్న జర్నలిస్టుల భద్రత, స్వేచ్ఛ కోసం ప్రత్యేకంగా ప్రభుత్వం ఒక చట్టం తేవాలని డిమాండ్ చేశారు . ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో కీలకపాత్ర పోషిస్తున్న మీడియాకు కేంద్ర ప్రభుత్వం విస్మరించడం సబబు కాదని, వెంటనే జర్నలిస్టుల ప్రధానమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్ వెంకటేష్ దౌత్రేకు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యుజె జిల్లా కోశాధికారి ఆడప సతీష్, జిల్లా అక్రిడేషన్ కమిటీ మెంబర్ ప్రకాష్ గౌడ్, టియుడబ్ల్యుజె జిల్లా ఉపాధ్యక్షులు నవీన్ గౌడ్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీలు దేవునూరి రమేష్, బొజ్జ మహేష్, ఎలక్ట్రానిక్ మీడియా విభాగం అధ్యక్ష ప్రధాన కార్యదర్శి బిక్కాజి, రమేష్, జిల్లా నాయకులు సురేష్ చారి, వారణాసి శ్రీనివాస్, అమూల్ గౌడ్, హరికృష్ణ, రాధాకృష్ణ చారి, నాగరాజ్, జర్నలిస్టులు రవి పాల్గొన్నారు.



## పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి:** సరైన పోషకాహారం తీసుకోవడం వల్లే తల్లి, బిడ్డలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని ఐసీడిఎస్ జగిత్యాల అర్బన్ సూపర్‌వైజర్ కవితా రాణి అన్నారు. శనివారం పట్టణంలోని విజయపురి అంగన్‌వాడీ కేంద్రంలో లబ్దిదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భవతులు బాలింతలు పాటించాల్సిన జాగ్రత్తలు, తీసుకోవాల్సిన పోషకాహారం టీకాలు తదితర అంశాల గురించి అవగాహన కల్పించారు. రక్తహీనత వల్ల గర్భిణీలు బాలింతలు ఎదుర్కోనే ఆరోగ్య సమస్యలు, రక్తహీనతను అధిగమించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సూపర్‌వైజర్ వివరించారు. గర్భం దాల్చినప్పులికి నుండి ప్రసూతి అయ్యేవరకు గల 1000 రోజుల ప్రాముఖ్యతను వివరిస్తు వారు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలిపారు. ఆకుకూరలు , చిరుధాన్యాలు, పండ్లు ఆహారంలో ఉండేలా చూసుకోవాలని సూచించారు.అనంతరం తల్లులచే ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు దయావతి, అరుణ, యతీశ్వరి, కళావతి, మాధవి, సీమ, లక్ష్మి , జయమాల, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలు, మహిళల సంక్షేమానికి కృషి

జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్



**ప్రజాపక్షం/ మంచిర్యాల ప్రతినిధి :** జిల్లాలోని అంగన్‌వాడి కేంద్రాల ద్వారా పిల్లలు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికల సంక్షేమానికి అధికారుల సమన్వయంతో కృషి చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శనివారం జిల్లాలోని హాజీపూర్ మండలంలోని వేంపల్లి, రాపల్లి 2, పడ్తనపల్లి అంగన్‌వాడి కేంద్రాలను జిల్లా స్త్రీ, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ అధికారి కె. చిన్నయ్య. మంచిర్యాల ప్రాజెక్టు సిడిపిఒ ఎ. విజయలక్షితో కలిసి ఆకస్మిక తనిఖీ చేసి అంగన్వాడీ కేంద్రాలలో అందించే ఆహార పదార్థాల నాణ్యత, రిజిస్టర్లు, రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్‌వాడి కేంద్రాల పరిధిలోని పిల్లల ఆరోగ్య స్థితిగతులపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, పిల్లలు, గర్భిణులు, కిశోర బాలికలకు పౌష్టికాహారాన్ని సకాలంలో అందించాలని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల పరిధిలో గర్భం దాల్చిన మహిళలు తమ వివరాలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రులలో నమోదు చేసుకోవడంతో పాటు వారి ఆరోగ్య పరిస్థితులను పర్యవేక్షిస్తూ సమయానుసారంగా అవసరమైన పరీక్షలు చేయించుకునేలా వారికి అవగాహన కల్పించాలని తెలిపారు. అంగన్‌వాడి కేంద్రంలోని పిల్లల బరువు, ఎత్తు, కొలతలు, మానసిక స్థితిగతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ఎదుగుదల తక్కువగా, అతి తక్కువగా ఉన్న పిల్లలను గుర్తించి వారికి పౌష్టికాహారం, మందులను సకాలంలో అందిస్తూ మామూలు పిల్లల స్థితికి వచ్చే వరకు వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. పిల్లల ఎదుగుదలపై పర్యవేక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, అంగన్‌వాడి టీచర్లు, సూపర్వైజర్లు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని తెలిపారు. అంగన్‌వాడి కేంద్రాలలో నిర్వహించిన పిల్లల అక్షరాభ్యాసం కార్యక్రమంలో పాల్గొని పిల్లలచే అక్షరాలు దిద్దించారు. అన్నప్రాసన, శ్రీమంతం కార్యక్రమాలలో పాల్గొని, అందరిచే పోషణ పక్షం ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పడతనపల్లి గ్రామంలోని నర్సరీని మండల పరిషత్ అభివృద్ధి అధికారి మధుసూదన్, హాజీపూర్ డి.టి. హరితలతో కలిసి సందర్శించి రిజిస్టర్లు, మొక్కల సంరక్షణ చర్యలను పరిశీలించారు. వేసవికాలం అయినందున మొక్కలకు సకాలంలో నీటిని అందించాలని, ఎండ వేడి నుండి రక్షించేందుకు గ్రీన్ మ్యాట్లను ఏర్పాటు చేయాలని నర్సరీ నిర్వాహకులకు సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసి వార్డులను పరిశీలించి ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలపై వైద్యాధికారికి పలు సూచనలు చేశారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలతో స్నేహపూర్వకంగా మెదలాలని, వేసవికాలం అయినందున ఒఆర్ఎస్ ప్యాకెట్లు, వడదెబ్బ సంబంధిత మందులను అందుబాటులో ఉంచుకోవాలని, వైద్యులు, అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోషణ్ అభియాన్ జిల్లా సమన్వయకర్త బి.రజిత, అంగన్‌వాడి కేంద్రాల సూపర్వైజర్లు, టీచర్లు, మండల పంచాయతీ అధికారి, ఎపిఒ పంచాయతీ కార్యదర్శి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

